ముమ్మర వేట

- విచారణాధికారిగా ఒంగోలు డీఎస్పీ
- ఆన్‌లైన్ లావాదేవీలపై దృష్టి
- దుండగులు కనిగిరి శివారు ప్రాంతంలో బస్సు దిగినట్లు గుర్తింపు

వీరయ్య హత్య కేసులో నిందితుల కోసం గాలింపు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత వీరయ్యచౌదరిని అత్యంత కిరాతకంగా చంపిన హంతకుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఘటన జరిగిన రోజు చీమకుర్తి బైపాస్‌లోని ఓ హోటల్ సమీపంలో స్కూటీని పార్కు చేసి విజయవాడ - కనిగిరి బస్సు ఎక్కి వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. వారు కనిగిరి శివారు ప్రాంతంలో దిగినట్లు నిర్ధారణ అయ్యింది. ఆ రోజు విధుల్లో ఉన్న బస్సు డ్రైవర్, కండక్టర్‌లను పోలీసులు విచారించి కీలక సమాచారాన్ని సేకరించారు. అదేసమయంలో హంతకులు పొరుగు జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. వారికి నేర చరిత్ర ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో


వీరయ్య కార్యాలయ సిబ్బందిని విచారిస్తున్న ఎస్పీ దామోదర్ (ఫైల్)

ప్రధానంగా వారిపై ఏమి కేసులు ఉన్నాయి? అనే కోణంలో కూడా పోలీసులు సమాచారాన్ని సేకరించారు. కేసులో సూత్రధారులు, పాత్రధారుల మధ్య ఆన్‌లైన్ లావాదేవీలపై కూడా ప్రధానంగా దృష్టి సారించారు. ఒకవైపు నిందితుల కోసం వేట సాగిస్తూనే మరోవైపు అన్ని కోణాల్లోనూ లోతైన దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే కేసులో సూత్రధారులుగా భావిస్తున్న వారి బ్యాంక్ లావాదేవీలను పరిశీలిస్తున్నారు. ఎవరెవరు

మిగతా 6వ పేజీలో

పోలీసుల అదుపులో ఇసుక వ్యాపారి బావమరిది

కేసులో కీలక నిందితుడైన ఇసుక వ్యాపారి బావమరిదిని హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఇసుక వ్యాపారి అక్కడి నుంచి రైలులో పరారైనట్లు తెలుస్తోంది. ఆయనకు, వీరయ్య చౌదరికి మధ్య కూడా వివాదాలు ఉన్నట్లు తెలుస్తోంది. తనపై పోలీసు స్టేషన్లలో వీరయ్య కేసులు నమోదు చేయించాడని పగ పెంచుకున్నట్లు పోలీసులు సమాచారం సేకరించారు. ఈక్రమంలో మరికొంత మందితో కలిసి వీరయ్యచౌదరిని హత్య చేసేందుకు పథక రచన చేశారని భావిస్తున్నారు. ఇసుక వ్యాపారి బావమరిది హంతకులకు సహకరించాడని తెలుస్తోంది. హంతకులు లాడ్జిలో మకాం వేసిన సమయంలో వారికి కావాల్సిన సహకారం అందించినట్లు ప్రచారం జరుగుతోంది.



కప్పం కట్టాల్సిందే!

మార్కాపురంలో వైసీపీ ప్రజాప్రతినిధి పర్సంటేజీల గోల

- ముందుకురాని కాంట్రాక్టర్లు
- గత సంవత్సరం బిల్లులు రాక అవస్థలు
- మూడుసార్లు పిలిచినా స్పందించని వైనం
- సందిగ్ధంలో పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

మార్కాపురం మునిసిపాలిటీ పాలకవర్గంలోని ప్రధాన ప్రజాప్రతినిధి (వైసీపీ) ధనదాహానికి కాంట్రాక్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. ముందుగానే పర్సంటేజీని తనకు ఇస్తేనే పనులు మంజూరవుతాయని ఆయన బాహాటంగా చెప్తున్నట్లు తెలుస్తోంది. అదీకూడా గతం కంటే మించి అడుగుతున్నట్లు సమాచారం. గత సంవత్సరం ఏఎస్‌సీ గ్రాంట్ ద్వారా ట్యాంకర్లతో సరఫరా చేసిన నీటికి బిల్లులు నేటికీ రాలేదు. ఇప్పుడు మళ్లీ డబ్బులు ముందుగానే ఆ ప్రజాప్రతినిధికి చెల్లించి నీటి సరఫరా చేసే ధైర్యం తమకు లేదని కాంట్రాక్టర్లు మిన్నకుండిపోతున్నారు. పుర ప్రజల దాహార్తితో నాకేంటి నా కప్పం నాకు కట్టాల్సిందేనని సదరు ప్రజాప్రతినిధి నిస్సిగ్గుగా వ్యవహరించడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

మార్కాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. డీప్‌బోర్లు ఒట్టిపోతున్నాయి. మరోవైపు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నిండా సాగర్ నీళ్లున్నా సకాలంలో పుర ప్రజలకు అందించలేని దుస్థితి. ఈ పరిస్థితుల్లో గొంతెండుతోన్న పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా సరఫరానే దిక్కు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం రూ.40లక్షలు మంజూరు చేసింది. రోజుకు వంద ట్రిప్పుల చొప్పున మూడు మాసాలపాటు సరఫరాకు అనుమతులు ఇచ్చింది. ఈ నెలారంభంలోనే మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇప్పటికి మూడుసార్లు పిలిచినా ఎటువంటి స్పందన లేదు. అసలు కారణం ఏమిటని ఆరా తీస్తే మునిసిపాలిటీలోని కీలక ప్రజాప్రతినిధి ధనదాహమే కారణమన్న ప్రచారం నడుస్తోంది. వైసీపీకి చెందిన పాలకవర్గ ప్రధాన ప్రజాప్రతినిధి బాహాటంగానే పర్సంటేజీలు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది.

పట్టణంలో ప్రారంభమైన దాహం కేకలు

మార్కాపురం పట్టణానికి ప్రధాన తాగునీటి వనరు సాగర్ జలాలే. 80శాతం మేర ప్రాంతానికి అంతర్గత పైప్‌లైన్ ఉంది. త్రిపురాంతకం మండలం దూపాడులోని సాగర్ తూర్పు ప్రధాన కాలువ ద్వారా 2,200 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ట్యాంకులోకి

మిగతా 6వ పేజీలో


నాయనమ్మ ఆశీర్వచనం తీసుకుంటున్న ఉదయ్‌కృష్ణారెడ్డి(ఫైల్)

కష్టాలను దాటి.. ఉన్నతంగా ఎదిగి

ఐపీఎస్‌గా కానిస్టేబుల్

- సివిల్స్‌లో సత్తాచాటిన ఊళ్లపాలెం పేదింటి బిడ్డ
- సీఐ అవమానించారని ఉద్యోగాన్ని వదిలి సివిల్స్‌పై దృష్టి సారించిన ఉదయ్ కృష్ణారెడ్డి
- ఐదో ప్రయత్నంలో 350వ ర్యాంకు
- అభినందిస్తూ సీఎం చంద్రబాబు, లోకేష్ ట్వీట్


మెరైన్ కానిస్టేబుల్‌గా ఉన్న సమయంలో ఉదయ్‌కృష్ణారెడ్డి (ఫైల్)

ఆయన చిన్నతనంలో తల్లిని కోల్పోయారు. యుక్త వయసులోకి వచ్చే సరికి తండ్రి కూడా మృతి చెందారు. అయినప్పటికీ కుంగిపోలేదు. మరింత పట్టుదలతో చదువును కొనసాగించారు. నాయనమ్మ కూరగాయలు అమ్ముకుంటూ వచ్చే అరకొర డబ్బుతో అండగా నిలవడంతో డిగ్రీ చదువుతూనే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. ఆ బాధ్యతలు నిర్వహిస్తూనే సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. ఆసమయంలో ఆయన్ను మెరైన్ సీఐ ఒకరు వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. 60 మంది సిబ్బంది ఎదుట ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా అవమానించారు. దీంతో కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి కసి, పట్టుదలతో సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. వరుసగా మూడుసార్లు విఫలమైనప్పటికీ ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు. సంకల్పంతో ముందుకు సాగారు. నాలుగోసారి 780వ ర్యాంకు సాధించారు. మరలా పట్టువదలకుండా ఐదోసారి సివిల్స్‌లో సత్తాచాటారు. 350వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. దీంతో కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ సాధించారు. ఇది సింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెం గ్రామానికి చెందిన పేదింటి బిడ్డ మూలగాని ఉదయ్ కృష్ణారెడ్డి విజయ గాథ.

సింగరాయకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తీరప్రాంత గ్రామమైన ఊళ్లపాలెంకు చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డిది పేద కుటుంబం. చిన్నతనంలోనే తల్లి జయమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. డిగ్రీ చదివే సమయంలో తండ్రి శ్రీనివాసుల రెడ్డిని కూడా ఆయన కోల్పోయారు. తల్లిదండ్రులు మరణించడంతో కృష్ణారెడ్డితోపాటు ఆయన సోదరుడికి నాయనమ్మ అండగా నిలిచింది. గ్రామంలో కూరగాయలు అమ్ముతూ కష్టపడి వారిని చదివించింది. అందులో పెద్దవాడైన ఉదయ్‌కృష్ణారెడ్డికి చిన్నతనం నుంచే డాక్టర్ కావాలన్న ఆకాంక్ష ఉండేది. దానికి

మిగతా 6వ పేజీలో



రేపే పింఛన్‌లు

- 2.82 లక్షల మంది లబ్ధిదారులు
- రూ.123.23 కోట్లు విడుదల
- నేడు బ్యాంకుల నుంచి డ్రా
- బోగస్‌లు తొలగింపు

7

చల్లని నేస్తాలు

- మండుతున్న ఎండలు
- ఉపశమనం కోసం జనం పాట్లు
- శీతల పానీయాలకు, ఏసీలకు గిరాకీ
- పుచ్చకాయలు, తాటిముంజలకు డిమాండ్




మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు తీసుకునేందుకు వచ్చి ఇబ్బంది పడుతున్న దివ్యాంగ ఉపాధ్యాయులు

449మందికి ప్రాధాన్యత కేటగిరీ బదిలీ

- సర్టిఫికెట్లు జారీచేసిన మెడికల్ బోర్డు
- దివ్యాంగ టీచర్ల ఇబ్బందులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో వచ్చేనెలలో జరగనున్న ఉపాధ్యాయుల బదిలీల్లో 449 మంది ప్రాధాన్యత కేటగిరీలో ఉన్నారు. శారీరక వైకల్యం, వ్యాధులతో బాధపడుతున్న టీచర్లకు ఈ కేటగిరీలో బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈమేరకు ఏపీ ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం-25ను అమలులోకి తెచ్చింది. 56శాతానికి పైగా శారీరక వైకల్యం ఉన్నవారు, దీర్ఘకాలిక తీవ్ర వ్యాధులతో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్న వారు ఈ కేటగిరీ కింద ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని టీచర్లలో శారీరక వైకల్యం, వ్యాధులతో బాధపడుతున్న వారిని నిర్ధారించి వైద్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు ఈనెల 24 నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. 449మంది హాజరయ్యారు. వీరికి మంగళవారం స్థానిక రిమ్స్‌లో ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ఫీజు వసూలు

బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీ కింద లబ్ధి పొందేందుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దివ్యాంగ టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రిమ్స్‌లో లిఫ్టులు మొరాయించడంతో మూడో అంతస్తు మెట్లు ఎక్కేందుకు ఇబ్బందులు పడ్డారు. సర్టిఫికెట్లు ఇచ్చే వద్ద కూడా ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో నిల్చోలేనివారు నేలమీద కూర్చోవాల్సి వచ్చింది. వైద్య ధ్రువీకరణ పత్రాలకు టీచర్ల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని విద్యాశాఖ కమిషనర్, వైద్యారోగ్యశాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. కానీ ఒక్కో టీచర్ నుంచి రూ.2,500 వసూలు చేశారు. ఈ మొత్తాన్ని డిజిటల్‌గా చెల్లించేందుకు అవకాశం లేకపోవడంతో చేతిలో డబ్బులు లేక కొందరు ఏటీఎంలకు పరుగులు తీసి డ్రా చేసి చెల్లించి నగదు రసీదు, వైద్య సర్టిఫికెట్లు తీసుకున్నారు.

వైద్య ధ్రువీకరణ పత్రాల అందజేత

ఉమ్మడి జిల్లాలో 449 మందికి వైద్య ధ్రువీకరణ పత్రాలకు అర్హత లభించింది. దృష్టి లోపం, కంటికి

మిగతా 6వ పేజీలో

ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

- మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు
- 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం పలు


వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్

శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్రలో జిల్లాను భాగసామ్యం చేయడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీ4 స్ఫూర్తితో కేంద్రప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార, సేవా సంస్థలను తీసుకువస్తున్నారని తెలిపారు. ఈ విధానం ద్వారా జిల్లాలోని కిడ్నీ బాధితులను ఆదుకునేందుకు సీఎస్‌ఆర్ నిధులను రాబట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తద్వారా డయాలసిస్ సెంటర్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయవచ్చన్నారు. జిల్లాలో 729 గ్రామ పంచాయతీల్లోని 1,009 ఊళ్లలో ఫ్లోరైడ్ సమస్య ఉందన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు 27 గ్రామాల్లో రక్షిత తాగునీటి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. కనిగిరి ప్రాంతంలో 339, దర్శి ప్రాంతంలో 120, మార్కాపురం పరిధిలో 113 గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య ఉందన్నారు. నీటిలో పీపీఎం 1.5లోపు ఉండాల్సి ఉండగా కనిగిరిలో 1.98 నుంచి 3.19 వరకు ఉందన్నారు. 16వ ఆర్థిక సంఘం ప్రతినిధులకు ఫ్లోరిన్ సమస్య ఉన్న ప్రాంతాలకు అదనపు గ్రాంటు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కనిగిరి నియోజకవర్గంతోపాటు కొండపిలోని మర్రిపూడి మండలానికి పూర్తిస్థాయిలో రక్షిత తాగునీరు అందించాల్సిన అవసరం

మిగతా 6వ పేజీలో


మార్కాపురంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు చేస్తున్న జేసీ గోపాలకృష్ణ

జిల్లావ్యాప్తంగా తనిఖీలు

- ప్రతి మండలంలో తహసీల్దార్ల పరిశీలన
- చీమకుర్తి, పొదిలి, మార్కాపురంలో పాల్గొన్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పౌరసరఫరాల సంస్థ గోడౌన్లతోపాటు రేషన్ షాపులు, పెట్రోలు బంకులు, సినిమా హాల్స్, గ్యాస్ ఏజెన్సీలు, బాణసంచా గోడౌన్లలో రెవెన్యూ యంత్రాంగం మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశాలతో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్నిమాపక శాఖ, సివిల్ సప్లయీస్ అధికారులు ఎక్కడికక్కడ ఈ పని చేపట్టారు. జిల్లాలోని 30 పెట్రోలు బంకులు, 23 గ్యాస్ ఏజెన్సీలు, 23 రేషన్‌షాపులు, 11 ఎంఎల్ఎస్ పాయింట్లు, 11 రైస్ మిల్లులు, 6 బాణసంచా గోడౌన్లు, 15 ఆర్వో ప్లాంట్లు, ఒక ఐస్‌క్రీం ఇండస్ట్రీ, 9 సినిమా హాల్స్‌ను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నాయా? లేవా? అన్నది పరిశీలించారు. పెట్రోలు బంకుల్లో ధరల పట్టికలతోపాటు లీటరు కొలతలను పరిశీలించారు. సినిమా థియేటర్లలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వసతులు, రక్షణ చర్యలను చూశారు. మరోవైపు పౌరసరఫరాల గిడ్డంగుల్లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రేషన్‌షాపుల ద్వారా వచ్చేనెల 1 నుంచి సరుకులు పంపిణీ చేయాల్సి ఉండటంతో వాటికి సరఫరా చేసిన బియ్యం, చక్కెర నిల్వలను పరిశీలించి రిజిస్టర్లను చెక్ చేశారు. గ్యాస్ ఏజెన్సీల ద్వారా లబ్ధిదారులకు ఇస్తున్న సిలిండర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు వేసవికాలం కావడంతో బాణసంచా గోడౌన్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన అంశాలను అగ్నిమాపక శాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. తాగునీటిని అందించే వాటర్ ప్లాంట్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి నాణ్యతను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చీమకుర్తిలోని పెట్రోలు బంకుతోపాటు పొదిలిలో సినిమా థియేటర్‌ను, గ్యాస్ గోడౌన్‌ను, వాటర్‌ప్లాంట్‌ను తనిఖీ చేశారు. అక్కడ పరిసరాలను కూడా పరిశీలించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. మార్కాపురంలో అక్కడి సబ్‌కలెక్టర్‌తో కలిసి ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఆయా శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించారు. పూర్తిస్థాయి నివేదికలను నేడు రేపో జాయింట్ కలెక్టర్‌కు పంపనున్నట్లు సమాచారం.

కష్టాలను దాటి.. ఉన్నతంగా ఎదిగి

(5వ పేజీ తరువాయి)


ఉదయ్‌కృష్ణారెడ్డి(ఫైల్)

పేదరికం అడ్డుగా మారింది. డాక్టర్ కావాలన్న లక్ష్యాన్ని మార్చుకొని తన నాయనమ్మ రమణమ్మ సహకారంతో చదువుల్లో ముందుకు సాగారు. ప్రాథమిక, హైస్కూల్ విద్యను తెలుగు మీడియంలో స్వగ్రామమైన ఉళ్లపాలెం ఉన్నత పాఠశాలలో పూర్తి చేశారు. ఇంటర్, డిగ్రీని కావలి జవహర్ భారతిలో అభ్యసించారు.

తొలి ప్రయత్నంలో కానిస్టేబుల్‌గా!

డిగ్రీ తృతీయ ఏడాది చదువుతున్న సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డి తొలి ప్రయత్నంలోనే 2012లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అదేసమయంలో డిగ్రీని కూడా పూర్తి చేశారు. 2013లో గూడ్లూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. తరువాత రామాయపట్నం మెరైన్ కానిస్టేబుల్‌గా బదిలీ అయ్యారు. అక్కడ సీఐ ఆయన్ను ఇబ్బంది పెట్టారు. అఫ్ట్రాల్ నువ్వొక కానిస్టేబుల్‌వంటూ అవమానించారు. 'అడుగో ఐపీఎస్ వచ్చాడయ్యా..' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. ఒక రోజు ఐదు నిమిషాలు ఆలస్యంగా విధులకు హాజరుకావడంతో సిబ్బంది అందరు ముందు హేళన చేశారు. దీంతో 2018లో కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేశారు.

ఐదో ప్రయత్నంలో..

ఉద్యోగానికి రాజీనామా చేసిన విషయాన్ని ఉదయ్‌కృష్ణారెడ్డి ఇంట్లో వారికి చెప్పకుండా సివిల్స్ కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. రోజుకు 14 గంటలు పుస్తకాలతో కుస్తీ పట్టేవారు. తెలుగు మీడియంలో చదువుకోవడంతో ఇంగ్లీషు భాషపై అంతగా పట్టు ఉండేది కాదు. దీంతో 1నుంచి10వ తరగతి వరకు ఇంగ్లీషు పుస్తకాల వెనుక ఉన్న ఎక్సర్‌సైజ్‌లను, ఎన్‌సీఈఆర్‌టీ ఇంగ్లీషు ఎక్సర్‌సైజ్‌లను పూర్తిచేయడం ద్వారా పట్టుపెంచుకున్నారు. 2019లో సివిల్స్ తొలి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. ఫైనల్ కటాఫ్‌కు చేరువలో వచ్చి ఆగిపోయారు. అనంతరం ఆయనలో కసి, పట్టుదల పెరిగాయి. 2020లో కరోనా వలన సివిల్స్ రాయలేదు. 2021, 2022 ప్రిలిమ్స్ కూడా క్వాలిఫై కాలేకపోయారు. సివిల్స్‌లో వరుసగా మూడుసార్లు విఫలమయ్యారు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించారు. దీంతో గత ఏడాది (2023) నాల్గో ప్రయత్నంలో సివిల్స్‌లో 780 ర్యాంకును సాధించారు. దీంతో ఐఆర్‌ఎంఎస్‌లో ఉద్యోగం సాధించారు. అనంతరం ట్రైనింగ్ పూర్తిచేసుకున్నారు. మరలా దీర్ఘకాలిక సెలవులు తీసుకొని సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. ఐదో ప్రయత్నంలో ఇటీవల ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 350వ ర్యాంకు సాధించారు. దీంతో ఓ పేదింటి బిడ్డ కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ స్థాయికి ఎదగడం పట్ల మండల ప్రజలు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉదయ్ ప్రయాణం అభినందనీయం : సీఎం నారా చంద్రబాబునాయుడు

ఉదయ్‌కృష్ణారెడ్డి విజయాన్ని అభినందిస్తూ సీఎం నారా చంద్రబాబునాయుడు మంగళవారం ఎక్స్ ఫేస్‌బుక్ వేదికగా ట్వీట్ చేశారు. కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ వరకు ఆయన ప్రయాణం అభినందనీయమన్నారు. ధైర్యసాహసాలు, అవిశ్రాంత కృషి ఉంటే ఏ కల కూడా పెద్దది కాదని ఉదయ్‌కృష్ణారెడ్డి రుజువు చేశారన్నారు. ధృడసంకల్పంతో అన్ని అవరోధాలను అధిగమిస్తూ కొత్త తీరాలను చేరుకోవచ్చని ఉదయ్ కథ గుర్తుచేస్తున్నదని కొనియాడారు. మంత్రులు నారా లోకేశ్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కూడా ఉదయ్‌ను అభినందించారు.

కప్పం కట్టాల్సిందే!

(5వ పేజీ తరువాయి)

నీటిని నింపుతారు. అక్కడ నుంచి 28 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా సాగర్ నీరు పట్టణానికి చేరాలి. ఎస్‌ఎస్ ట్యాంకులో నిండా నీరున్నా సరఫరాలో చోటుచేసుకుంటున్న ఇబ్బందులతో ప్రస్తుతం వారం నుంచి పది రోజులకోసారి నీటిని అందిస్తున్నారు. సాగర్ అంతర్గత పైప్‌లైన్ లేని శివారు కాలనీల్లో డీప్‌బోర్లు ఒట్టిపోయి ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. అంతేకాక కొందరు ప్రైవేటు ట్యాంకర్ల నుంచి నీటిని కొనుక్కోవాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి క్లిష్ట సమయంలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తేనే ప్రజలకు అవస్థలు తప్పేది. ఆ దిశగా అధికారులు అడుగులు వేసినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మరికొన్ని రోజులు ఈ ఇబ్బందులకు అడ్డుకట్టపడే అవకాశాలు కనిపించడం లేదు.

ఏపనైనా ముందుగా పర్సంటేజీలు ఇవ్వాల్సిందే

మార్కాపురం పురపాలక సంఘంలో వైసీపీ పాలకవర్గం తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గత వైసీపీ హయాంలో 10 శాతంగా ఉన్న ప్రధాన ప్రజాప్రతినిధి పర్సంటేజీ ప్రస్తుతం రెట్టింపు అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ పీఠం ఎప్పుడు కూలుతుందోనన్న అపోహతో ఆ ప్రజాప్రతినిధి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మునిసిపాలిటీలో ప్రస్తుతం ఏపనికీ టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. సీసీ రోడ్లు, డ్రైన్ల పనులకు నిధులున్నా గత కొన్నాళ్లుగా టెండర్లు దాఖలు చేయడంలేదు. పని ప్రారంభించక ముందే 20 శాతం మేర పర్సంటేజీ ఇస్తేనే అనుమతులు ఇస్తానని బెదిరిస్తుండడంతో కాంట్రాక్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో చేసిన చాలా పనులకే ఇంకా బిల్లులు రాక ఒకవైపు ఇబ్బందులు పడుతుంటే రెట్టింపు పర్సంటేజీలు ఇస్తే తాము మునిగిపోవాల్సిందే అని బాహాటంగానే చెప్తున్నారు. ఈ క్రమంలోనే పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని స్పష్టమవుతోంది.

ముమ్మర వేట

(5వ పేజీ తరువాయి)

ఎంత నగదు హంతకులకు జమ చేశారు? ఎవరి వాటా ఎంత? అన్న విషయంలో ఒక అంచనాకు పోలీసులు వచ్చారు. అదేసమయంలో కేసును ఒంగోలు తాలూకా సీఐ నమోదు చేయగా తాజాగా ఒంగోలు డీఎస్పీకి విచారణ బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాలు ఇచ్చారు.

మూడు నెలలు కిందటే పథకం

వీరయ్య చౌదరి హత్యకు మూడు నెలల కిందటే పథకం రూపొందించినట్లు పోలీసు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఒంగోలులో వారంరోజులు పాటు హంతకులు మకాం వేసి రెక్కీ నిర్వహించారు. ప్రధాన సూత్రధారులుగా ఉన్నవారు ఆర్థిక సహకారం అందించారనేది ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది. అయితే వారి వాటాలు ఎంత అనే కోణంలో బ్యాంక్ లావాదేవీలపై దృష్టి సారించారు. సూత్రధారులలో ఇసుక, రేషన్ మాఫియా వారు ఉన్నారన్న నిర్ధారణకు వచ్చారు. వీరిలో కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికి అత్యంత గోప్యంగా ఉంచి విచారణ చేస్తున్నారు. వారి దందాకు వీరయ్య చౌదరి అడ్డుకట్ట వేస్తున్నారనే ఆయన మీద కక్ష పెంచుకున్నారు. అందుకే అంత కిరాతకంగా అంతమొందించారనే ప్రచారం ఉంది. పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ పదవి వీరయ్యకు వస్తే ఆయనకు గన్‌మన్లు ఉంటారు, అందుకే ముందుగా హత్య చేశారని, అది కూడా పథకంలో భాగమేనని పోలీసుల విచారణలో వెల్లడైంది.

కీలకంగా ఇసుక వ్యాపారి

సూత్రధారులు, నిందితుల మధ్య కీలకంగా ఇసుక వ్యాపారి వ్యవహరించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇసుక వ్యాపారి బావమరిదిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం ఇద్దరు కలిసి విశాఖపట్నంలో ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి కూడా ఇసుక వ్యాపారి పరారీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా ఇసుక వ్యాపారి దొరికితేనే కేసులో కీలకమైన సమాచారం బయటపడే అవకాశం ఉంది. పోలీసు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ స్వయంగా సమాచారం తెప్పించుకుంటూ, అవసరమైన సూచనలు ఇస్తున్నారు. అతిత్వరలో కేసును పూర్తిస్థాయిలో ఛేదిస్తామనే ధీమాలో పోలీసులు ఉన్నారు.

449 మందికి ప్రాధాన్యత కేటగిరీ బదిలీ

(5వ పేజీ తరువాయి)

సంబంధించి సర్టిఫికెట్లు మంగళవారం జారీ చేయలేదు. వీటికి సంబంధించిన సమాచారం జిల్లా విద్యాశాఖ తర్వాత ప్రకటించనుంది.

కేటగిరీల వారీగా అర్హత పొందిన టీచర్ల వివరాలు ఇవీ.

56 నుంచి 69 శాతం వరకు శారీరక వికలాంగులు అత్యధికంగా 103మంది

56 నుంచి 69శాతం దృష్టిలోపం ఉన్నవారు 18 మంది

56 నుంచి 69శాతం వినికిడిలోపం ఉన్నవారు 26 మంది

70 శాతం ఆపైన దృష్టిలోపం ఉన్నవారు 32మంది

శారీరక వైకల్యం ఉన్నవారు 29 మంది

వినికిడి లోపం ఉన్నవారు 13 మంది

80శాతంపైన శారీరక వైకల్యం గలవారు 41మంది, దృష్టిలోపం ఉన్నవారు 21 మంది

క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు 45 మంది

ఓపెన్ హార్ట్ సర్జరీ, ఆవయవ మార్పిడి చేయించుకున్నవారు 72 మంది

మేజర్ న్యూరో సర్జరీ చేయించుకున్న వారు 24 మంది

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న వారు నలుగురు

స్పైనల్ సర్జరీ చేయించుకున్న వారు 18 మంది

మానసిక రుగ్మతతో చికిత్స పొందుతున్న పిల్లల భార్యభర్తలు ఉన్నవారు ఒకరు

జువైనల్ డయాబెటిస్, హిమోఫీలియా, కండరాలు పట్టివేత, తలసేమియా వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న పిల్లలు ఉన్నవారు ఒకరు.

'ఎత్తిపోతల' పనులు త్వరగా పూర్తి చేయాలి

వచ్చే వ్యవసాయ సీజన్‌కు అందుబాటులోకి తీసుకురావాలి

నామ్ రోడ్డు పరిహారం చెల్లింపునకు చర్యలు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్


అధికారులు, రైతులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

అద్దంకి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకాల నిర్మాణం, మరమ్మతులను వేగవంతం చేసి వచ్చే వ్యవసాయ సీజన్‌కు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా అధికారులు పనిచేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో ఎత్తిపోతల పథకాల పనులు, మరమ్మతులపై ఐడీసీ అధికారులు, రైతులతో మంగళవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. ప్రధానంగా తమ్మవరం, ఉప్పలపాడు ఎత్తిపోతల పథకాల పనులు అర్థంతరంగా నిలిచి పోయినందున ఆయా పనులకు సంబంధించి రివైజ్డ్ ఎస్టిమేషన్లు సిద్ధం చేయాలన్నారు. వాటికి ప్రభుత్వం నుంచి వెంటనే అనుమతులు మంజూరు చేయిస్తానని చెప్పారు. తిమ్మాయపాలెం, కామేపల్లి, తంగేడుమల్లి, కోటావారిపాలెం, కొణిదెన, గుంటుపల్లి ఎత్తిపోతల పథకాల పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఆయా ఎత్తిపోతల పరిధిలోని కాలువల మరమ్మతులు కూడా వచ్చే సీజన్‌కు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఈ భాగ్యలక్ష్మి, డీఈ శిరాజ్‌అహ్మద్, ఏఈలు కృష్ణారావు, వంశీ, రవి, తమ్మవరం ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

నామ్ రోడ్డు పరిహారం చెల్లింపునకు చర్యలు

నామ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఏల్చూరు, చక్రాయపాలెం, గోపాలపురం, శింగరకొండపాలెం రైతులకు సంబంధించి పరిహారం చెల్లింపు విషయాన్ని నామ్ అధికారులతో మంత్రి రవికుమార్ చర్చించారు. మొత్తం పరిహారం రూ.2.70 కోట్లు అవసరం కాగా ప్రస్తుతం 1 కోటి రూపాయలు సిద్ధంగా ఉన్నాయని మంత్రికి అధికారులు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కోటి రూపాయలను కొన్ని గ్రామాల రైతులకు చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఒంగోలు ఆర్‌డీవోతో ఫోన్‌లో మాట్లాడారు. మిగిలిన నిధులు మంజూరు విషయమై ఆర్‌అండ్‌బీ సీఈ శ్రీనివాసరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఏల్చూరులో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నామ్ అధికారులు శ్రీకాంత్, ప్రసాద్ లు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్లు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో విభిన్నప్రతిభావంతులకు మంగళవారం వీల్ చైర్లను అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరబాద్ నార్త్, షార్ ప్రాజెక్ట్, పిడుగురాళ్ల లైమ్ సిటి రోటరీ క్లబ్‌ల ఆర్థిక సౌజన్యంతో ఆరుగురు విభిన్నప్రతిభావంతులకు వారి ఇళ్ల వద్దనే వీల్‌చైర్లను అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ 3150 గవర్నర్ డాక్టర్ కె. శరత్ చౌదరి, జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాల కోటిరెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ విష్ణుప్రసాద్, స్థానిక క్లబ్ సెక్రటరీ మురళిసుధాకరరావు, ఏజే మహమ్మద్ రఫీ, మురళీకృష్ణ, దేవపాలన, చంద్రమౌళి, హరిహరప్రసాద్, లేవి ప్రసాద్, శ్రీలక్ష్మి, శివకుమారి, భువనేశ్వరి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు చేయూత

మార్టూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన ఇద్దరు పిల్లలు మంచా శ్రేయరాయల్, తానికొండా ఇసాక్‌లకు వీల్ చైర్స్‌ను మార్టూరు రోటరీ క్లబ్ వారు మంగళవారం నాగరాజుపల్లి రోడ్‌లో ఉన్న శ్రీ సాయి మల్లికార్జున అపార్ట్‌మెంట్‌లో పంపిణీచేశారు. వారికి రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లిహిల్స్, రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల వారు షార్ ప్రాజెక్టు కింద క్లబ్ గవర్నర్ శరత్ చౌదరి చేతులమీదుగా అందజేశారు. మద్దుమాల కోటేశ్వరరావు, గరిమిడి శ్రీనివాసరావు, మాదాల సాంబశివరావు పాల్గొన్నారు.


దివ్యాంగులకు వీల్‌చైర్ బహుకరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

వీల్ చైర్లు పంపిణీ

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి వారి ఆధ్వర్యంలో ఐదుగురు దివ్యాంగులకు రూ.50 వేలు విలువగల వీల్ చైర్‌లు అందజేశారు. న్యాయవాది బండారుపల్లి హేమంత్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి, క్లబ్ అధ్యక్షులు బాచిన నాగమల్లేశ్వరరావు, సెక్రటరీ వంశీకృష్ణ, ట్రెజరరీ డాక్టర్ రవితేజ, సభ్యులు మల్లికార్జునరావు, డాక్టర్ విజయ్, ఆర్‌వి రమణ, రామకృష్ణ, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి శరవేగంగా అడుగులు


మాట్లాడుతున్న నరసింహ యాదవ్, పక్కన ఏఎంసీ ఛైర్మన్ జనార్దనరావు

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నిర్దిష్ట పాలన, నిమయ నిబంధనలతో శరవేగంగా అభివృద్ధికి నిరంతరం టీడీపీ కూటమి పాటుపడుతోందని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి. నరసింహం యాదవ్ చెప్పారు. మంగళవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఈనేపథ్యంలోనే వెనుబడిన వర్గాల అభ్యున్నతి కోసం కుల, చేతి వృత్తులకు ఆదరణ పథకం ద్వారా బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అలాగే తెగలు వారీగా రూ.789 కోట్లతో బడ్జెట్ కేటాయించి ఉపాధి కల్పనకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు రుణసాయంతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కొతవరపు జనార్దనరావు పాల్గొన్నారు.

ప్రీస్కూల్‌లో పిల్లలను చేర్చాలి


సంతమాగులూరు ప్రాజెక్టులో మాట్లాడుతున్న పీడీ రాధా మాధవి

సంతమాగులూరు ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రీస్కూల్లో పిల్లలను చేర్పేందుకు మోటివేట్ చేయాలని బాపట్ల పీడీ రాధామాధవి చెప్పారు. మంగళవారం సంతమాగులూరు ప్రాజెక్టును సందర్శించి సూపర్‌వైజర్లు, అంగన్వాడీలకు సూచనలు ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోతే గ్రామాల్లో స్థలం అందుబాటులో ఉన్నట్లయితే భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ప్రమీల, విజయనిర్మల, మీరాబి,సుష్మ, అంగన్వాడీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోర బాలికలపై ప్రత్యేక జాగ్రత్తలు

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికలపై ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సీడీపీవో ఝాన్సీ, డీసీపీవో పురుషోత్తం చెప్పారు. మంగళవారం మునిసిపల్ పరిధిలో మే 2 నుంచి 10వ తేదీ వరకు జరుగు కిశోర వికాసం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టాలన్నారు. విద్య కొనసాగింపు, పోషణ ఆరోగ్యం, పరిశుభ్రత వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కవితశ్రీ, కుముద్వతి, తబిత, కృష్ణ పాల్గొన్నారు.

ఎండిన చెట్లతో పొంచి ఉన్న ప్రమాదం

పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

పర్చూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రహదారికి ఇరువైపులా దశాబ్దాల కాలం నాటి చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏ చెట్టు కొమ్మలు విరిగి పడి ప్రాణాలకు ముప్పు కల్గిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని పాత మద్రాస్ రోడ్డులో చింతచెట్టు ఎండిపోయి ప్రమాద భరితంగా ఉంది. బస్సులు, ఆటోల కోసం ప్రయాణికులు ఈచెట్టు కింద నిల్చుని వేచి చూస్తుంటారు. నిత్యం ఈ రహదారిలో వందల సంఖ్యలో వాహనాలు వచ్చిపోతుంటాయి. ఇలాంటి రహదారిలో చింతచెట్లు ఎండిపోయి ప్రజలు, ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఉన్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పర్చూరు - చీరాల రోడ్డులో చింత ఎండిపోయిన చింత చెట్టుకొమ్మ విరిగి పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఎప్పుడు చింతచెట్టు కొమ్మలు విరిగిపడి ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి ఎండిపోయి ప్రమాద భరితంగా ఉన్న చింతచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు

బీటెక్ విద్యార్థి మృతి, మరో యువకుడికి గాయాలు


గుంటుపల్లి భరణ్(ఫైల్)

మార్టూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మార్టూరు మండల పరిధిలో కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటన మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న గుంటుపల్లి భరణ్(19) తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మరో యువకుడు నల్లిబోయిన ప్రవీణ్ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో భరణ్ చనిపోయాడు. మృతుడు పల్నాడు జిల్లా మేడికొండూరు మండలం, దోగిపనుల గ్రామానికి చెందిన వాడు. అతడు తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి ఒంగోలులో ఒక కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఈయర్ ఫీజు కట్టి వస్తున్నాడు. ఒంగోలు నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని గుంటూరు జిల్లా నల్లపాడు గ్రామానికి చెందిన కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. భరణ్ మృతదేహం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంది. అదేవిధంగా ప్రవీణ్‌కు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నారు.పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. మార్టూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

నేడు ఫైర్, విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన

అద్దంకి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10 గంటలకు శింగరకొండ రోడ్డులో 2.25 కోట్ల రూపాయలతో నిర్మించనున్న అగ్నిమాపక కార్యాలయం భవనం, ఉదయం 10-30 గంటలకు సుమారు 11.23 కోట్ల రూపాయలతో అద్దంకి పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ కార్యాలయం, ద్వారకానగర్‌లలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకస్థాపన చేయనున్నారు. అనంతరం 11 గంటలకు ఎస్‌ఎస్‌పీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో మే 2వ తేదీ అమరావతిలో జరగనున్న అమరావతి పునఃనిర్మాణ ప్రారంభవేడుక సన్నాహక సమావేశం, 11-30 గంటలకు ఎస్‌ఎస్‌పీ కార్యాలయం ఆవరణలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మంత్రి రవికుమార్ హాజరుకానున్నారు.

నేడు పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్ష

అద్దంకిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పాలిసెట్ పరీక్ష బుధవారం జరగనుందని పాలిసెట్ అద్దంకి కో ఆర్డినేటర్ వి. లాజరస్ బాబు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకిలోని హోలిపెయిత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శింగరకొండ వద్ద డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. మొత్తం 854 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

ప్రధానమంత్రి పర్యటనకు ఆరు బస్సుల ఏర్పాటు

బల్లికురవ. ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతానికి మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఉండటంతో ప్రభుత్వ ఆదేశాలతో బల్లికురవ మండలం నుంచి ఆరు బస్సులను ఏర్పాటు చేశామని ఎంపీడీవో కుసుమకుమారి చెప్పారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు కలిపి ఆరు పాయింట్లలో బస్సులు బయలు దేరుతాయని తెలిపారు.

పిల్లల సంరక్షణ సెలవులను మంజూరు చేయాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలోని మహిళ ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని ఎన్‌ఎంయూఏ అద్దంకి డిపో సెక్రటరీ అనపర్తి వందనంబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అద్దంకి డిపో ఆవరణలో ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో సంస్థలో వివిధ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు ఎన్‌ఎంయూఏ జిల్లా సెక్రటరీ టి. శ్రీనివాసరావు, అద్దంకి డిపో ట్రెజరర్ మందా ఆంజనేయులులు పాల్గొని సంఘీభావం తెలిపారు. రీలే దీక్షలో డ్రైవర్లు వి. పుల్లారావు, ఎస్. ప్రకాశ్‌రావు, ఎస్‌కె. సురేష్, కండక్టర్‌లు ఎస్.మాధవి, ఎం. కోటేశ్వరమ్మ, ఏ. సుజాత పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

పంగులూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు కిమ్స్ హాస్పటల్ వైద్యులు రామాంజనేయులు చెప్పారు. మండలంలోని తూర్పుతక్కెళ్లపాడు గ్రామంలో మంగళవారం కిమ్స్ హాస్పటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటితో పాటు గుండె పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వ్యాధి తీవ్రత ఉన్న రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా కిమ్స్ హాస్పటల్‌లో వైద్య చికిత్సలు నిర్వహించనున్నట్లు డాక్టర్ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాణి, పి.ఆర్వో. కాలేషా, వైటల్ హెల్త్ కేర్ ఫౌండర్ సందిపాగు వందనం, రాజేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

ఉందన్నారు. కనిగిరిలో డయాలసిస్ సెంటర్‌లో నెలకు 120మందికి సేవలు అందిస్తున్నారని, ఇంకా జిల్లాకు ఎన్ని అవసరమో ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు తక్షణ అవసరాల కోసం జిల్లాలోని మునిసిపాలిటీలకు రూ.13.92కోట్లు మంజూరు చేశారని చెప్పారు. అందులో ఒంగోలు పట్టణానికి రూ.4.4కోట్లు ఇచ్చినట్లు దినకర్ తెలిపారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా దీర్ఘకాలిక వనరుల లభ్యత ఆధారంగా ప్రతి గృహానికి సురక్షిత తాగునీరు కొళాయి ద్వారా సరఫరా చేసేందుకు వెలిగొండను పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వెలిగొండ పూర్తితో పశ్చిమప్రకాశంలో కరువుతోపాటు ఫ్లోరైడ్, కిడ్నీ బాధితుల సమస్యను పరిష్కరించడం సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో వచ్చేనెల 2న కేంద్రప్రభుత్వ సహకారంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతిలో రూ.లక్ష కోట్లతో రాజధాని అభివృద్ధి పనుల ప్రారంభానికి జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లుతోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



రోజురోజుకూ ఎండ తీవ్రమవుతోంది. ఉదయం 8 గంటలకే భానుడు భగ్గుమంటున్నాడు. ఎండ వేడికి తాళలేక అన్ని వయస్సులవారు ఉక్కపోతలతో ఉడికిపోతున్నారు. అత్యవసర పనులను రద్దు చేసుకోలేక వేసవి తాపం తీర్చుకునేందుకు వివిధ మార్గాలవైపు చూస్తున్నారు. ఏప్రిల్ మాసంలోనే ఎండలు తీవ్రంగా ఉండగా ఇప్పటికే పట్టణాల్లో పలు ప్రాంతల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు పలువురు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. పిల్లలు, మహిళలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులతోపాటు వీధి వ్యాపారులు, అన్ని వయస్సులవారు ఎండ ప్రచండానికి తల్లడిల్లుతున్నారు. సామాన్యుడి నుంచి ఉన్నత వర్గాల ప్రజలు వేసవి తాపం తీర్చే చల్లని నేస్తాల కోసం ఆసక్తి చూపుతున్నారు. ఆర్థిక స్థితిని బట్టి ఎండ తాపం నుంచి సేద తీరేందుకు ఇష్టపడుతున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి

- ఎండల నుంచి ఉపశమనం కోసం జనం పాట్లు
- శీతల పానీయాలకు, ఏసీలకు పెరుగుతున్న గిరాకీ
- సామాన్యుడికి నీడగా కళ్లజోళ్లు, టోపీలు
- తాటి ముంజలు, పుచ్చకాయలకు డిమాండ్

చల్లని నేస్తాలు..!

ఆకర్షిస్తున్న ఏసీలు, ఫ్రిజ్‌లు



ఆహ్లాదం.. ఇపుడు ఒక అవసరం. ఇల్లు, ఆఫీసులు, షాపింగ్ మాల్స్, ప్రయాణించే బస్సులు, ఎటీఎం సెంటర్లు, ఇలా అడుగుపెట్టిన ప్రతిచోటా అదే. సంపన్నులతోపాటు సగటు మధ్య తరగతి జీవి, దిగువ తరగతి వారిని ఏసీ 'చల్లగా' చేరుకుంటోంది. అయితే ఎక్కువసేపు ఏసీలో ఉండటం ప్రమాదకరమంటున్నారు వైద్యులు. ఎండబారిన పడకుండా జాగ్రత్తపడటం ఎంత అవసరమో, ఏసీతో కలిగే నష్టాలపైనా అవగాహన పెంచుకోవడం అంతే అవసరం అంటున్నారు. ఆధునిక పరిస్థితులు మనిషిని రోజు రోజురోజుకూ సుకుమారంగా మారుస్తున్న నేపథ్యంలో వాతావరణం మార్పులకు తట్టుకోవడం కష్టంగా మారుతోంది. వాతావరణం మార్పుల నుంచి తనను తాను రక్షించుకోవడానికి ప్రతి వ్యక్తి ఏసీని నిత్యావసర వస్తువుగా మార్చేశారు.

శీతలపానీయాలకు పెరిగిన గిరాకీ

మండుటెండతో శరీరంలో నీటి శాతం తగ్గి నీరసం రావడంతో తల్లడిల్లుతున్న ప్రజానీకం శీతల పానియాలవైపు మొగ్గు చూపుతున్నారు. అవకాశం ఉన్న చోటల్లా చల్లనినీరు, మజ్జిగ, పుచ్చకాయలు, కూల్‌డ్రింక్స్, పుచ్చకాయలు, తాటిముంజలు వంటి వాటినే ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధుల్లో శరీరంలో శక్తి తక్కువగా ఉండటం వల్ల వీటిని తీసుకోవడం ద్వారా కొంత ఉపశమనం కలుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. రూ.10 నుంచి అందుబాటులో ఉండే చెరుకు రసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, లస్సీలతోపాటు ఇతర శీతలపానీయాలకు గిరాకీ పెరగడంతో వ్యాపారులకూ కొంత ఆదాయం వనగూరుతోంది. సామాన్యుడి ఫ్రిజ్ మట్టి కుండలకు, వట్టివేరుల పట్టలకు, కూలర్లకు ఆదరణ లభిస్తోంది. గతంలో వాటివైపు కన్నెత్తి చూసేవారు లేకపోగా, ప్రస్తుతం మండుతున్న ఎండలతో మధ్య తరగతి వారికి అందుబాటులో ఉండే మట్టి కుండలనే ఇష్టపడుతున్నారు.



ఉదయవర్లు స్వామి దేవస్థానం

120వ ఢిల్లీ ఉత్సవానికి ఏర్పాట్లు

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : చీరాలలోని దర్బారు రోడ్డులో 120 సంవత్సరాలుగా జరుగుతున్న ఢిల్లీ ఉత్సవం ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా జరుగనుంది. స్థానిక ఉడయవర్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ, శ్రీ శాలిహోత్ర మహర్షి స్వామి ఆలయం ఆధ్వర్యంలో బుధవారం నుంచి మే 4వ తేదీ వరకు జరిగే ఉత్సవాల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఏటా ఒక్క చీరాలలో మాత్రమే జరిగే ఈ ఉత్సవాలకు చీరాల పట్టణ, పరిసర ప్రాంతాల వాసులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకిస్తుంటారు.

ఢిల్లీ ఉత్సవ చరిత్ర

ప్రతి సంవత్సరం వైశాఖ మాస శుద్ధ చవితినాడు ఈ ఉత్సవం జరుగుతుంది. ఉత్సవం మొదటిగా తమిళనాడులో ప్రారంభమైంది. పూర్వం చీరాల వాస్తవ్యులు పట్టుసాలి పితామహులు సముద్రం శ్రీరాములు చీరాలలో ఉత్సవాన్ని మొదలుపెట్టారు. ఆ తరువాత అది ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ క్రమంలో సంగం థియేటర్ రోడ్డులో ఉత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ రహదారి ఢిల్లీ బజారుగా, దర్బారు రోడ్డుగా పేరు గాంచింది. చరిత్రను పరిశీలిస్తే సుల్తాను పరిపాలనా కాలంలో ఉత్తర భారతదేశం మొగలు సుల్తానుల కనుసన్నల్లో ఉండగా, దక్షిణాది ప్రాంతాన్ని కూడా చేజిక్కించుకోవాలని కన్నేశారు. ఆ సమయంలో రామానుజాచార్యులు ఢిల్లీ సుల్తానుతో సంప్రదించి కొన్ని ఒప్పందాలు చేసుకుంటారు. ఆ క్రమంలో బీబీ నాంచారులు ఢిల్లీ దర్బారు నుంచి కదలివచ్చి శ్రీ శ్రీనివాసుని ధర్మపత్నిగా మారి ఆయనలో ఐక్యమవుతుంది. ఈ ఘట్టాన్ని ఢిల్లీ ఉత్సవంగా పిలుస్తారు. ఈ చరిత్రను ఆచరిస్తూ నిర్వాహకులు దర్బారు రోడ్డులో నిర్వహించే ఇతి వృత్తం తిలకించేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతుంటారు.



పూజలందుకుంటున్న శ్రీనివాసులు, పద్మావతి, బీబీ నాంచారమ్మ(ఫైల్)

ఏటా ఘనంగా ఉత్సవాలు

పూర్వీకుల నుంచి ఆచరిస్తున్న ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుతున్నాం. వేడుకలు చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. తమిళనాడు తరువాత చీరాలలో మాత్రమే జరిగే ఉత్సవం కావడంతో ప్రాచుర్యం పొందింది.

- కమలేష్, ఆలయ చైర్మన్

వేడుకగా 16 రోజుల పండుగ

- ముగిసిన చెన్నయ్య కల్యాణం



పదహారు రోజుల పండుగ వేడుకలో ఉభయ దేవేరులతో చెన్నయ్య

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల అనంతరం మంగళవారం ఆలయంలో చెన్నకేశవునికి 16 రోజుల పండుగ వేడుకగా భక్తిశ్రద్ధలతో భక్తజనరంజకంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుని ఉత్సవవరులను ప్రత్యేకంగా అలంకరించి 16 రోజుల పండుగ నిర్వహించారు. అరిసెలు భక్తులకు పంచిపెట్టారు. అనంతరం అమ్మవార్ల సారెలను ఘనంగా నిర్వహించారు. చెన్నకేశవ స్వామికి బ్రహ్మోత్సవాలు పంచారాత్రగమ సిద్ధాంతం ప్రకారం 12 రోజులు 12 వాహనాలపై 4 మాడవీధులలో నగరోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం 4 రోజుల పాటు వసంతోత్సవం, ఊంజల్ సేవ, మంగళవారం 16 రోజుల పండుగ నిర్వహించారు. దీంతో శ్రీలక్ష్మి చెన్నకేశవుని కల్యాణ అనంతరం వేడుకలు ముగిశాయి. 16 రోజుల పండుగ కార్యక్రమంలో ఉభయదాతలుగా పాండురంగ మహిళా భక్త సమాజం వ్యవహరించారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యక్కలి కాశీవిశ్వనాథం, సభ్యులు, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

గరుడ వాహనంపై వేంకటేశ్వరుడు



గరుడవాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

కంభం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కంభంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు సోమవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామివారిని చూసి భక్తులు తన్మయం చెందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన అలరించింది.

నీట్ పరీక్షలను సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చేనెల 4వతేదీన జరిగే నీట్ పరీక్షలు సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మే 4వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ పరీక్షకు 1,473 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ, దామచర్ల సక్కుబాయమ్మ డిగ్రీ కళాశాల, దామచర్ల ఆంజనేయులు పాలిటెక్నిక్ కళాశాల, డీఆర్‌ఆర్ఎం మునిసిపల్ హైస్కూళ్లను పరీక్షా కేంద్రాలుగా ఎన్‌టీఏ ఎంపిక చేసిందన్నారు. ఈ ఐదు కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు అందుకు అవసరమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భద్రత, ప్రశ్నపత్రాలు, అభ్యర్థుల తనిఖీలు తదితర విషయాలలో మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇన్విజిలేటర్లకు అవసరమైన శిక్షణను గురువారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరీక్షల సిటి కో ఆర్డినేటర్‌కు సూచించారు. అభ్యర్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ఆయాపరీక్షా కేంద్రాల సూపరిటెండెంట్లపై ఉందని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో చినఓబులేషు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీపీవో వెంకటనాయుడు, డీఈవో కిరణ్‌కుమార్, ఎన్‌టీఏ నోడల్ ఆఫీసర్ మనీష్‌కుమార్, ఆయా కేంద్రాల సూపరింటెండెంట్లు, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా కంభం చెరువు

- ఏడాదిలోగా అభివృద్ధి పనులు
- సీఎం, డిప్యూటీ సీఎం సూచనతో టూరిజం అధికారితో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



టూరిజం అధికారులతో కలిసి బోటులో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో ఏడాదిలోగా చారిత్రక కంభం చెరువు పర్యాటక కేంద్రంగా మారనున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా టూరిజం శాఖ అధికారి అద్దంకి రమ్యతో కలిసి కంభం చెరువును పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కంభం చెరువును పర్యాటక కేంద్రంగా చేయాలని దశాబ్దాలనాటి ఈప్రాంత ప్రజల కోరిక నెరవేరనున్నదని తెలిపారు. తాను ఇటీవల ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిని కలిసి మాట్లాడగా ఆసియా ఖండంలోనే 2వ అతిపెద్ద చెరువు అయిన కంభం చెరువును పర్యాటక కేంద్రంగా చేయాలని కోరడంతో వారు స్పందించి ఆదిశగా చెరువును పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. అందులో భాగంగానే మంగళవారం జిల్లా టూరిజం అధికారి రమ్య కంభం చెరువును పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. కంభం చెరువును అభివృద్ధి చేయాలని తాను అసెంబ్లీలో, ప్రభుత్వానికి అనేకమార్లు విన్నవించుకోగా దానిని పరిగణనలోకి తీసుకొని కంభం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ముందడుగు వేసిందన్నారు. చెరువుకు సంబంధించిన వివరాలను అధికారికి తెలియజేశానని, బోటింగ్ ద్వారా చెరువును పరిశీలించామని తెలిపారు. ఏడాదిన్నరలోగా కంభం చెరువును అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లా టూరిజంశాఖ అధికారి రమ్య మాట్లాడుతూ కంభం చెరువును త్వరితగతిన అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మారుస్తామని, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కృషి ఫలితంగా తొలి అడుగు పడిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఇరిగేషన్ అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి తిరునాళ్ల

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం మేడపి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొద్దిరోజులుగా శ్రీలక్ష్మీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్నాటి బ్రహ్మనాయుడు కాలంలో నిర్మించిన ఈ ఆలయంలో కోరిన కోర్కెలు తీరుతుండడంతో ఏటా తిరునాళ్ల సందర్భంగా 10 గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకుంటారు.

2.82 లక్షల పింఛన్లు... రూ.123.23 కోట్లు విడుదల



ఒంగోలు నగరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. మొత్తం 2,82,303 మందికి వివిధ రకాలైన పింఛన్లను పంపిణీ చేసేందుకు జిల్లాకు రూ.123.23 కోట్లు జిల్లాకు విడుదల చేసింది. ఈ సొమ్మును పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు గురువారం అందజేసేందుకు బుధవారమే సచివాలయం సిబ్బంది బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోనున్నారు. ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలోని 717 సచివాలయాలకు చెందిన సిబ్బంది ఈనెల 30వ తేదీనే బ్యాంకుల నుంచి పింఛన్ సొమ్మును డ్రా చేసుకుని మే ఒకటవ తేదీన ఉదయాన్నే పింఛన్‌దారులకు పంపిణీ చేయనున్నారు. గత నెలలో జిల్లాలో 2,84,684 పింఛన్లు ఉండగా ఈనెలలో 2,82,303కి తగ్గిపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో వేలాది మంది అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారు. వీరిలో ఎక్కువగా ఆరోగ్యంగా ఉన్నవారే పూర్తిగా మంచానికే పరిమితం అయినట్లు, నడవలేక వీల్‌చైర్‌కే పరిమితం అయినట్లు, బోగస్ సర్టిఫికెట్లు సమర్పించి నెలకు రూ.15 వేలు పింఛన్ కూడా తీసుకున్నారు. కిడ్నీ బాధితులమంటూ మరి కొంతమంది డయాలసిస్ చేయించుకుంటున్నట్లుగా రికార్డులు పుట్టించి నెలవారీ పింఛన్‌లు పొందుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం బోగస్ లబ్ధిదారులను ఏరివేసింది. దీంతో ఈ నెలలో జిల్లాలో గతనెల కంటే 2,381 పింఛన్లు తగ్గిపోయాయి.

పింఛన్‌దారులతో దురుసుగా ప్రవర్తించొద్దు

పింఛన్ పంపిణీ సమయంలో లబ్ధిదారులకు నమస్కరించి పింఛన్ సొమ్మును ఇంటి వద్దే అందించాలని ప్రభుత్వం గత నెలలో ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లాలోని 190 మంది సచివాలయం సిబ్బందిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. తమ పట్ల దురుసుగా వ్యవహరించడం, సకాలంలో పింఛన్ సొమ్మును అందించకపోవటం, దూరంగా ఉండి తమను అక్కడికి వచ్చి పింఛన్ సొమ్ము తీసుకుని పొమ్మని చెప్పటం వంటి ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ఇలా ఏ సచివాలయం నుంచి ఎవరిపై ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయో వారిని మంగళవారం ఒంగోలు పిలిపించి వెలుగు పీడీ నారాయణ హెచ్చరించారు. పద్ధతి మార్చుకోవాలని, ఇదే విధంగా పింఛన్‌దారులను ఇబ్బంది పెడితే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. పింఛన్ పంపిణీ సమయంలో వారితో గౌరవంగా మెలగాలని సూచించారు.

4,367 మందికి ఈ నెలలో పింఛన్ లేనట్లే..

కుటుంబంలో నెలవారీ పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే అంతటితో రద్దు కాకుండా మరుసటి నెలలోనే పింఛన్ భార్యకు ఇచ్చే విధంగా ప్రస్తుత ప్రభుత్వం నిబంధనలను మార్పు చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వంలో భర్త చనిపోతే ఆ కుటుంబంలో పింఛన్ రావాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. 2023వ సంవత్సరం డిసెంబర్ మాసం నుంచి గత ఏడాది అక్టోబర్ మాసం వరకు పింఛన్ పొందుతున్న భర్తల చనిపోతే ఆ పింఛన్‌ను వారి భార్యలకు అందించేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటువంటివారు 4,367 మంది ఉన్నట్లు గుర్తించింది. ఆ వివరాలను పది రోజుల క్రితం జిల్లాకు పంపింది. ఆ వివరాలను, భర్తల మరణ ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే సచివాలయాల సిబ్బంది 4,367 మందిలో ఇప్పటి వరకు 2,520 మంది వివరాలు మాత్రమే అప్‌లోడ్ చేయగలిగారు. మిగిలినవారి వివరాలను అప్‌లోడ్ చేసేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండటంతో వీరికి ఈ నెలలో పింఛన్ పంపిణీ జరిగే అవకాశం లేకుండా పోయిందని అధికారులు అంటున్నారు. వచ్చే నెల నుంచి ప్రభుత్వం క్రమంతప్పకుండా వీరికి కూడా పింఛన్ అందించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంటున్నారు.

విద్యా వ్యవస్థలో పెనుమార్పులు

- రూపురేఖలు మారనున్న సర్కారు స్కూళ్లు
- గ్రామీణ విద్యకు ప్రభుత్వం పెద్దపీట
- మద్దిపూడి మండలంలో 6 ఫౌండేషన్, 29 బేసిక్, 13 ఆదర్శ పాఠశాలలు
- మూడు యూపీలు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్

మద్దిపూడి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యమిస్తోంది. సర్కారు పాఠశాలల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చుతోంది. అందులో భాగంగా మండలంలో 6 ఫౌండేషన్, 29 బేసిక్, 13 ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసింది. వీటితోపాటు మరో మూడు ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. దీంతో మండలంలో ఉన్నత పాఠశాలల సంఖ్య ఎనిమిదికి చేరింది. వీటితోపాటు రావెలవారిపాలెం కస్తూర్బా బాలికా విద్యాలయం కొనసాగుతోంది. ఆయా పాఠశాలల్లో ఇప్పటి వరకు 3,400 మందికిపైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు. మండలంలోని చిలంకూరు, కెల్లంపల్లి, జువ్విగుంట, వీరారెడ్డి పల్లె, తంగెళ్లరాజుపాలెం, తంగెళ్ల గ్రామాలలో ఫౌండేషన్ పాఠశాలలు (1 నుంచి 2 తరగతుల వరకు) ఆరు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాటిలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులతోపాటు 1,2 తరగతుల వారు విద్యను అభ్యసించనున్నారు. ఆయా పాఠశాలల్లో 1:30 నిష్పత్తిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను నియమిస్తారు. మండలంలో 60 మందికి పైగా విద్యార్థులు ఉన్న 13 స్కూళ్లను ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశారు. అంకేపల్లి, గుండ్లసముద్రం ఏఏ, కూచిపూడి, మద్రిపూడి జనరల్, మద్రిపూడి ఏఏ, చిలంకూరు ఎంపీయూపీఎస్, శివరాయునిపేట ఏఏ, చిమట ఎంపీ యూపీఎస్, కెల్లంపల్లి ఎంపీయూపీఎస్, ధర్మవరం, గార్లపేట, ఎంపీయూపీఎస్ కేజీ కండ్రిక, కొల్లాయపాలెం గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వాటిలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు విద్యను అభ్యసించనున్నారు. ప్రతి తరగతికి ఒక సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయుడితోపాటు ప్రధానోపాధ్యాయుడు ఉంటారు. 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయుల నియామకం చేపడతారు. 29 బేసిక్ ప్రాథమిక పాఠశాలలు కొనసాగనున్నాయి. కెల్లంపల్లి, చిమట, కేజీ కండ్రిక ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. గుండ్లసముద్రం, వేమవరం, సన్నమూరు, చిలంకూరు ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో రద్దు చేశారు. వాటిలోని విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలకు అనుసంధానం చేస్తారు. మద్రిపూడి, కూచిపూడి, కాకర్ల, గార్లపేట, తంగెళ్లతోపాటు ప్రస్తుతం నూతనంగా కెల్లంపల్లి, చిమట, కేజీ కండ్రికలో ఉన్నత పాఠశాలలు ఏర్పాటు కాబోతున్నాయి.

నూతనంగా ఆరు హెచ్‌ఎం పోస్టులు

మండలంలో 112 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 103 మంది ఉన్నారు. మరో 9 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. 86 మంది స్కూల్ అసిస్టెంట్లకు గాను 83 పోస్టుల్లో ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మరో మూడు భర్తీ కావలసి ఉంది. ఆరు ఆదర్శ పాఠశాలలకు ఆరు ప్రధానోపాధ్యాయ పోస్టులు నూతనంగా మంజూరు కానున్నాయి. విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన ఈ పెనుమార్పుల కారణంగా గ్రామీణ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఆదర్శ పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించడం వలన వారు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించే వీలుంటుంది. ఫౌండేషన్ బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో సైతం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమిస్తుండటంతో ప్రాథమిక విద్య బలోపేతం కానుంది. దీనికితోడు వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం కార్యక్రమం అమలు కానుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ పొందిన చిమట ప్రాథమికోన్నత పాఠశాల

ఏసీ, ఫ్రిడ్జ్ రిపేరులో ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు ఏసీ, ఫ్రిడ్జ్ రిపేరుపై 30 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఒంగోలులోని రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల వారు అర్హులన్నారు. శిక్షణ కాలనంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని, మే 21వ తేదీ నుంచి ఈ శిక్షణ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం 8309915577 సెల్ నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఆసరా ఆధ్వర్యంలో వేసవి శిబిరం

మద్దిపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మారెళ్లగుంటపాలెంలోని ఆసరా వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆసరా ప్రతినిధి ఎంసీ.వెంకటేశ్వర్లు మంగవారం తెలిపారు. మే 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని, ముఖ్యఅతిథిగా ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశ్రమల కేంద్రంలో చోరీ

మద్దిపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలోని వినీల గ్రానైట్‌లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు రూ.2లక్షల నగదు, కొంత సామగ్రిని అపహరించినట్లు ఫ్యాక్టరీ అధినేత మండవ హరిబాబు తెలిపారు. గ్రానైట్ ఫ్యాక్టరీలో కొన్ని రోజుల క్రితం ఇనుప సామగ్రిని చోరీ చేశారని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఉన్నా దొంగతనాలు పరిపాటి అయ్యాయని గ్రానైట్ వ్యాపారులు వాపోతున్నారు. దొంగతనం జరిగిన విషయాన్ని హరిబాబు మంగళవారం మద్దిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్సా కో చైర్మన్‌గా ప్రకాష్‌బాబు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(అప్సా) రాష్ట్ర కమిటీని పర్యవేక్షించే ఉన్నత స్థాయి రాష్ట్ర కౌన్సిల్‌కు కో చైర్మన్‌గా ఒంగోలు మాంటిస్సోరి హైస్కూలు అధినేత పి.ప్రకాష్‌బాబు నియమితులయ్యారు. కౌన్సిల్ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రావు ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యరాజు తెలిపారు. మంగళవారం సుబ్రహ్మణ్యరాజు చేతుల మీదుగా ప్రకాష్‌బాబు నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాష్‌బాబును జిల్లా అధ్యక్షుడు గేరా అజయ్‌కుమార్, ఒంగోలు నగర అధ్యక్షురాలు వీఎస్.లక్ష్మి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది అభినందించారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు వచ్చేనెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, ఒంగోలు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీ.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను ఏపీ ప్రభుత్వ ఐటీఐ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తుల ప్రింట్‌ను తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఒకటి కంటే ఎక్కువ ఐటీఐలలో ప్రవేశానికి ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ప్రింట్ కాపీలు, ఒరిజనల్ విద్యార్హత, ఇతర సర్టిఫికెట్లతో వచ్చేనెల 24లోపు ప్రభుత్వ ఐటీఐలలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9492277552 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే దామచర్ల


సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

కొత్తపట్నం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కొత్తపట్నం పల్లెపాలెంలో జరిగిన మత్స్యకార భరోసా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మత్స్యకారులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ కె.పల్లెపాలెం మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కొత్తగా మంచినీటి ట్యాంకును మంజూరు చేయిస్తానని చెప్పారు. మత్స్యకార భరోసా రాని అర్హులైన వారికి మంజూరు చేయిస్తానన్నారు. గ్రామంలో ఉన్న పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని, పేదలకు ఇంటి స్థలాలు ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మత్స్యకార భరోసా చెక్కులను అందజేశారు. పొదుపు సంఘాల మహిళలకు సబ్సిడీ రుణాల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి, జిల్లా తెలుగుదేశం నాయకులు గేనం సుబ్బారావు, ఎంపీటీసీ నరసింహారావు, ప్రభుప్రకాష్, మేకల జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను పటిష్టంగా అమలు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల్లో రీ సర్వే ప్రక్రియను పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి సూచించారు. విజయవాడ నుంచి మంగళవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రీ సర్వే సమస్యలు, సిటిజన్స్ సర్వీసెస్, పీజీఆర్‌ఎస్ పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా దరఖాస్తులను, సమస్యలను పెండింగ్‌లో లేకుండా సకాలంలో పరిష్కరించే విధంగా చూడాలని తెలిపారు. గ్రామస్థాయిలో నీటి పన్నుల వసూళ్ళతో పాటు పీజీఆర్‌ఎస్ దరఖాస్తుల బియాండ్ ఎస్‌ఎల్‌ఏ లోపు వెళ్ళకుండా గడువులోపు పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, జిల్లా సర్వే అధికారి గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకోవాలి

సంతనూతలపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం బడుగు, బలహీన వర్గాల పిల్లల కోసం అన్ని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో డి.వెంకారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 25శాతం సీట్లు బలహీనవర్గాలకు కేటాయించాలని, 2025-26 విద్యాసంవత్సరంలో సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2019 ఏప్రిల్ 2 ఉంచి 2020 మే 31 మధ్యన జన్మించి ఐదు సంవత్సరాలు నిండిన బాలలు అర్హులని తెలిపారు. మే 2 నుంచి 19వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాలు, మీసేవా సెంటర్లలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని ఆయన కోరారు.

తిరుపతిలో జాతీయ మహాసభలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వచ్చేనెల 15 నుంచి జరగనున్న అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో 15 నుంచి 18వతేదీ వరకు మహాసభలు జరుగుతాయని, నిరుద్యోగ సమస్యపై చర్చిస్తారని, నిరుద్యోగయువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నిరుద్యోగ భృతిని ప్రభుత్వం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మరియదాసు, రాజు, వంశీ, మార్క్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజశేఖర్‌రావు కోరారు. ఒంగోలు మండలం చింతాయిగారి పాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో తరలిరావాలని, ఉదయాన్నే పనులకు హాజరుకావాలన్నారు. కూలీలకు కూలి రూ.307 వచ్చేలా పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. పనులు జరిగే ప్రదేశంలో టెంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాగునీరు సరఫరాకు ఒక కూలీని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చీమకుర్తిలో రెవెన్యూ అధికారుల తనిఖీలు

చీమకుర్తి, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలో రెవెన్యూ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డేను పురస్కరించుకొని మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పట్టణంలోని సత్యసాయి ఏజెన్సీస్ భారత్‌పెట్రోలియం బంక్‌ను తనిఖీ చేశారు. మౌలికసదుపాయాలు, రేట్లు, నాణ్యత్తప్రమాణాలను పరిశీలించారు. పెట్రోల్ రేట్లను తెలిపే బోర్డును ఉంచాలని సూచించారు. తదుపరి తహసీల్దార్ బ్రహ్మయ్య తన సిబ్బందితో కలిసి గోడౌన్, క్రాకర్స్ షాపు, ఆర్వో ప్లాంటు, సినిమా థియేటర్, గ్యాస్‌ఏజెన్సీ గోడౌన్, రైస్‌మిల్లను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీటీ రాజ్యలక్ష్మి, కమిషనర్ రామకృష్ణయ్య, శాంతిప్రియ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ఒక్క గ్రామంలోనూ ప్రజలు ఇబ్బంది పడకూడదు..

మంత్రి డాక్టర్ స్వామి ఆదేశం


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి స్వామి

కొండపి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నంకాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. వేసవికాలంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. టంగుటూరు, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో పైపులైన్‌ల ద్వారా నీటి సరఫరాకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడైనా నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని సూచించారు. పొలాల్లో పశువులకు నీరందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

పర్యాటకులపై దమనకాండ దారుణం

- మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులను అతికిరాతకంగా హతమార్చటం పిరికిపందల చర్యని మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు మండిపడ్డారు. మంగళవారం ఒంగోలులోని మిలటరీ క్యాంటీన్ ఆవరణలో మాజీ సైనికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు తుది ముట్టించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటకులపై చేసిన దమనకాండను యావత్ భారతదేశం ఖండిస్తుందని, ప్రతి పౌరుడు కేంద్రానికి అండగా ఉండాలని కోరారు. పర్యాటకులపై చేసి ఉగ్ర చర్యకు నిరసనగా మే 2వతేదీన స్థానిక కలెక్టరేట్ మానవహారం, నిరసన వ్యక్తం చేస్తామని చెప్పారు. మాజీ సైనికులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాశం వెంకటరెడ్డి, ఆలపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలి

- మంత్రి గొట్టిపాటికి ఉపాధ్యాయుల వినతి


మంత్రి రవికుమార్‌ను కలిసిన మినిమం టైం స్కేలు ఉపాధ్యాయులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-1998 మినిమం టైం స్కేలు(ఎంటీఎస్) టీచర్ల సర్వీసులను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం తాడేపల్లిలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. తాము కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నందున తమకు ఎటువంటి సర్వీసు రూల్స్ లేవని, తమ ఉద్యోగ నియామకాలప్పుడు తమ నివాసానికి సమీపంలో పోస్టింగ్ ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయితే ఆ ఉత్తర్వులకు భిన్నంగా వంద కిలో మీటర్ల దూరంలో నియమించినందున ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమకు డీఏ, హెచ్‌ఆర్‌ఏ వంటి సౌకర్యాలు లేకుండా కేవలం మూలవేతనంతో పని చేస్తున్నామని, వచ్చేనెలలో జరగనున్న టీచర్ల బదిలీల్లో తమకు ప్రాధాన్యత ఇచ్చి మొదటి అవకాశం కల్పించాలని మంత్రి రవికుమార్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మండవ సుబ్బారావు, కె.వెంకట శివప్రసాద్, సర్వేశ్వరరావు, ప్రభాకర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

పేస్ విద్యార్థినికి రూ.22 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం


జ్ఞానప్రసూనకావ్యశ్రీని అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీధర్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న పెరుమాళ్ల జ్ఞానప్రసూనకావ్యశ్రీ రూ.22 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ ఈ కామర్స్ సంస్థ మీషా కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేయనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో జ్ఞానప్రసూనకావ్యశ్రీ, ఆమె తల్లిదండ్రుల సమక్షంలో కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం నుంచే విద్యార్థులకు జాబ్ ఓరియంటేడ్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణతోనే విద్యార్థులు ఎక్కువ మంది ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థిని మాట్లాడుతూ కళాశాలలో ఇచ్చిన ఉత్తమ శిక్షణతోనే ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, వీరాంజనేయులు, సుబ్బారావు, రూపన అక్కేష్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలు వేశారు.. కరెంటు తీగలు మరిచారు !


కరెంటు తీగలు లేకుండా ఉన్న స్తంభం

సంతనూతలపాడులోని శ్రీఅంకమ్మతల్లి ఆలయం వెనుక వైపు తూర్పు బజారులో విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలు వేశారు గానీ, కరెంటు తీగలు ఏర్పాటు చేయడం మరిచారని స్థానికులు వాపోతున్నారు. రాత్రి అయ్యిందంటే చాలు తూర్పుబజారులో స్థానికులు చీకట్లో నడకసాగించాల్సిన పరిస్థితి. రెక్కాడితే డొక్కాడని కుటుంబాలు ఈ బజారులో ఎక్కువమంది నివసిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కరెంటు తీగలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకో వాలని స్థానికులు కోరుతున్నారు.

- సంతనూతలపాడు(ఆంధ్రజ్యోతి)

విద్యుత్ అదనపు లోడుపై రాయితీ

మద్దిపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదనపు లోడు రుసుంపై 50 శాతం రాయితీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆశాఖ మద్దిపాడు మండల ఏఈ చెన్నారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రాల్లో కనీసం రెండు కిలోవాట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వినియోగదారులు వినియోగించుకునే విద్యుత్ అధికలోడు చూపుతూ కనెక్షన్లు తీసుకోవాలని, లేకుంటే విజిలెన్స్ అధికారులు దాడుల సమయంలో గుర్తిస్తే కేసులు నమోదు చేస్తారని పేర్కొన్నారు.

నేడు వెల్లంపల్లి పొగాకు కేంద్రం సందర్శన

- మాజీ మంత్రి మేరుగ

మద్దిపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లిలోని పొగాకు వేలం కేంద్రాన్ని బుధవారం మాజీ ఎంపీ వైవీ.సుబ్బారెడ్డి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు సందర్శిస్తారని మాజీ మంత్రి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేరుగ నాగార్జున మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, శ్రేణులు పాల్గొనాలని కోరారు.

వైసీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడిగా 'బత్తుల'

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా బత్తుల బ్రహ్మానందరెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కమిటీ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఆ నాయకులు అభినందించారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని రూపొందించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజమోహన్‌రావు కోరారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి- రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో రాజమోహన్‌రావు మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ నియంత్రణ కోసం అందరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన


ఆహారాన్ని పరిశీలిస్తున్న పీడీ హేమసృజన

సంతనూతలపాడు, ఏప్రిల్ 29(ఆంధ్ర జ్యోతి): పేర్నమిట్టలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ జిల్లా పీడీ హేమసృజన పరిశీలించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంతో పాటుగా పౌరసరఫరాలశాఖ నుంచి వస్తున్న సరుకులు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


రహదారి పక్కన ఏర్పడిన గుంత

ప్రమాదకరంగా గుంత

» పిల్లలు, వృద్ధులు, వాహనదారులు పడుతున్నారని ఆవేదన

» కంచెను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి తరచూ పిల్లలు, పెద్దలు, వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని కొలుకుల రోడ్డులో కాంప్లెక్స్ పక్కన వీధి మొదట్లో సాగర్ నీరు విడుదల చేసే వాల్ గుంత ఉంది. అయితే ఆ గుంత ఇప్పుడు ప్రమాదకరంగా మారింది. వాల్‌కు అవసరమైన రంధ్రం వరకు ఏర్పాటు చేసి కంచె లేదా సిమెంట్ దిమ్మెను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

మార్జిన్‌లో కరెంట్ స్తంభాలు

పొంచి ఉన్న ప్రమాదాలు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మార్జిన్లలో కరెంట్ స్తంభాలను అధికారులు ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. గిద్దలూరు నుంచి పోరుమామిళ్ల వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఈ స్తంభాలను సంబంధిత కాంట్రాక్టర్ ఏర్పాటు చేశారు. రోడ్డుకు సుమారు 3 అడుగులు ఆనుకుని మార్జిన్ మీదికి పోల్స్‌ను వేసినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించక పోవడం శోచనీయం. ముండ్లపాడు నుంచి మిట్టమీదిపల్లె వరకు రోడ్డు మార్జిన్‌పైనే సుమారు 20 స్తంభాలను కాంట్రాక్టర్ వేసినప్పటికీ విద్యుత్ అధికారులు కూడా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు అంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి రాత్రిపూట ఎదురుగా వాహనాలు వచ్చేటపుడు మార్జిన్ దిగే సమయాలలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలను రోడ్డు నుంచి కనీసం 3 మీటర్ల దూరంలో వేయించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


రోడ్డును ఆనుకొని ఉన్న స్తంభం

వేలాడుతున్న తీగలు

తర్లుపాడు : తర్లుపాడు రైల్వే గేటు వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండటంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. తర్లుపాడు-మార్కాపురం ప్రధాన రోడ్డుకు అడ్డంగా ఉన్న తీగలు వేలాడుతుండడంతో ఈ రోడ్డుపై వెళ్లే భారీ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల రైల్వేగేటు వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయడంతో వాటి కిందే తీగలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత నాలుగు రోజుల కిందట వరిగడ్డి ట్రాక్టర్‌కు తీగల తగలడంతో గడ్డి తగులబడిన సంగతి తెలిసిందే. అలాగే మిర్చి లారీకి తీగలు తగలడంతో స్వల్ప ప్రమాదం జరిగింది. భారీ వాహనాలు వస్తే ఈ విద్యుత్ తీగలు కచ్చితంగా తగులుతున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందేమోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా మిర్చ లోడు, పసు గ్రాసం లోడుతో వెళ్తున్న వాహనాలకు కరెంట్ తీగలు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకుని సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


రైల్వే గేటు వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఎస్సీ కార్పొరేషన్ రుణాలను వినియోగించుకోవాలి

ఈడీ అర్జున్ నాయక్


మాట్లాడుతున్న ఈడీ అర్జున్ నాయక్

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వా రా ప్రభుత్వం ఇస్తున్న రాయితీ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1305 రుణాలను 38 మండలాలు, 8 మున్సిపాలిటీలకు జనాభా ప్రాతిపదికన లబ్ధిదారులకు రుణాలు మం జూరు చేయనున్నట్లు తెలిపారు. 21 సంవత్సరం నుంచి 50 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన అర్హులు ఓబీఎంఎస్ పోర్టల్‌లో వారి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. మొత్తం మూడు విభాగాలుగా రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రూ.2.50లక్షల నుంచి రూ.3 లక్షల లోపు యూనిట్ల ఏర్పాటుకు 60 శాతం రాయితీ 5 శాతం లబ్ధిదారుని వాటా మిగిలిన 35 శాతం బ్యాంకు ద్వారా రుణాలను పొందాలని తెలిపారు. రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల లోపు యూనిట్ల ఏర్పాటుకు 50 శాతం రాయితీ 5 శాతం లబ్ధిదారుని వాటా మిగిలిన 45 శాతం బ్యాంక్ ద్వారా రుణం పొందాలని తెలిపారు. రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు ఆపైన 40 శాతం రాయితీ 5 శాతం లబ్ధిదారుని వాటా మిగిలిన 55 శాతం బ్యాంకు ద్వారా రుణం పొందాలని తెలిపారు. కార్లు, గూడ్స్ ఆటోలు, కార్లకు 50 శాతం రాయితీ వస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగానికి జిల్లాకు 12 డ్రోన్‌లను మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 14వ తేదీ నుంచి మే 10 వరకు పోర్టల్‌లో అప్లై చేసుకోవచ్చునని తెలిపారు. మే 10 తేదీ తర్వాత లబ్ధిదారులను పరిశీలించి తుది జాబితా బ్యాంక్ వారికి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఓబీఎంఎస్ పోర్టల్‌లో అప్లై చేసుకున్నవారికి పొరపాట్లు జరిగి ఉంటే ఎస్సీ కార్పొరేషన్ ఈడీని సంప్రదించి సరిచేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

బ్రెడ్లు, పండ్లు పంపిణీ

గిద్దలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంజీవిని అనాథ శరణాలయంలోని వృద్ధులకు, విద్యార్థులకు యువ ప్రగతిపథం స్వచ్ఛంద సంస్థ బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, జీరా బాటిల్స్‌ను అందచేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పగిడి వేణుగోపాల్, సంస్థ ప్రతినిధులు రత్నం, సిద్ధయ్య, పీరయ్య ఆశ్రమ నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి క్యారంబోర్డు అందజేత


చెస్ నేర్చుకుంటున్న విద్యార్థులు

గిద్దలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా 2వ రోజు మంగళవారం 40 మంది విద్యార్థినీవిద్యార్థులు హాజరయ్యారు. తరగతులవారీగా వారిని విభజించి వారి చేత నీతికథలు చెప్పించడం, చెస్, క్యారమ్స్ ఆటలు నేర్పించడం, యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. వేసవి శిక్షణ కోసం పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థాన మాజీ ఛైర్మన్ శివపురం ఆంజనేయులు క్యారంబోర్డును బహూకరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, ఫ్యాకల్టీ ఉపాధ్యాయులు రామిరెడ్డి, శివ ప్రసాద్ పాల్గొన్నారు

ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో మంగళవారం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు వెంకట సుబ్బారెడ్డి, ఫ్యాకల్టీ శ్రీనివాసరావు విద్యార్థులకు డ్యాన్స్, చిత్రలేఖనం నేర్పించారు.

బేస్తవారపేట : గ్రంథాలయంలో జరుగుతున్న శిక్షణ తరగతులకు మంగళవారం 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి పుస్తకాలు చదవించడం, డ్రాయింగ్ తదితరవి నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పీవీ గురుస్వామి, ఎస్‌కే వలి పాల్గొన్నారు.

ఉద్యోగులకు సర్వీసును అందజేయాలి


సబ్ ట్రెజరీ అధికారిని సన్మానిస్తున్న ఎన్జీవో నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉప ఖజానా కార్యాలయంలో ఉద్యోగులకు సకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సర్వీసు కార్యక్రమాలను అందజేయాలని ఎన్జీవో నాయకులు అన్నారు. ఉప ఖజానా కార్యాలయం వద్ద మార్కాపురం ఉప ఖజానా అధికారి శ్రీకృష్ణ ప్రకాశం జిల్లా ట్రెజరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా అదే కార్యాలయంలో పనిచేస్తున్న హేమలత కూడా అసోసియేషన్ జిల్లా మహిళా కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మార్కాపురం తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బీవీ శ్రీనివాస శాస్త్రీ, వడ్లమాని శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు, ఎన్జీవో సంఘ నాయకులు, సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ నిర్మలాదేవి

ఉపాధి పనుల పరిశీలన

కొలతలు తీయిస్తామని ఏపీడీ వెల్లడి

పుల్లలచెరువు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రివేముల గ్రామంలో బోగస్ మస్టర్లపై మార్కాపురం ఏపీడీ నిర్మలాదేవి మంగళవారం విచారణ జరిపారు. మర్రివేములలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించి కూలీలతో మాట్లాడారు. హాజరైన కూలీలు, చేసిన పనులకు మధ్య తేడాలు ఉన్నట్లు ఆమె తెలిపారు. సిబ్బందితో కొలతలు తీయించి జిల్లా ఉన్నాతాధికారులకు నివేదిక అందజేస్తామని ఏపీడీ తెలిపారు.

పీఆర్సీ సవరణపై పింఛనర్ల ఆందోళన


మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి

గిద్దలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పీఆర్సీ తాజా సవరణలపై పింఛనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. పింఛనర్ల భవనంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంఘం సమావేశం జరిగింది. అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కేంద్రం చేసిన సెంట్రల్ సివిల్ సర్వీస్ 1972 రూల్ సవరణ ప్రకారం పీఆర్సీ ఇప్పటి నుంచి రిటైర్డ్ అయిన వారికి వర్తిస్తుందని, గతంలో రిటైర్డ్ అయిన వారికి పీఆర్సీ అమలు కాదని పార్లమెంట్‌లో చట్టం కూడా చేసినట్లు పేర్కొన్నారు. ఈ సవరణను త్వరలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అమలు జరిపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సవరణలకు నిరసనగా ప్రభుత్వాలకు పింఛనర్లు నిరసన తెలియజేయాలని కోరారు. త్వరలో లక్ష మందితో పోస్టుకార్డు క్యాంపింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, రంగయ్య, శివారెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

గిద్దలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా షేక్ నాయబ్‌రసూల్, ఉపాధ్యక్షుడిగా డి.శరత్‌కుమార్, కార్యదర్శిగా కేవీ రమణారెడ్డి, ఉప కార్యదర్శిగా ఎం.రాజు, కోశాధికారిగా బి.నిర్మలమ్మ, కోఆప్షన్ సభ్యులుగా షేక్ రసూల్‌బీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంఘ మాజీ జిల్లా అధ్యక్షులు వై.పోలయ్య తెలిపారు.

అభివృద్ధికి దూరంగా గ్రంథాలయాలు

గ్రంథపాలకుడు లేక పలుచోట్ల మూత

కంభం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలంలో పలు గ్రంథాలయాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. వైసీపీ హయాంలో వాటి బాగోగులు పట్టించుకోకపోవడంతో అవి అవసాన దశకు చేరుకున్నాయి. పలు చోట్ల గ్రంథపాలకులు లేక మూతపడ్డాయి. గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలోనైనా వాటి అభివృద్ధికి కృషి చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. కంభం గ్రంథాలయంలో అన్నీ ఉన్నా గ్రంథాలయ స్థలం ఎంపిక సక్రమంగా లేకపోవడం, రెగ్యులర్ గ్రంథపాలకుడు లేకపోవడంతో పాఠకులు రాక వెలవెలపోతున్నాయి. రావిపాడు గ్రంథాలయంలో గ్రంథపాలకుడు లేక నాలుగు సంవత్సరాలుగా మూతపడింది. తురిమెళ్లలో 3 సంవత్సరాల కిందట గ్రంథపాలకుడు ఉద్యోగ విరమణ చేయడంతో దానిని మూసివేశారు. తురిమెళ్ల మేజర్ పంచాయతీ, రావిపాడులో వెయ్యి మందికి పైగా విద్యార్థులు, నిరుద్యోగులు ఉన్నారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు 30 సంవత్సరాల కిందట రావిపాడులో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. కొన్ని సంవత్సరాలు సజావుగానే సాగింది. అయితే వైసీపీ పాలనలో గ్రంథపాలకుడిని అర్ధవీడుకు బదిలీ చేయడంతో మూతపడింది. దీనితో పాఠకులు కంభంకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంభం గ్రంథపాలకుడిని గత ఏడాది బదిలీ చేయడంతో బేస్తవారపేట గ్రంథపాలకుడు వచ్చి వారంలో 2 రోజులు మాత్రమే తెరుస్తున్నారు. మిగిలిన రోజులు మూతపడుతుంది. ఏడాదికోసారి వారోత్సవాల పేరుతో హడావిడి చేసేకన్నా, గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పాఠకులు కోరుతున్నారు. వేసవి సెలవులు వచ్చినందున విద్యార్థులు, నిరుద్యోగులు చదువుకునేందుకు ఉపయోగకరంగా గ్రంథాలయాలను తెరవాలని కోరుతున్నారు.



గ్రంథపాలకుడు లేక మూతపడిన కంభం గ్రంథాలయం


నాలుగేళ్లుగా మూతపడిన రావిపాడు గ్రంథాలయం

మోదీ పర్యటనను విజయవంతం చేద్దాం

కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మే 2వ తేదీన అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికి, ఆ సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడారు. అమరావతి రాజధాని తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీయే విధానమని, 2014 నుంచి కేంద్ర విద్యాసంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఏర్పాటు చేశారని తెలిపారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేశారన్నారు. ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధితో ఆదాయం మెండుగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నిర్మాణానికి శ్రమిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు. సమావేశంలో 6 మండలాల పట్టణ పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, యోగానంద్, శ్రీనివాసులు, శానేషావలి, టీడీపీ నాయకులు దప్పిలి భాస్కర్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీను పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రేషన్ బియ్యాన్ని మార్కెట్‌కు తరలిస్తే చర్యలు

జేసీ గోపాలకృష్ణ

మార్కాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని మండల లెవెల్ స్టాక్ పాయింట్, పెట్రోల్ బంకుల్లో మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ముందుగా వ్యవసాయ మార్కెట్ యార్డులోని రేషన్ గోదాంలో తనిఖీలు చేశారు. రేషన్ దుకాణాలకు తరలించిన, మిగిలిన బియ్యం రికార్డులను పరిశీలించి లెక్కించారు. గోడౌన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకును పరిశీలించారు. అక్కడ ఫైర్ సేఫ్టీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గమనించారు. దుకాణ యజమానికి సూచనలు చేశారు. మార్కాపురం రెవెన్యూ అధికారులు ఉదయం నుంచి పలు రేషన్ దుకాణాలు, గ్యాస్ గోడౌన్‌లలో తనిఖీలు చేపట్టారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి, అగ్నిమాపకశాఖాధికారి రామకృష్ణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : పట్టణంలో పలు స్టాక్ పాయింట్ ప్రాంతాలను జేసీ గోపాలకృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. పట్టణంలోని గ్యాస్ గోడౌన్, హరికృష్ణ, రాఘవేంద్ర సినిమాహాళ్లు, వాటర్‌ప్లాంట్‌లను జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినిమాహాళ్లలో ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సరైన సౌకర్యాలు లేవని పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. టికెట్ ధరలు, సౌకర్యాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. అదే విధంగా కరుణ ఇండేన్ గ్యాస్ స్టాకు పాయింట్‌ను పరిశీలించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదు మేరకు వాటర్ ప్లాం ట్‌లను జేసీ తనిఖీ చేశారు. నిబంధనల ప్లాంట్లలో నిబంధనలు పాటించేలా రో జూ తనిఖీలు చేయాలని ఆదేశించారు. అనంతరం చింతగుంపల్లిలో రీసర్వే హద్దు రాళ్లను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆ యన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ సురే ష్, డిప్యూటీ తహసీల్దార్ షాజీదా, నగరపంచాయతీ కమిషనర్ నారాయరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేఖ, ఆర్ఐ నరసింహారావు, సర్వేయర్ గురవయ్య, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

వైపాలెంలోని వాసవీ రైస్‌మిల్‌ను జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే 6వ నెంబర్ చౌకదుకాణంలో స్టాక్ నిల్వలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ ఉన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని దరిమడుగు గ్రామ పరిధిలో ఉన్న పీ ఎల్పీ ఇండేన్ గ్యాస్ గోడౌన్‌ను సోమవారం అధికారులతో కలిసి తహసీల్దార్ చిరంజీవి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గోడౌన్‌లో అత్యవసర సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యాజమానులతో చర్చించారు. పెట్రోల్ బంకులలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : బేస్తవారపేటలోని వాటర్ ప్లాంట్, పెట్రోల్ బంకు, సినిమా థియేటర్లు, గ్యాస్ గోడౌన్‌లను అధికారులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, రీసర్వే డీటీ, ఆర్ఐ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పాల్గొన్నారు.


ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు చేస్తున్న జేసీ గోపాలకృష్ణ, ఇతర అధికారులు


గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన అచ్చిరెడ్డితో సభ్యులు

టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

తర్లుపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు మండలంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా మీర్జపేట గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాజారపు నాగతిరుపతయ్య, గొల్లపల్లికి పల్లెబోయిన కేశవులు, నాగెళ్లమడుపు - తిరుమల కనకయ్య, తాడివారిపల్లెకి మేడబోయిన వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డిపల్లికి కోటపాటి వెంకటరెడ్డి, తుమ్మలచెరువుకు సయ్యద్ మహబూబ్ వలి, సూరెపల్లికి గ్రంధె రంగమోహన్, కేతగుడిపికి బత్తుల శ్రీనివాసులు, రాగిసముద్రానికి మేకల తిరుపతిరెడ్డి, పోతలపాడుకు ఉడుముల రామిరెడ్డి, మంగళకుంట గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా గుమ్మా కాశమ్మ, గానుగపెంటకు జెట్టిబోయిన తిరుపతయ్య, కలుజువ్వలపాడుకు మేకల అచ్చిరెడ్డిలను టీడీపీ నాయకులు ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, కమిటీ అధ్యక్షుడు మాజీ ఎంపీపీ పులివేముల ఏసుదాను, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరె డ్డి, నంబుల లక్ష్మయ్య, వేసెపోగు జాన్, మండల యూత్ అధ్యక్షులు మేకల వెంకట్, వీర్ల వెంకటయ్య, కాశంగి శ్రీనివాసులు తెలిపారు.


తీగలేరు తీర్మానంపై సంతకం చేస్తున్న ఎంపీపీ వెంకటయ్య, వేదికపై ఎంపీడీవో శ్రీనివాసులు

అభివృద్ధికి సహకరించాలి

తీగలేరు పనుల కోసం మండల సభ్యుల తీర్మానం

పుల్లలచెరువు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పుల్లలచెరువు ఎంపీపీ కందుల వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన పుల్లలచెరువు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం సభ్యులు వెలిగొండ తీగలేరు-5 కాలువ పనులను ప్రారంభించి చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని ఏక్రగీవంగా తీర్మానం చేశారు. సమావేశానికి కీలత శాఖల అధికారులు రాకపోవడంపై ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రాములు, నర్సమ్మ, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీ

మార్కాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద ప్రాంతాలు, దుకాణాల్లో పలుచోట్ల పట్టణ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఏకలవ్య కాలనీ, డ్రైవర్స్ కాలనీల్లో కిరాణా, కూల్‌డ్రింక్స్ దుకాణాలను పరిశీలించారు. మద్యం అక్రమ నిల్వలు, గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించిన క్రమంలో తరచూ తనిఖీలు చేస్తున్నట్లు ఎస్ఐ డాక్టర్ ఎం.రాజమోహన్‌రావు తెలిపా రు. నిషేధిత పదార్థాలను కలిగివుంటే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్ ఎస్ఐ అన్నారు. కంభం రోడ్డులోని మధు చిన్నపిల్లల వైద్యశాల సమీపంలో పట్టపగలే యథేచ్ఛగా మద్యం సేవిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో తెలుసుకున్న ఆయన వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

- పౌరసరఫరాల శాఖ జిల్లా అసిస్టెంట్ మేనేజర్ ఉషారాణి హెచ్చరిక
- పలుప్రాంతాల్లో అధికారుల తనిఖీలు


పామూరు: ఎఫ్‌సీఐ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ ఉషారాణి

పామూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఉచితంగా అందజేస్తున్న సరుకుల తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ జిల్లా అసిస్టెంట్ మేనేజర్ ఉషారాణి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. బియ్యం బస్తాలను తూకాలు వేసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ డీలర్లు, ఎండీవో ఆపరేటర్ల వద్ద తూకాల్లో మోసాలు జరిగితే అందుకు బాధ్యులపై తగిన చర్యలు తప్ప వన్నారు. ప్రతినెలా కార్డుదారులకు సక్రమంగా సరుకుల పంపిణీ జరిగేలా చూడలన్నారు. అనంతరం గోడౌన్‌లోని సరుకుల రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటి మధుసూదనరావు, ఆపరే టర్ బి.కిరణ్ పాల్గొన్నారు.

పీసీపల్లిలో.. పీసీపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండేన్ గ్యాస్ గోడౌన్‌ను తహసీల్దార్ సీహెచ్ ఉష మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి గోడౌన్‌లో ఉన్న సిలిండర్‌లను పరిశీలించారు. అధిక ధరలకు విక్రయించినా, సరఫరా చార్జీలు వసూలు చేసినా, నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్థానిక పీఎస్ఆర్ రైస్‌మిల్, పెట్రోల్ బంకు, చౌకధరల దుకాణం, ఆర్వో ప్లాంట్‌లలో తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి నిబంధనలమేర వ్యాపారం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంట వీఆర్వోలు పిచ్చిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వీఆర్ఏలు దస్తగిరి, చిననరసింహం తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో.. కురిచేడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని రెండు పెట్రోలు బంకులు, గ్యాస్ గోడౌన్, సినిమా హాలు, మినరల్ వాటర్ ప్లాంట్‌లను మంగళవారం తహసీల్దార్ రజనీకుమారి తనిఖీ చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ నాగరాజు, వీఆర్వో నాగరాజు ఉన్నారు.

దర్శిలో.. దర్శి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో గ్యాస్ గోడౌన్‌ను, పెట్రోల్ బంక్‌లను రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు సిబ్బందితో వెళ్లి దర్శి-అద్దంకి రోడ్డులోని గ్యాస్ గోడౌన్‌ను తనిఖీ చేశారు. నిల్వ పాయింట్లు, నిబంధనలు పాటిస్తున్నారా అనే విషయాలను పరిశీంచారు. రిజిస్టర్లు పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. అనంతరం పెట్రోల్ బంక్‌లను పరిశీలించి రికార్డులను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో మురళీ, తదితరులు పాల్గొన్నారు.


కనిగిరి: అంగన్‌వాడీ సరుకులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రవిశంకర్

తాళ్లూరులో.. తాళ్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లూరు, తూర్పుగంగవరం గ్రామాల్లోని పెట్రోలు బంక్‌లు, గ్యాస్‌ఏజన్సీలను మంగళవారం కె.సంజీవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ స్టాక్ రిజిష్టర్లు, ప్రభుత్వపథకాల ద్వారా అందుతున్న గ్యాస్ కనెక్షన్ల వివరాలను పరిశీలించారు. పెట్రోలు బంక్‌లో పెట్రోలు తరుగుదల లేకుండా నాణ్యమైన పెట్రోలు వినియోగదారులకు అందుతున్నదీ, లేనిది పరిశీలించారు. ఆయన వెంట వీఆర్‌వో పి.చంద్రశేఖర్‌రావు తదితరులు ఉన్నారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): పేదలకు పంపిణీ చేస్తున్న నిత్యా వసర సరుకుల్లో అక్రమాలకు పాల్పడవద్దని డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని శింగన్నపాలెం, పెదఉల్ల గల్లు గ్రామాలలో రేషన్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్డుదారులకు ప్రతినెలా ఇస్తున్న సరుకుల వివరాలను రికార్డులతో సరిపో ల్చారు. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ముండ్లమూరులోని గ్యాస్ గోడౌన్, కార్యాలయాన్ని తనిఖీ చేశా రు. తదనంతరం పెట్రోల్‌బంక్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ మూర్తి, వీఆర్వో రాఘవరెడ్డి, బ్రహ్మతేజ పాల్గొన్నారు.

రేషన్‌ను సక్రమంగా అందజేయాలి

కనిగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ప్రజాపంపిణీ సరుకులను ఎంఎల్ఎస్ పాయింట్‌లకు సక్రమంగా అందేలా చూడాలని తహసీల్దార్ రవిశంకర్ అన్నారు. పట్టణ సమీపంలోని ఎంఎల్ఎస్ గోడౌన్‌ను మంగళవారం తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. గోడౌన్ ఇన్‌చార్జ్ కమ్రుద్దీన్‌ను స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ రవాణాచేస్తూ పట్టుబడిన సరుకు వివరాలపై ఆరా తీశారు. 1518 బస్తాల రేషన్ బియ్య బస్తాలు ఉన్నట్లు తహసీల్దార్‌కు తెలిపారు.

అలాగే, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన స్టాకు సరుకులను పరిశీలించారు. ప్రతినెలా 20వ తేదీ నుంచి నెలాఖరు వరకు సరఫరా చేయాల్సిన రేషన్ బస్తాలు ఇంకా ఉండటంపై ఆయన గత రికార్డులను పరిశీలించారు. రేషన్ సరుకులు పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగినా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని సిబ్బందిని హెచ్చరించారు.

తహసీల్దార్ వెంట ఎఫ్ఐ శివగంగిరెడ్డి, వీఆర్వోలు బసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, గాయం ప్రసాద్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అక్రమ మైనింగ్ ప్రాంత పరిశీలన

కురిచేడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర వీరాయపాలెం పంచాయతీ పరిధిలోని నిషేధిత 8వ సర్వే నంబరులో అక్రమ మైనింగ్‌చేసి వైట్ క్వార్ట్జ్ రాయిని వెలికితీశారు. ఈవిషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చింది. ఈక్రమంలో మంగళవారం నిషేధిత భూముల్లో అక్రమంగా మైనింగ్ చేసిన ప్రాంతాన్ని తహసీల్దార్ రజనీకుమారి, మార్కాపురం మైనింగ్ అధికారులు, ఎస్ఐ శివ పరిశీలించారు. అక్రమంగా ఎవరైనా తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో లారీని ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పసుపుగల్లులోని కాలనీకి చెందిన వరగాని శరత్ అనే యువకుడు దర్శి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈక్రమంలో ఆగి ఉన్న ధాన్యం లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ముండ్లమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 108 వాహనంలో దర్శి వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.కమలాకర్, ఏఎస్ఐ హనుమంతరావు పరిశీలించి లారీని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

రాత్రివేళ గస్తీ నిర్వహించాలి

ముండ్లమూరు, ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): వేసవిలో రాత్రివేళ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ డి.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామాలలో గస్తీ నిర్వహించాలన్నారు. వేసవిలో గ్రామాల్లో ప్రజలు ఆరుబయట నిద్రిస్తుంటారని చెప్పారు. దీంతో చోరీలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. కొత్త వ్యక్తుల కదలికలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పి.హనుమంతరావు, రైటర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ

దర్శి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో భూసార పరీక్షలు చేయించుకునేందుకు మట్టి నమూనాలను సేకరించే విధానంపై మంగళవారం వ్యవసాయాధికారులు ఆవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వెంకటచలంపల్లి గ్రామంలో వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది పొలాల్లోని మట్టిని సేకరించారు.

ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ భూమిలో పోషక విలువలు తెలుసుకునేందుకు ఈ పరీక్షలు ఎంతో అవసరమన్నారు. మండలంలో 23 రైతు సేవాకేంద్రాల్లో 1280 మట్టి నమూనాలను సేకరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. ఈకార్యక్రమానికి రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు.

ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించాలి

దర్శి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించాలని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. దర్శి పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి 9 గంటలు నిరంతరంగా కరెంట్ సరఫరా చేయాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పాత బకాయిలను వేగవంతంగా వసూళ్లు చేయాలని, అక్రమ విద్యుత్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని ఆదేశించారు. నిర్లక్ష్య వైఖరి అవలంభించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దర్శి ఈఈ పి.శ్రీనివాసులు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత నేరస్థులపై నిఘా!


రౌడీషీటర్ల దినచర్యలపై స్థానికులను ఆరా తీస్తున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. కనిగిరి ప్రాంతంలో రౌడీషీటర్ల రోజువారీ దినచర్యలపై మంగళవారం వారి నివాసాల వద్దకు వెళ్లి సమీప ప్రజల నుంచి వివరాలను సేకరించారు. గతంలో దొంగతనం కేసుల్లో ఉన్న వ్యక్తుల వివరాలను సేకరించారు. ప్రస్తుతం వారి జీవన విధానంపై ఆరా తీశారు. అనంతరం వారి నివాసాల వద్ద రౌడీ షీటర్లకు, పాత దొంగలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై నేరాలకు పాల్పడితే జైలుశిక్షలు వేస్తారని హెచ్చరించారు.

కిశోర బాలికల వికాసానికి తోడ్పాటునందించాలి

తాళ్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కిశోరబాలికల వికాసానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సీడీపీవో సీహెచ్ భారతి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమంపై జరిగిన శిక్షణలో ఆమె మాట్లాడారు. బాలిక విద్యను ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్ వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 11 నుండి 18 ఏళ్ల లోపు వయస్సున్న బాలికలను గుర్తించి గ్రూపులుగా విభజించాలన్నారు. ఆగ్రూపు బాలికలకు సమ్మర్ క్యాంపులు నిర్వహిం చాలన్నారు. ఎంఈవో జి.సుబ్బయ్య, ఏపీఎం దేవరాజ్, వైద్యశాఖకు చెందిన కోటేశ్వరి కూడా మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగిఉండాలి

పామూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై పొదుపు గ్రూపు మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం జి.విద్యాసాగర్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య కార్యవర్గ సమావేశానికి అధ్యక్షురాలు ఓ.సుబ్బమ్మ అధ్యక్షత వహించారు.

విద్యాసాగర్ మాట్లాడుతూ పొదుపు గ్రూపు సంఘాలు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం బ్యాంకు లింకేజి రుణాలు మంజూరు చేస్తుందన్నా రు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు పచ్చవ లక్ష్మీకాంతమ్మ, కార్యదర్శి ఉమ్మడి పద్మ, సహాయకార్యదర్శి పాడే విజయ, సీసీలు సరళ, షేక్ సత్తార్ సుబ్రమణ్యం, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు

పామూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ టి.కిశోర్‌బాబు హెచ్చరించారు. మంగళవారం రాత్రి మండలంలోని తిరగళదిన్నెలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.

ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు లేకుండా ప్రశాంత జీవనం గడపాలన్నారు. పేకాట, కోడి పందేలు నిర్వహిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచరిస్తుంటే పోలీసులకు తెలియజే యాలన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు

పామూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను జరిపినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, సీడీపీవో పి.సరోజిని హెచ్చరించారు. మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలపై కఠిన చట్టాలు ఉన్నాయన్నారు. అందుకు పాల్పడేవారు శిక్షకు గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.నాగేశ్వరావు, సూపర్‌వైజర్ జి.పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహాన్ని వదిలి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



పామూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత పోస్టాఫీసు వద్దగల సాయిబాబా దేవస్థానంలో అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లారని దేవస్థాన చైర్మన్ పబ్బిశెట్టి వెంకటసుబ్బయ్య తెలిపారు. వారం రోజుల క్రితం బాబా మూలవిరాట్ విగ్రహానికి వెనుక భాగంలో గోతంలో ఇది పెట్టిఉందని చెప్పారు. ఆలయ పూజారి గోతం తీసి చూడగా సుమారు 3 అడుగుల పంచలోహ విగ్రహం ఉందని తెలిపారు. ఈవిషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు.

భూసార పరీక్షలు తప్పక చేయించాలి

దొనకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పంటల దిగుబడుల్లో భూసార పరీక్షలు కీలకమని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని చిలకలపల్లి గ్రామంలో మంగళవారం మట్టి నమూనాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది మండలంలోని 14 రైతు సేవాకేంద్రాల పరిధిలో 779 మట్టి నమూనాలను తీయబోతున్నట్లు తెలిపారు. రైతులు సాగుచేయబోయే పంటలకు ఏ ఎరువులు ఎంత మోతాదులో వేయాలో తెలుసుకోవాలంటే మట్టి పరీక్షలు తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు రాధ్ధి పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

కనిగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే మంచి పుస్తకాలు పఠనం ఉన్నతస్థాయికి సోపానాలుగా మారుతుందని జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు గయాజ్‌బాషా అన్నారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం జరిగిన ఉచిత విజ్ఞాన తరగతుల వేసవి శిబిరంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యపై అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంధపాలకుడు అహ్మద్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్‌ను తీర్చిదిద్దండి

ముండ్లమూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బాలల బంగారు భవిష్యత్‌పై ప్రతిఒక్కరూ దృష్టి సారించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీడీపీవో సీహెచ్ భారతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బాలల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వారికోసం ప్రత్యేకంగా కార్యక్రమం ఏర్పాటుచేసిందన్నారు. 11 నుంచి 18 సంవత్సరాలు వయస్సు ఉన్నవారిపై సర్వే నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, వైద్యాధికారిణి జాష్మి, ఎంఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ అధికారి వెంకటరమణారెడ్డి
- దొనకొండ రైల్వే స్టేషన్ తనిఖీ


రైల్వే ఆడిటోరియంలో మొక్కలు నాటుతున్న రైల్వే ఉన్నతాధికారులు

దొనకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ రైల్వే జోన్‌కు చెందిన ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం దొనకొండ రైల్వేస్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ప్రత్యేక రైలులో గుంటూరు నుంచి అన్నీ రైల్వేస్టేషన్లు, రైల్వేట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థలలో సమగ్ర భద్రతా తనిఖీలు చేస్తూ దొనకొండకు చేరారు. దొనకొండలోని రైల్వే స్టేషన్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి అమృత్‌భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం రైల్వే ఇనిస్టిట్యూట్, ఆడిటోరియం వద్ద రైల్వే అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా రైల్వే సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైల్వే కార్యకలాపాలలో భద్రతా చర్యలను పరిశీలించటం, ప్రయాణికుల సౌకర్యాలను అంచనా వేయటంపై దృష్టి సారించినట్టు చెప్పారు. రైల్వే ఉద్యోగులు విధి నిర్వహణలో భద్రతా చర్యలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు సీఎస్ఈ భూపతిసింగ్, సీఈ మోహిత్‌వర్మ, సీఈడీఈ తోరియ, గుంటూరు రైల్వే డివిజనల్ అసిస్టెంట్ రైల్వే డివిజనల్ మేనేజర్ సైమన్, డీఈఎన్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న పిచ్చయ్య

దర్శి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఎపీ నీరు సక్రమంగా రాని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించాలని అధికారులను ఆదేశించారు. పదో వార్డులో ఎన్ఏపీ పైపులైన్లు దెబ్బతిని మంచినీటి సరఫరా నిలిచినందున పైపులైన్లు మరమ్మతులను వెంటనే పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లు, మురికి కాల్వలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ వై.మహేశ్వరరావు, వైస్‌చైర్మన్ స్టీవెన్, తదితరులు పాల్గొన్నారు.

కాగా, నగర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు చొప్పున వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రంగారావు ఆధ్వర్యంలో చైర్మన్ పిచ్చయ్యకు వినతిపత్రం అందజేశారు.

క్షయ వ్యాధిగ్రస్తులు బలమైన ఆహారం తీసుకోవాలి


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారిణి డాక్టర్ శ్రీవాణి

దొనకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో క్షయ వ్యాధిగ్రస్తులు బలమైన ఆహారం తీసుకోవాలని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ వ్యాధి నియంత్రణ అధికారిణి డాక్టర్ శ్రీవాణి సూచించారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కట్టకిందపల్లి, రుద్రసముద్రం గ్రామాల్లో మంగళవారం కుష్ఠు వ్యాధిగ్రస్తుల కుటుంబాల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. క్షయ వ్యాధిగ్రస్తుల గృహాలను సందర్శించి ఆరు నెలలకొకసారి తప్పకుండా చికిత్స తీసుకోవాలన్నారు. బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం దొనకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి దొనకొండ, ఆరవళ్లిపాడు, గంగదేవిపల్లి, కొచ్చెర్లకోట గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలకు, మహిళా ఆరోగ్య కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అన్వేష్‌కుమార్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్ అలెగ్జాండర్, సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పువ్వాడి వెంకటేశ్వర్లు

పామూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2న జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ సభ కోసం మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ నుంచి 20 మందికి తగ్గకుండా జనసేకరణ చేపట్టాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులంటూ మన రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబునాయుడు కేంద్రం నుంచి నిధులు రాబట్టి ఆంధులు గర్వించదగ్గ రాజధాని నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. అందులో భాగంగా జరిగే పునర్నిర్మాణ ప్రారంభ వేడుక సభకు కూటమి శ్రేణులు తరళిరావాలన్నారు. సమావేశంలో నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్ బాబు, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, పాలపర్తి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని బొట్లగూడూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడుగా కోటపాటి వెంకటేశ్వర్లు, మోపాడు అధ్యక్షుడిగా ఎం.గిడ్డయ్య యాదవ్, తూర్పుకట్టకిందపల్లి అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు, తూర్పుకోడిగుడ్లపాడు అధ్యక్షుడిగా డి.మాధవరావు, వీరభద్రాపురం గ్రామ కమిటి అధ్యక్షుడిగా పూనాటి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు.

మహిళా చైతన్యంతో కుటుంబ వికాసం



కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీసీ కార్పొరేషన్ అధికారి వెంకటేశ్వరరావు

పామూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని మహిళలు చైతన్యవంతులైనప్పుడే కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక వెలు గు కార్యాలయంలో నిర్వహిస్తున్న మహిళల ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్యతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈసంద ర్భంగా ఈడీ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబాన్ని ఉన్న త స్థానంలో నిలబెట్టాలన్నా లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

పామూరు మండలంలో 144 మందిని ఎం పిక చేసి 90 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. శిక్షణ అనంతరం స్వ యం ఉపాధి రుణాలు రూ.2 లక్షల వరకు మంజూరు చేస్తామన్నారు.

నేడు మండల సమావేశం

పీసీపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అత్యాల జషన్య అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.



ఉష్ణోగ్రత (అంచనా)

30-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	39	28
నరసరావుపేట	41	28
బాపట్ల	37	28
రెంటచింతల	41	28



అదిరేలా.. అమరావతి సభ

- పునఃశంకుస్థాపన మహోత్సవానికి భారీ ఏర్పాట్లు
- ప్రధాని రానుండటంతో ప్రతిష్ఠాత్మకంగా కార్యక్రమం
- మోదీకి అత్యద్భుతంగా ఆహ్వానం పలికేందుకు సన్నాహాలు
- వెలగపూడిలో ఏర్పాట్లపై పరిశీలన.. సమీక్షల్లో మంత్రులు
- బహిరంగ సభ విజయవంతానికి గ్రామ స్థాయి నుంచి ప్రణాళికలు



పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ నాగలక్ష్మి, ఐజీ త్రిపాఠి, వీరపాండ్యన్, జేసీ భార్గవ తేజ



ఏర్పాట్ల గురించి కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీలు, సతీష్‌కుమార్, మలికా గార్గ్‌లతో చర్చిస్తున్న హోం మంత్రి అనిత



సిద్ధమైన వేదిక



వేదిక ప్రాంతంలో రోడ్డుకిరువైపులా పచ్చదనం



తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్



64 సీసీ కెమేరాలతో నిఘా

ప్రధాన నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో 64 సీసీ కెమేరాలతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు హోం మంత్రి అనిత తెలిపారు. సీసీ టీవీ కెమేరాలతో నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సీసీ టీవీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఆరు వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వీఐపీలు, ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. అమరావతి నిర్మాణం అనేది ఆంధ్ర ప్రజల కల అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతి ఉండాలనే కాంక్షతో వైభవంగా పనులను పునః ప్రారంభించుకోవడంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, రాష్ట్ర ప్రజలు, రైతుల కష్టం, రాజధాని మహిళల ఆవేదన ఉందన్నారు. అమరావతి పున:నిర్మాణానికి ప్రధాని రావడాన్ని రాష్ట్ర ప్రజలందరూ పండుగ వాతావరణంలో జరుపుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

రాజధాని గ్రామాల్లో ఇంటింటికీ ఆహ్వానం

పండుగలా అమరావతి రాజధాని పునః నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తుంది. ఈ క్రమంలో రాజధాని గ్రామాల్లోని ప్రజలను ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానం అందజేస్తోంది. ప్రధాని సభకు సకుటుంబ సపరివారంగా తరలి రావాలని ఇంటింటికీ తిరిగి ఆహ్వాన పత్రికలను అందజేసే బాధ్యతలను అధికారులు తీసుకున్నారు. ఈ మేరకు గ్రామాల వారీగా ప్రతీ ఒక్కరికి అమరావతి ఆహ్వాన పత్రికలను అందజేస్తున్నారు.



ఆహ్వాన పత్రం అందజేస్తున్న అధికారులు

భారీగా ఏర్పాట్లు.. అత్యద్భుతంగా కార్యక్రమాలు.. వినూత్నంగా స్వాగత సన్నాహాలు.. మొత్తమ్మీద అదిరేలా అమరావతి పునః శంకుస్థాపన మహోత్సవం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజధాని అమరావతి పనులకు పునః శంకుస్థాపన.. ఆ తర్వాత జరిగే బహిరంగ సభ కార్యక్రమాలకు అటు మంత్రులు.. ఇటు అధికారులు ప్రత్యేకంగా బాధ్యతలు స్వీకరించారు. నిరం తరం సమీక్షలు.. ఏర్పాట్ల పరిశీలనలో నిమగ్న మయ్యారు. శుక్రవారం వెలగపూడి వద్ద జరుగు తున్న ఏర్పాట్లను మంత్రులు అనిత, నారాయణ అధికారులతో కలిసి ప్రత్యేకంగా పరిశీలించారు. దాదాపు ఏర్పాట్లు కొలిక్కి వచ్చినట్లు వారు ప్రక టించారు. ఇక గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గ్రామ స్థాయి నుంచి అమరావతి సభకు జన సమీకరణపై అటు అధికారులు, ఇటు స్థానిక నేతలు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా సన్నాహాలు చేస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో కుటుంబ సమేతంగా తరలి రావాలని అధికారులు రైతులకు అహ్వాన పత్రికలను ఇంటింటికి తిరిగి అందజేస్తున్నారు.

తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, కార్పొరేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యద్భుతంగా అమరావతిని తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పునః శంకుస్థాపనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. శుక్రవారం ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, బహిరంగ సభకు వెలగపూడి సచివాలయం సమీపంలో భారీగా ఏర్పాట్లు చేసింది. పండుగ వాతావరణంలో కార్యక్రమం జరుపుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయా ఏర్పాట్లు, సభకు జనసమీకరణలపై అటు అధికారులు, ఇటు మంత్రులు ప్రత్యేకంగా బాధ్యతలు తీసుకున్నారు. మోదీ హాజరుకానుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం విజయవంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరికి తాగునీరు, మజ్జిగ, భోజనం వంటి సదుపాయాలకు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ వార్డు కి ఒక ఇన్‌చార్జిని నియమించారు. ప్రజల రవాణా కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం ఏర్పాట్లను మంత్రులు నారాయణ, వంగలపూడి అనితలు పరిశీలించారు. ఏర్పాట్లు ఒక కొలిక్కిరాగా ఇప్పటికే కేంద్ర రక్షణ బలగాలు రంగంలోకి దిగాయని మంత్రి అనిత తెలిపారు. వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, వేదిక వద్దకు చేరుకునే మార్గాలను మంత్రి నారాయణ పరిశీలించారు. బుధవారం కల్లా ఏర్పాట్లన్నీ పూర్తి అవుతాయని చెప్పారు. మంత్రుల వెంట వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ నాగలక్ష్మి, ఐజీ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ సుప్రజ ఉన్నారు.

ఆకుపచ్చని ఆహ్వానం

పూలమొక్కలతో ప్రత్యేకంగా ముస్తాబు

అమరావతి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఘన స్వాగతం పలికేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తోంది. పచ్చని మొక్కలతో రోడ్లు, హెలిప్యాడ్, వేదికకు వచ్చే మార్గాలను ముస్తాబు చేస్తోంది. సంస్థ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ.లక్ష్మీపార్థసారథి పలురకాల ప్రత్యేకమైన మొక్కలు తెప్పించి అమరావతిని పచ్చదనంతో నింపేశారు. వేదిక వద్దకు చేరుకునే ఎన్-9 రోడ్డు ప్రవేశ ద్వారాన్ని ఖర్జూర చెట్లతో అందంగా తీర్చి దిద్దారు. వాటి మధ్య గడిచౌడి పూల మొక్కలను నాటారు. వేదిక పాయింట్ వద్ద పచ్చిక, బొగెన్‌విల్లే, ప్లుమేరియా మొక్కలతో అందం గా తీర్చిదిద్దారు. మందడం గ్రామం వద్ద ప్రధాన రహదారికి ఇరు వైపులా పసుపు రంగు ఆకులతో కూడిన మొక్కలను వేశారు. దీంతో ఈ రహదారిలో అవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సీడ్ యాక్సెస్ రోడ్డును పచ్చికతో, గులాబీ రంగు లాగర్ స్ట్రోమియా మొక్కలతో అలంకరించారు. మల్కాపురం ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ల వద్ద రోడ్డును ఇరువైపులా బొగెన్‌విల్లే కుండలతో అందంగా అలంకరించారు. సచివాలయ ప్రవేశ ద్వారాన్ని ఫికస్ పోండా, మాల్పిజియా కోన్లు, డ్రెసినియా మహాత్మా, ఖర్జూరపు చెట్లతో అందంగా అలంకరించారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

అమరావతి పునః శంకుస్థాపన కార్యక్రమానికి తరలి వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తెలిపారు. రాజదానిలో కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం ఆయన గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ హాలులో సమీక్షించారు. రాజధాని నిర్మాణ పనుల పునః ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పండుగ వాతావరణంలో అపూర్వ స్వాగతం పలికే కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి అయ్యేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. సభకు హాజరయ్యే ప్రజలను తరలించేందుకు వాహనాలు సమకూర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు అమర్నాథ్‌రెడ్డి, రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, ఏలూరు సాంబశివరావు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), ఏపీఎంఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, రాష్ట్ర లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అమరావతిలో జరిగే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయరు సజీలా, ఏసీ ఓబులేషు, ఏఎస్పీ రమణమూర్తి, డీటీసీ సీతారామిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం కృష్ణకాంత్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, మెప్మా పీడీ విజయలక్ష్మి, కార్పొరేటర్లు, అదికారులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులెప్పుడు?



- హడావిడిగా 2,800 బస్తాల ధాన్యం సేకరణ...
- మిల్లుకు తరలించాక సాంకేతిక ఇబ్బందులంటూ సాకులు
- నెల దాటినా సొమ్ముల చెల్లింపులో రాని స్పష్టత
- కొత్తగొల్లపాలెం రైతుల ఆవేదన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కల్లాల నుంచి ధాన్యం మిల్లులకు తరలించి దాదాపు నెల రోజులయింది. కానీ ఇప్పటి వరకు కూడా అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమ అవ్వలేదు. ధాన్యం నగదు చెల్లింపు విషయంలో సాంకేతిక సమస్యలు ఉన్నాయనే సమాధానం మిల్లుల యాజమాన్యాల వద్ద నుంచి వస్తోంది. చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంకు చెందిన 38 మంది రైతుల వద్ద నుంచి దాదాపు 2,800 బస్తాల ధాన్యాన్ని అధికారులు మార్చి 30న హడావిడిగా సమీపంలో ఉన్న ఏడు మిల్లులకు తరలించారు. దీని వెనక ఏప్రిల్ 1న అదే గ్రామంలో సీఎం చంద్రబాబు పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరగడం కూడా ఓ కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది. సీఎం సభావేదికతో పాటు భోజనాల ఏర్పాట్లకు అక్కడ విశాలమైన స్థలం కావాల్సి వచ్చింది. అప్పటికే అక్కడ ధాన్యం ఆరబోసి ఉండడంతో రైతులను ఒప్పించి వాటిని వెంటనే మిల్లులకు తరలించారు. రబీ సేకరణ కింద వాటికి మద్దతుధర కల్పించడంతో అన్నదాతలకూ మేలు చేసినట్లవుతుందని కూడా అటు నేతలు, ఇటు అధికారులు భావించారు. కానీ సరిగ్గా ఇక్కడే ఓ సాంకేతిక సమస్య తలెత్తి నగదు జమ విషయంలో జాప్యం జరుగుతూ వస్తుండడంతో అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు

జీపీఎస్ నిబంధనే అడ్డంకి.. మినహాయింపు ఇవ్వాలంటూ వినతి!

ధాన్యం సేకరణలో ఎటువంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా ఉండడానికి జీపీఎస్ నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దానిలో భాగంగా ధాన్యం కల్లాల్లో నుంచి మిల్లులకు వెళ్లేంతవరకు జీపీఎస్‌ను ట్రాక్ చేయనున్నారు. కానీ ఈ 2,800 బస్తాల ధాన్యాన్ని హడావిడిగా అప్పట్లో మిల్లులకు తరలించారు. పైగా అప్పటికి ఇంకా రబీ ధాన్యం సేకరణ మొదలు కాలేదు. దీంతో జీపీఎస్ వర్తింపచేయడానికి అవకాశం లేకుండా పోయింది. అప్పటి నుంచి ఆ ధాన్యం తాలూకా డబ్బుల జమ విషయంలో యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. సివిల్ సప్లయిస్ విభాగం రాష్ట్రస్థాయిలోని వీసీఎండీ(వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్)కి సమస్యను వివరిస్తూ జిల్లా యంత్రాంగం లెటర్ పెట్టింది. ఆ 2,800 బస్తాల ధాన్యం వరకు జీపీఎస్ మినహాయింపు ఇవ్వాలని అందులో కోరారు. లెటర్ పెట్టి కూడా ఇప్పటికే రెండు వారాలు దాటింది. కానీ ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదు, మరో వైపు ధాన్యం డబ్బులు జమ కాక రైతులు గగ్గోలు పెడుతున్నారు

ఈ వారంలో డబ్బులు జమ అవుతాయి

ఈ విషయంపై సివిల్ సప్లయిస్ అధికారులను వివరణ కోరగా జీపీఎస్ నిబంధన విషయంలో మినహాయింపు ఇవ్వాలని వీసీఎండీకి లెటర్ పెట్టామని, ఈ వారంలో డబ్బులు జమ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

గ్రానైట్ పరిశ్రమలను ఆదుకోండి

మంత్రి రవికుమార్, అధికారులను కలిసిన యజమానుల సంఘం

బల్లికురవ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకూ నష్టాల ఊబిలో కూరుకుపోతున్న గ్రానైట్ పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం నేతలు మంగళవారం విజయవాడలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి విన్నవించారు. అనంతరం గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి గ్రానైట్ పరిశ్రమల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త స్లాబు విధానం వలన తాము మైనింగ్ రాయల్టీలు చెల్లించిన తరువాత.. వెంటనే ముడిరాయి బ్లాకును తరలించేలా ఉందని తాము రవాణా ఇబ్బందుల వలన మూడు మాసాల వరకు వ్యవధిని పెంచాలని చెప్పారు. అలానే అధునాతన యంత్రాల వలన తక్కువ సైజుతో అధిక సంఖ్యలో స్లాబుల ఉత్పత్తి పెరిగిందని గతంలో మాదిరి కాకుండా క్యూబిక్ మీటర్‌కు 450 అడుగులు ఉత్పత్తి వస్తున్నదని, దానిని పాత పద్ధతిలోనే ఉంచాలని కోరారు. ఫ్యాక్టరీలను నిర్వహించటంలో ఆర్థిక భారం పెరుగుతుందని టన్నేజీ స్థానంలో స్లాబు వ్యవస్థను కొనసాగించాలన్నారు. విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని స్థితిలో కొన్ని గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయని, ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమలను ఆదుకోవాలని లేకుంటే తమకు తీవ్ర నష్టాలు తప్పవని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ ఫ్యాక్టరీల సంఘ నేతలు ప్రత్తిపాటి సురేష్, చిట్టిపోతు మస్తానయ్య, ఆళ్ళ రవి, నాగరాజు, ఇంటూరి ఆంజనేయులు, వేణు, నాగయ్య, సుబ్బరామయ్య, వీరాంజనేయులు పాల్గొన్నారు.



గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరిస్తున్న ఫ్యాక్టరీల యజమానుల సంఘ నేతలు

ప్రజలను సురక్షితంగా తరలించాలి

- జిల్లా నుంచి 16 వేల మంది జనసమీకరణ

అమరావతి సభ విజయవంతంపై కలెక్టర్ సమీక్ష

బాపట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనకు ప్రజలను సురక్షితంగా తరలించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి అమరావతి పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతిలో జరిగే కార్యక్రమానికి జిల్లా నుంచి 16 వేల మంది ప్రజలను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వారి తరలింపునకు 350 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కేటాయించిన ప్రాంతాలకు గురువారం రాత్రికి బస్సులు చేరుకోవాలని చెప్పారు. గ్రామాల నుంచి శుక్రవారం ఉదయం 9గంటలకు బస్సులు బయలుదేరేవిధంగా చూడాలన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అమరావతికి చేరుకోవాలని చెప్పారు. అమరావతి కార్యక్రమానికి వెళ్లే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సుల్లో మహిళా పోలీసులు, ఆశావర్కర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సహాయకులుగా ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రజలు తిరిగి వారి గ్రామాలకు వచ్చేవరకు అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. భోజనం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. వాహనాలు గుంటూరు కాజా టోల్‌ప్లాజా మీదగా వెస్ట్ బైపాస్, కొండవీటివాగు, వెలగపూడి పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శ్రీనివాసరావు, గనులశాఖ ఏడీ రాజేష్, జిల్లా రిజిస్ట్రార్ సాయితేజ, జిల్లాపౌరసరఫరాలశాఖాధికారి విలియమ్స్, జిల్లా రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

భూసార పరీక్షలతో మేలు

- ముమ్మరం చేసిన అధికారులు
- మే 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశం
- వేధిస్తున్న సిబ్బంది కొరత

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఖరీఫ్ నాటికి భూసార పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈక్రమంలోనే మే 15 లోపు జిల్లాలో మట్టి నమూనాలు సేకరించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా కూడా మట్టి నమూనాలు సేకరించి సాగుకు సహకరించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని అటకెక్కించింది. పంటలు బాగా పండాలన్నా, నాణ్యమైన దిగుబడులతో రైతులు సంతోషంగా ఉండాలన్నా నేలలో పోషకాలు సమపాళ్లలో ఉండాలి. అది భూసార పరీక్షల వల్ల లోపాలు తెలుసుకొని, వాటిని భూమికి అందించడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని అధికారులు తెలుపుతున్నారు. అలాగే భూసార పరీక్షల అనంతరం, ల్యాబ్ నుండి నమూనా వివరాలు రైతుల ఫోన్‌లకు తెలుగులో సమాచారం వేళ్లేలా ప్రణాళికలు కూడా అధికారులు సిద్ధం చేశారు.



మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారి కాశీవిశ్వనాథ్, సిబ్బంది

రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది కొరత

ఇంత వరకు బాగానే ఉన్నా ఏప్రిల్ 15 నుండి మే 15 లోగా పూర్తవ్వాల్సిన నమూనా సేకరణ సిబ్బంది కొరతతో నత్తనడకన సాగుతుంది. చీరాల మండలంలో 22 రైతు సేవా కేంద్రాలకు గాను 9 మంది మాత్రమే సిబ్బంది ఉన్నారు. వారిలో కూడా ఒకరు సెలవుపై వెళ్లారు. అలాగే వేటపాలెం మండల పరిధిలో 19 రైతు సేవా కేంద్రాలకు గాను 13 మంది ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తుండగా ముగ్గురు డిప్యూటేషన్‌పై బాపట్లలో ఉన్నారు. మరోవైపు వివిధ రకాల ప్రభుత్వ కార్యక్రమాలతో సిబ్బంది యాతన పడుతున్నారు. దీంతో నత్తనడకన మట్టి నమూనా సేకరణ సాగుతోంది.

జిల్లావ్యాప్తంగా తనిఖీలు

ప్రతి మండలంలో తహసీల్దార్ల పరిశీలన

చీమకుర్తి, పొదిలి, మార్కాపురంలో తనిఖీలు చేసిన జేసీ గోపాలకృష్ణ



మార్కాపురంలో ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు చేస్తున్న జేసీ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పౌరసరఫరాల సంస్థ గోడౌన్లతో పాటు రేషన్ షాపులు, పెట్రోలు బంకులు, సినిమా హాల్స్, గ్యాస్ ఏజెన్సీలు, రేషన్ షాపులు, క్రాకర్స్ గోడౌన్లను రెవెన్యూ యంత్రాంగం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఆదేశాలతో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్నిమాపక శాఖ అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు ఎక్కడికక్కడ ఈ తనిఖీలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నాయా లేవా? పరిశీలించారు. పెట్రోలు బంకుల్లో ధరలు పట్టికలతోపాటు లీటరు కొలతలను పరిశీలించారు. సినిమా థియేటర్లలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వసతులు, రక్షణ చర్యలు ఉన్నాయా లేవా చూశారు. మరోవైపు పౌరసరఫరాల గిడ్డంగుల్లో తనిఖీలు చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. మరోవైపు రేషన్‌షాపుల ద్వారా వచ్చేనెల 1 నుంచి రేషన్ పంపిణీ చేయాల్సి ఉండటంతో ఆయా షాపులకు సరఫరా చేసిన బియ్యం, చక్కెర నిల్వలను పరిశీలించి రిజిస్టర్లు చెక్ చేశారు. గ్యాస్ ఏజెన్సీల ద్వారా లబ్ధిదారులకు ఇస్తున్న సిలిండర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు వేసవికాలం కావడంతో క్రాకర్స్ గోడౌన్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన అంశాలను అగ్నిమాపక శాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇంకొకవైపు తాగునీటిని అందించే వాటర్‌ప్లాంట్లను కూడా పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి ఈ ప్లాంట్లను పరిశీలించి నాణ్యతను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చీమకుర్తిలోని పెట్రోలు బంకుతోపాటు పొదిలిలో సినిమా థియేటర్‌ను, గ్యాస్ గోడౌన్‌ను, వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించారు. అక్కడ పరిసరాలను కూడా పరిశీలించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మార్కాపురంలో అక్కడి సబ్‌కలెక్టర్‌తో కలిసి ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి రికార్డులను తనిఖీ చేశారు. అలా జిల్లాలోని అన్ని మండలాల్లో ఆయా శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆయా తనిఖీల నివేదికను నేడు రేపో జాయింట్ కలెక్టర్‌కు పంపనున్నట్లు సమాచారం.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు



భారీగా తరలి వచ్చిన భక్తుల నడుమ శిడిమహోత్సవం

అశేష భక్తుల నడుమ శిడి మహోత్సవం

వేడుకలను తిలకించేందుకు పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

నూతలపాడు(పర్చూరు), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నూతలపాడు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఏటా అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించే శిడిమహోత్సవం భక్తులను ఎంతగానో అలరించింది. వేడుకలను తిలకించేందుకు పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావటంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మండలంలోని చింతగుంటపాలెంకు చెందిన కంది బుల్లిరెడ్డి నేతృత్వంలో పులిహోర పంపిణీ చేశారు. అదేవిధంగా నేతలపాడు గ్రామస్థులు మజ్జిగను అందజేశారు. పోటాపోటీగా విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేయటం గమనార్హం.

భారీ పోలీసు బందోబస్తు...

తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శేషగిరిరావు నేతృత్వంలో ముగ్గురు ఎస్సైలు, 49 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

హంతకుల కోసం ముమ్మర వేట

ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో దర్యాప్తు

అధికారిగా ఒంగోలు డీఎస్పీ

ఆన్‌లైన్ లావాదేవీలపై దృష్టి

దుండగులు కనిగిరి శివారు

ప్రాంతంలో బస్సు దిగినట్లు గుర్తింపు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వీరయ్యచౌదరిని అత్యంత కిరాతకంగా చంపిన కిరాయి హంతకుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. హత్య జరిగిన రోజు చీమకుర్తి బైపాస్‌లో ఓ హోటల్ సమీపంలో స్కూటీని పార్కు చేసి విజయవాడ- కనిగిరి బస్సు ఎక్కి వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. వారు కనిగిరి శివారు ప్రాంతంలో దిగి వెళ్లినట్లు నిర్ధారణ అయింది. ఆ రోజు విధులలో ఉన్న బస్సు డ్రైవర్, కండక్టర్‌లను పోలీసులు విచారించి కీలక సమాచారం సేకరించారు. అదేసమయంలో వారు పొరుగు జిల్లావాసులుగా గుర్తించారు. హంతకులకు నేర చరిత్ర ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రధానంగా వారిపై ఏమి కేసులు ఉన్నాయి అనే కోణంలో కూడా పోలీసులు సమాచారం సేకరించారు. అదే సమయంలో హత్య కేసులో సూత్రధారులు, పాత్రధారుల మధ్య ఆన్‌లైన్ లావాదేవీలపై కూడా ప్రధానంగా దృష్టిపెట్టి సమాచారం సేకరణ చేస్తున్నారు. ఒక వైపు నిందితుల కోసం వేట సాగిస్తున్న పోలీసులు, మరోవైపు లోతైన దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే కేసులో సూత్రధారులగా భావిస్తున్న వారి బ్యాంక్ లావాదేవీలను పరిశీలిస్తున్నారు. ఎవరెవరు ఎంత నగదు హంతకులకు జమచేశారు, ఎవరి వాటా ఎంతా అనే విషయంలో ఒక అంచనాకు పోలీసులు వచ్చారు. అదేసమయంలో కేసును ఒంగోలు తాలూకా సీఐ నమోదు చేయగా తాజాగా ఒంగోలు డీఎస్పీకి విచారణ బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాలు ఇచ్చారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

పోలీసుల అదుపులో ఇసుక వ్యాపారి బావమరిది

కేసులో కీలక నిందితుడైన ఇసుక వ్యాపారి బావమరిదిని హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. అదేసమయంలో ఇసుక వ్యాపారి అక్కడి నుంచి రైలులో పరారైనట్లు తెలుస్తుంది. అత్యంత కీలకమైన నిందితుడు ఇసుక వ్యాపారికి వీరయ్యచౌదరి మధ్య కూడా వివాదాలు ఉన్నట్లు తెలుస్తోంది. అతనిపై కూడా పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేయించాడని పగ పెంచుకున్నాడని పోలీసులు సమాచారం సేకరించారు. ఈక్రమంలో మరి కొంత మందితో కలిసి వీరయ్యచౌదరి హత్యకు పథక రచన చేశారని పోలీసులు భావిస్తున్నారు. ఇసుక వ్యాపారి బావమరిది హంతకులకు సహకరించాడని తెలుస్తోంది. హంతకులు లాడ్జిలో మకాం వేసిన సమయంలో వారికి కావాల్సిన సహకారం అందించినట్లు ప్రచారం జరుగుతోంది.

మూడు నెలలు కిందటే పథకం

వీరయ్య చౌదరి హత్యకు మూడు నెలల కిందటే పథకం రూపొందించినట్లు పోలీసు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. అంతేకాదు ఒంగోలులో వారంరోజులు పాటు హంతకులు మకాం వేసి రెక్కీ నిర్వహించారు. ప్రధాన సూత్రధారులుగా ఉన్న వారు ఆర్థిక సహకారం అందించారనేది ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది. అయితే వారి వాటాలు ఎంతా అనే కోణంలో బ్యాంక్ లావాదేవీలపై దృష్టి సారించారు. సూత్రధారులలో ఇసుక మాఫియా, రేషన్ మాఫియా వారు ఉన్నారనేది నిర్ధారణకు వచ్చారు. వీరిలో కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికి అత్యంత గోప్యంగా ఉంచి విచారణ చేస్తున్నారు. వారి దందాకు వీరయ్య చౌదరి అడ్డుకట్ట వేస్తున్నారనే ఆయన మీద పగ పెంచుకున్నారు. అందుకే అంత కిరాతకంగా అంతమొందిచారనే ప్రచారం ఉంది. అంతేకాదు పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవి వీరయ్యకు వస్తే ఆయనకు గన్‌మెన్లు ఉంటారు, అందుకే ముందుగా హత్య చేశారని, అది కూడా పథకంలో భాగమేనని పోలీసుల విచారణలో వెల్లడైంది.

ఇసుక వ్యాపారే కీలకం

సూత్రధారులు, నిందితుల మధ్య కీలకంగా ఇసుక వ్యాపారి వ్యవహరించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇసుక వ్యాపారి బావమరిదిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం ఇద్దరు కలిసి విశాఖపట్నంలో ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి కూడా ఇసుక వ్యాపారి పరారీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా ఇసుక వ్యాపారి దొరికితేనే కేసులో కీలకమైన సమాచారం బయటపడే అవకాశం ఉంది. పోలీసు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ స్వయంగా సమాచారం తెప్పించుకుంటూ, అవసరమైన సూచనలు ఇస్తున్నారు. అతిత్వరలో కేసును పూర్తిస్థాయిలో ఛేదిస్తామనే ధీమాలో పోలీసులు ఉన్నారు.



మార్కాపురం మున్సిపాలిటీ

కప్పం కట్టాల్సిందే..

ముందు కప్పం కట్టాల్సిందే..

వైసీపీ ప్రజాప్రతినిధి పర్సంటేజీల గోలతో ముందుకురాని కాంట్రాక్టర్లు

గత సంవత్సరం బిల్లులు రాక అవస్థలు

సందిగ్ధంలో పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

మూడు సార్లు పిలిచినా స్పందించని వైనం

మార్కాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు భూగర్భజలాలు పూర్తిగా అడుగంటాయి. డీప్ బోర్లు ఒట్టిపోతున్నాయి. మరోవైపు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నిండా సాగర్ నీళ్లున్నా సకాలంలో పుర ప్రజలకు అందించలేని దుస్థితి. ఈ పరిస్థితుల్లో గొంతెడుతోన్న పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరానే దిక్కు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం రూ.40లక్షల నిధులు కూడా మంజూరు చేసింది. రోజుకు వంద ట్రిప్పుల చొప్పున మూడు మాసాలపాటు సరఫరాకు అనుమతులు ఇచ్చింది. ఈ నెలారంభంలోనే మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇప్పటికి మూడుసార్లు పిలిచినా ఎటువంటి స్పందన లేదు. అసలు కారణం ఏమిటని ఆరాతీస్తే మున్సిపాలిటీలోని కీలక ప్రజాప్రతినిధి ధనదాహమే కారణమని ప్రచారం నడుస్తోంది. వైసీపీకి చెందిన పాలకవర్గ ప్రధాన ప్రజాప్రతినిధి బాహాటంగానే పర్సంటేజీలు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది.

పట్టణంలో దాహం కేకలు

మార్కాపురం పట్టణానికి ప్రధాన తాగునీటి వనరు సాగర్ జలాలే. 80శాతం మేర ప్రాంతానికి అంతర్గత పైప్‌లైన్ ఉంది. త్రిపురాంతకం మండలం దూపాడులోని సాగర్ తూర్పు ప్రధాన కాలువ ద్వారా 2,200 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ట్యాంకులోకి నీటిని నింపుతారు. అక్కడ నుంచి 28 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా సాగర్ నీరు పట్టణానికి చేరాలి. ఎస్ఎస్ ట్యాంకులో నిండా నీరున్నా సరఫరాలో చోటుచేసుకుంటున్న ఇబ్బందులతో ప్రస్తుతం వారం నుంచి పది రోజుల కోసారి నీటిని అందిస్తున్నారు. సాగర్ అంతర్గత పైప్‌లైన్ లేని శివారు కాలనీల్లో డీప్‌బోర్లు ఒట్టిపోయి ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అంతేకాక కొందరు ప్రైవేటు ట్యాంకర్ల నుంచి నీటిని కొనుక్కోవాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తేనే ప్రజలకు అవస్థలు తప్పేది. ఆ దిశగా అధికారులు అడుగులు వేసినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మరికొన్ని రోజులు ఈ ఇబ్బందులకు అడ్డుకట్టపడే అవకాశాలు కనిపించడంలేదు.

> మార్కాపురం మున్సిపాలిటీ పాలకవర్గంలోని ప్రధాన ప్రజాప్రతినిధి(వైసీపీ) ధనదాహానికి కాంట్రాక్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. ముందుగానే పర్సంటేజీని తనకు ఇస్తేనే పనులు అప్రూవల్ అవుతాయని ఆయన బాహాటంగా చెప్తున్నట్లు తెలుస్తోంది. అదీ కూడా గతం కంటే మించి పర్సంటేజీ అడుగుతున్నట్లు సమాచారం. గత సంవత్సరం ఏఎస్‌సీ గ్రాంట్ ద్వారా ట్యాంకర్లతో సరఫరా చేసిన నీటికి బిల్లులు నేటికీ రాలేదు. ఇప్పుడు మళ్లీ డబ్బులు ముందుగానే ఆ ప్రజాప్రతినిధికి చెల్లించి నీటి సరఫరా చేసే ధైర్యం తమకు లేదని మిన్నకుండిపోతున్నారు. పుర ప్రజల దాహార్తితో నాకేంటి నా కప్పం నాకు కట్టాల్సిందేన, నిస్సిగ్గుగా సదరు ప్రజాప్రతినిధి వ్యవహరించడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

ఏ పనైనా ముందుగా పర్సంటేజీలు ఇవ్వాల్సిందే

మార్కాపురం పురపాలక సంఘం లో వైసీపీ పాలకవర్గం తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గత వైసీపీ హయాంలో 10 శాతంగా ఉన్న ప్రధాన ప్రజాప్రతినిధి పర్సంటేజీ ప్రస్తుతం రెట్టింపు అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ పీఠం ఎప్పుడు కూలుతుందో అనే అపోహతో ఆ ప్రజాప్రతినిధి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మున్సిపాలిటీలో ప్రస్తుతం ఏ పనికి కూడా టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. సీసీ రోడ్లు, డ్రైన్ల పనులకు కూడా నిధులున్నా కాంట్రాక్టర్లు గత కొన్నాళ్లుగా టెండర్లు దాఖలు చేయడంలేదు. పని ప్రారంభించక ముందే 20 శాతం మేర పర్సంటేజీ ఇస్తేనే అనుమతులు ఇస్తానని బెదిరిస్తుండడంతో కాంట్రాక్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. గతంలో చేసిన చాలా పనులకే ఇంకా బిల్లులు రాక ఒకవైపు ఇబ్బందులు పడుతుంటే రెట్టింపు పర్సంటేజీలు ఇచ్చి తాము మునిగిపోవాల్సిందే అని బాహాటంగానే చెప్తున్నారు. ఈ క్రమంలోనే పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని స్పష్టమవుతోంది.

చీరాల పట్టణంలో భారీ చోరీ

ఆస్పత్రికి వెళ్లి వచ్చేలోపు 120 సవర్ల బంగారు మాయం

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలోని పువ్వాడ వారివాధిలో భారీ చోరీ జరిగింది. ఆ ప్రాంతానికి చెందిన ముప్వల శివప్రసాదరావు, భార్య పద్మావతితో కలిసి స్థానికంగా ఉన్న ఆస్పత్రికి మంగళవారం రాత్రి వెళ్లారు. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు ముగించుకున్న అనంతరం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు శివప్రసాదరావు దంపతులు గుర్తించారు. ఇల్లంతా కారం చల్లి ఉంది. దొంగలు ఇంటి తాళం పగులకొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలో ఉన్న 120 సవర్ల బంగారంతోపాటు రూ.1.60 వేలు నగదు కూడా దొంగలు చోరీ చేశారు. వారు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంతో వచ్చి ఆధారాలు సేకరిస్తున్నారు. గతంలో వీరి వద్ద పనిచేసిన ఎలక్ట్రీషియన్ మరో వ్యక్తితో వచ్చి ఇంటి పరిసరాలలో అనుమానాస్పదంగా సంచరించి వెళ్లారు. అనుమానితుల్లో ఇప్పటికే ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

నీట్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చేనెల 4వతేదీన జరిగే నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మే 4వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ పరీక్షకు 1,473 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ, దామచర్ల సక్కుబాయమ్మ డిగ్రీ కళాశాల, దామచర్ల ఆంజనేయులు పాలిటెక్నిక్ కళాశాల, డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూళ్లను పరీక్షా కేంద్రాలుగా ఎన్‌టీఏ ఎంపిక చేసిందన్నారు. ఈ ఐదు కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు అందుకు అవసరమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భద్రత, ప్రశ్నపత్రాలు, అభ్యర్థుల తనిఖీలు తదితర విషయాలలో మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇన్విజిలేటర్లకు అవసరమైన శిక్షణను గురువారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరీక్షల సిటీ కో ఆర్డినేటర్‌కు సూచించారు. అభ్యర్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ఆయాపరీక్షా కేంద్రాల సూపరిటెండెంట్లపై ఉందని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో చినఓబులేషు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీపీవో వెంకట నాయుడు, డీఈవో కిరణ్‌కుమార్, ఎన్‌టీఏ నోడల్ ఆఫీసర్ మనీష్‌కుమార్, ఆయా కేంద్రాల సూపరింటెండెంట్లు, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ప్రియుడు ఆత్మహత్య

అవీఇవీ

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో ప్రియురాలి ముందే ప్రియుడు బలవన్మరణం చెందాడు. ఈఘటన మంగళవారం పట్టణంలోని ఓ లాడ్జి సమీపంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇంకొల్లు చెందిన అన్నెం శివాజీ(35) సుమారు ఏడేళ్లుగా అదే ప్రాంతానికి చెందిన ఓ యువతితో ప్రేమలో ఉన్నాడు. కాలక్రమేణ అతని తల్లి అనారోగ్యం బాట పట్టింది. ప్రియురాలు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో వేరే వివాహం చేసుకుంది. దీంతో కొంతకాలంగా వ్యసనాలకు(బెట్టింగ్) బానిసగా మారాడు. ప్రియురాలితో మాట్లాడాలని చీరాలకు పిలిపించుకున్నాడు. ఆమె ఎదురుగానే పురుగుల మందు తాగాడు. దీంతో ఆమె చీరాల ఏరియా వైద్యశాలకు తరలించింది. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని ఒంగోలుకు రాశారు. ఈ నేపథ్యంలో హాస్పిటల్ నుంచి అంబులెన్స్ వద్దకు తెస్తుండగానే ప్రాణం విడిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

చేతిపంపు నీరు పట్టుకునే విషయంపై కొట్లాట

పరస్పరం కేసులు నమోదు

మార్టూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : చేతి పంపు దగ్గర నీటిని పట్టుకునే విషయంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన కొట్లాటకు సంబంధించి పరస్పర కేసులు నమోదు చేసినట్లు సీఐ శేషగిరిరావు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం... స్థానికంగా అంబేద్కర్ నగర్‌లో సోమవారం రాత్రి చేతిపంపు దగ్గర నీటిని పట్టుకునే విషయంపై వైసీపీకి చెందిన అట్లూరి సుగుణరావు, అతని ఇంటి పక్కనే ఉన్న డీ హరిబాబు కుటుంబాల మధ్య కొట్లాట జరిగింది. ఈ నేపథ్యంలో హరిబాబు స్టేషన్‌లో అట్లూరి సుగుణరావు తోపాటు అతని కుటుంబానికి చెందిన మరో ముగ్గురిపై ఫిర్యాదు చేశారు.అదేవిధంగా సుగుణరావు భార్య ప్రభావతి స్టేషన్ లో హరిబాబుతో పాటు మరో ఐదుగురిపై ఫిర్యాదు చేశారు. దాంతో రెండు కేసులను నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ క్రమంలో వైసీపీకి చెందిన సుగుణరావు ఆత్మహత్యా ప్రయత్నం చేశారంటూ వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. తన కేసు నమోదు చేయలేదని, మనస్తాపానికి గురైన కత్తితో చేతిని కోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారంటూ కొంతమంది వైసీపీ నాయకులు ప్రచారం చేశారు. ఈ విషయమై పోలీసులను విచారించగా, అందుకు సంబంధించిన సమాచారం తమ వద్దకు రాలేదని చెప్పారు.

భూగర్భ జలమట్టంపై తనిఖీలు

మూడు కిలోమీటర్లకు ఒక చోట బోర్ బండితో చెకింగ్

కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో పరిశీలన



బోర్ బండితో చెక్ చేయిస్తున్న ఓఎన్‌జీసీ ప్రతినిధులు

బల్లికురవ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలమట్టం ఎలా ఉందనే అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఓఎన్‌జీసీ ద్వారా పలు గ్రామాలలో తనిఖీలు చేపట్టింది. బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో వారం రోజుల నుంచి మూడు కిలోమీటర్లకు ఒక చోట బోర్ బండితో రెండు వందల అడుగుల లోతులో ఉన్న నీటి శాతంతోపాటు ఇతర విషయాలను తనిఖీలు చేసి తెలుసుకుంటున్నారు. మంగళవారం బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆట స్థలంలో బోర్ బండి ద్వారా డ్రిల్లింగ్ వేసి నీటి శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సిబ్బంది మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా ఓఎన్‌జీసీ సంస్థ ఆధ్వర్యంలో భూమిలో తనిఖీలు చేపట్టామని, ఎంత లోతులో నీరు ఉంది, భూమి ఎంత లోతు వరకు గట్టిగా ఉంది అనే అంశాలను తనిఖీలు చేసి నివేదికలను పంపుతున్నామని తెలిపారు. బాపట్ల జిల్లాలోని పలు మండలాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఆరోగ్యకరమైన ఆహారంతో రోగాలకు విముక్తి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేటపాలెం/చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో మేలైన ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతంగా జీవిస్తారని ప్రముఖ ఆయుర్వేద, హోమియో వైద్యులు ప్రసాద్, మౌనిక చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని పొట్టి సుబ్బయ్య పాలెంలో ప్రిపేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈక్రమంలో సుమారు 150 మంది పాల్గొని పరీక్షలు నిర్వహించారు. అలాగే అవసరమైన వారికి పరీక్షలు అనంతరం మందులు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు రవిచంద్ర, ఆషా, రమణ, వెంకటేశ్వర్లు, ప్రసన్న పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న జడ్పీటీసీ, కొత్తపాలెం గ్రామ సర్పంచ్

చినగంజాం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహిస్తే విద్యలో రాణిస్తారని జడ్పీటీసీ సభ్యురాలు ఆసోది భాగ్యలక్ష్మి చెప్పారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెంలోని ఆమె స్వగృహంలో ఇటీవల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మొదటి, రెండవ, మూడవ ర్యాంకులు సాధించిన విద్యార్థినులను మంగళవారం జడ్పీటీసీ, కొత్తపాలెం సర్పంచ్‌లు సన్మానించి, నగదు బహుమతులు అందజేశారు. జడ్పీ పాఠశాల విద్యార్థినులైన మాచవరపు సాహితి 584/600, బాలజ్ఞానేశ్వరి 582/600, బోనాసి సమీరా 572/600లతో మండల స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించారు. కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, వై.రామాంజనేయులు, హేమంత్‌రెడ్డి, మాస్టర్స్ ట్యూషన్ సెంటర్ కరస్పాండెంట్ మహేశ్వరి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్.. ఇద్దరికి గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి గ్రావెల్ తరలించే టిప్పర్ ఢీకొనటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... మండలంలోని శంకవరప్పాడుకు చెందిన కొప్పుల సంజీవ్‌కుమార్, రేవంత్ మంగళవారం మధ్యాహ్నం మోటార్‌సైకిల్‌పై వస్తుండగా ధర్మవరం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద వెనుక నుంచి వచ్చిన గ్రావెల్ టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ సంజీవ్‌కుమార్, రేవంత్‌లను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

ధ్వజస్తంభం తొలగింపుపై అభ్యంతరాలు

ఇంకొల్లు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం కోదండరామస్వామి దేవాలయంలోని ధ్వజస్తంభం తొలగింపుపై వివాదం నెలకొంది. పంచనామా, కళాపకర్షణ నిర్వహించకుండా ధ్వజస్తంభం తొలగించారంటూ గుంటూరు దేవాదయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కోదండరామస్వామి దేవాలయాన్ని పునఃనిర్మిస్తున్నారు. గత ఏడాది కూడా పంచనామా నిర్వహించకుండా ఆలయంలోని విగ్రహాలను తొలగించారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి ఈవో శ్రీనివాసరావును విధుల నుంచి తొలగించారు. ప్రస్తుతం ఈవోగా కోటిరెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పంచనామా అనంతరం ధ్వజస్తంభాన్ని పునాది నుంచి పూర్తిగా తొలగించాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఈవోపై చర్యలు తీసుకోవాలని, ఆగమశాస్త్రాలకు అనుగుణంగా ఆలయాన్ని పునఃనిర్మించాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయంపై గుంటూరు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు.

నేడు ఫైర్, విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన

అద్దంకి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10 గంటలకు శింగరకొండ రోడ్డులో 2.25 కోట్ల రూపాయలతో నిర్మించనున్న అగ్నిమాపక కార్యాలయం భవనం, ఉదయం 10-30 గంటలకు సుమారు 11.23 కోట్ల రూపాయలతో అద్దంకి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కార్యాలయం, ద్వారకానగర్‌లలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకస్థాపన చేయనున్నారు. అనంతరం 11 గంటలకు ఎన్ఎస్‌పీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో మే 2వ తేదీ అమరావతిలో జరగనున్న అమరావతి పునఃనిర్మాణ ప్రారంభవేడుక సన్నాహక సమావేశం, 11-30 గంటలకు ఎన్ఎస్‌పీ కార్యాలయం ఆవరణలో జరిగే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి మంత్రి రవికుమార్ హాజరుకానున్నారు.

నేడు పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్ష

అద్దంకిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పాలిసెట్ పరీక్ష బుధవారం జరగనుందని పాలిసెట్ అద్దంకి కో ఆర్డినేటర్ వి. లాజరస్‌బాబు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకిలోని హోలిపెయిత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శింగరకొండ వద్ద డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. మొత్తం 854 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ బ్లూ, బ్లాక్ బాల్ పెన్ను, పెన్సిల్, యరేజర్, చాప్‌నర్, పరీక్ష ప్యాడ్‌తో ఉదయం 9.45 నిమిషాలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ప్రధానమంత్రి పర్యటనకు ఆరు బస్సుల ఏర్పాటు

బల్లికురవ. ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతానికి మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఉండటంతో ప్రభుత్వ ఆదేశాలతో బల్లికురవ మండలం నుంచి ఆరు బస్సులను ఏర్పాటు చేశామని ఎంపీడీవో కుసుమకుమారి చెప్పారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు కలిపి ఆరు పాయింట్లలో బస్సులు బయలు దేరుతాయని తెలిపారు. వల్లాపల్లి, చెన్నుపల్లి, కొప్పెరపాలెం, కోటవారిపాలెం, ముక్తేశ్వరం, కూకట్లపల్లి గ్రామాలలో బస్సులు ఏర్పాటు చేశామని ప్రతి బస్సుకు ఇన్‌చార్జిని నియమించామని ఎంపీడీవో తెలిపారు.

ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి

పంగులూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు కిమ్స్ హాస్పటల్ వైద్యులు రామాంజనేయులు చెప్పారు. మండలంలోని తూర్పుతక్కెళ్లపాడు గ్రామంలో మంగళవారం కిమ్స్ హాస్పటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటితో పాటు గుండె పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వ్యాధి తీవ్రత ఉన్న రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా కిమ్స్ హాస్పటల్‌లో వైద్య చికిత్సలు నిర్వహించనున్నట్లు డాక్టర్ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాణి, పి.ఆర్వో. కాలేషా, వైటల్ హెల్త్ కేర్ ఫౌండర్ సందిపాగు వందనం, రాజేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షునిపై పోలీసులకు ఫిర్యాదు

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావుపై దళిత బహుజన పార్టీ ప్రతినిధి షేక్ జిలానీ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం చీరాల మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసాన్ని నిలిపివేయాలంటూ గజవల్లి జిల్లా కలెక్టర్ వెంకటమురళీకు ఫిర్యాదు చేశారు. గజవల్లి తీరు బీసీ ఎమ్మెల్యే పరువుకు భంగం కలిగేలా ఉందని, అతనిపై చర్యలు తీసుకోవాలని జిలానీ ఫిర్యాదు చేశారు.

‘ఎత్తిపోతల’ పనులు త్వరగా పూర్తి చేయాలి

వచ్చే వ్యవసాయ సీజన్‌కు అందుబాటులోకి తీసుకురావాలి

నామ్ రోడ్డు పరిహారం చెల్లింపునకు చర్యలు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకాల నిర్మాణం, మరమ్మతులను వేగవంతం చేసి వచ్చే వ్యవసాయ సీజన్‌కు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా అధికారులు పనిచేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో ఎత్తిపోతల పథకాల పనులు, మరమ్మతులపై ఐడీసీ అధికారులు, రైతులతో మంగళవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. ప్రధానంగా తమ్మవరం, ఉప్పలపాడు ఎత్తిపోతల పథకాల పనులు అర్ధంతరంగా నిలిచి పోయినందున ఆయా పనులకు సంబంధించి రివైజ్డ్ ఎస్టిమేషన్లు సిద్ధం చేయాలన్నారు. వాటికి ప్రభుత్వం నుంచి వెంటనే అనుమతులు మంజూరు చేయిస్తానని చెప్పారు. తిమ్మాయపాలెం, కామేపల్లి, తంగేడుమల్లి, కోటావారిపాలెం, కొణిదెన, గుంటుపల్లి ఎత్తిపోతల పథకాల పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఆయా ఎత్తిపోతల పరిధిలోని కాలువల మరమ్మతులు కూడా వచ్చే సీజన్‌కు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఈ భాగ్యలక్ష్మి, డీఈ శిరాజ్‌అహ్మద్, ఏఈలు కృష్ణారావు, వంశీ, రవి, తమ్మవరం ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.



అధికారులు, రైతులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

నామ్ రోడ్డు పరిహారం చెల్లింపునకు చర్యలు

నామ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఏల్చూరు, చక్రాయపాలెం, గోపాలపురం, శింగరకొండపాలెం రైతులకు సంబంధించి పరిహారం చెల్లింపు విషయాన్ని నామ్ అధికారులతో మంత్రి రవికుమార్ చర్చించారు. మొత్తం పరిహారం రూ.2.70 కోట్లు అవసరం కాగా ప్రస్తుతం 1 కోటి రూపాయలు సిద్ధంగా ఉన్నాయని మంత్రికి అధికారులు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కోటి రూపాయలను కొన్ని గ్రామాల రైతులకు చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఒంగోలు ఆర్‌డీవోతో ఫోన్‌లో మాట్లాడారు. మిగిలిన నిధులు మంజూరు విషయమై ఆర్‌అండ్‌బీ సీఈ శ్రీనివాసరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఏల్చూరులో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నామ్ అధికారులు శ్రీకాంత్, ప్రసాద్ లు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్లు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో విభిన్నప్రతిభావంతులకు మంగళవారం వీల్ చైర్లను అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరబాద్ నార్త్, షార్ ప్రాజెక్ట్, పిడుగురాళ్ల లైమ్ సిటి రోటరీ క్లబ్‌ల ఆర్థిక సౌజన్యంతో ఆరుగురు విభిన్నప్రతిభావంతులకు వారి ఇళ్ల వద్దనే వీల్‌చైర్లను అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ 3150 గవర్నర్ డాక్టర్ కె. శరత్ చౌదరి, జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాల కోటిరెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ విష్ణుప్రసాద్, స్థానిక క్లబ్ సెక్రటరీ మురళిసుధాకరరావు, ఏజే మహమ్మద్ రఫీ, మురళీకృష్ణ, దేవపాలన, చంద్రమౌళి, హరిహరప్రసాద్, లేవి ప్రసాద్, శ్రీలక్ష్మి, శివకుమారి, భువనేశ్వరి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు చేయూత

మార్టూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన ఇద్దరు పిల్లలు మంచా శ్రేయరాయల్, తానికొండా ఇసాక్‌లకు వీల్ చైర్స్‌ను మార్టూరు రోటరీ క్లబ్ వారు మంగళవారం నాగరాజుపల్లి రోడ్‌లో ఉన్న శ్రీ సాయి మల్లికార్జున అపార్ట్‌మెంట్‌లో పంపిణీచేశారు. వారికి రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లిహిల్స్, రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల వారు షార్ ప్రాజెక్టు కింద క్లబ్ గవర్నర్ శరత్ చౌదరి చేతులమీదుగా అందజేశారు. మద్దుమాల కోటేశ్వరరావు, గిరిమిడి శ్రీనివాసరావు, మాదాల సాంబశివరావు పాల్గొన్నారు.



దివ్యాంగులకు వీల్‌చైర్ బహూకరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

వీల్ చైర్లు పంపిణీ

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి వారి ఆధ్వర్యంలో ఐదుగురు దివ్యాంగులకు రూ.50 వేలు విలువగల వీల్ చైర్‌లు అందజేశారు. న్యాయవాది బండారుపల్లి హేమంత్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి, క్లబ్ అధ్యక్షులు బాచిన నాగమల్లేశ్వరరావు, సెక్రటరీ వంశీకృష్ణ, ట్రెజరరీ డాక్టర్ రవితేజ, సభ్యులు మల్లికార్జునరావు, డాక్టర్ విజయ్, ఆర్‌వి రమణ, రామకృష్ణ, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి శరవేగంగా అడుగులు

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నిర్దిష్ట పాలన, నిమయ నిబంధనలతో శరవేగంగా అభివృద్ధికి నిరంతరం టీడీపీ కూటమి పాటుపడుతోందని యాదవ కార్పొరేషన్ చైర్మన్, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి. నరసింహం యాదవ్ చెప్పారు. మంగళవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఈనేపథ్యంలోనే వెనుబడిన వర్గాల అభ్యున్నతి కోసం కుల, చేతి వృత్తులకు ఆదరణ పథకం ద్వారా బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అలాగే తెగలు వారీగా రూ.789 కోట్లతో బడ్జెట్ కేటాయించి ఉపాధి కల్పనకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు రుణసాయంతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహ యాదవ్, పక్కన ఏఎంసీ చైర్మన్ జనార్దనరావు

ప్రీస్కూల్‌లో పిల్లలను చేర్చాలి

సంతమాగులూరు ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రీస్కూల్లో పిల్లలను చేర్చేందుకు మోటివేట్ చేయాలని బాపట్ల పీడీ రాధామాధవి చెప్పారు. మంగళవారం సంతమాగులూరు ప్రాజెక్టును సందర్శించి సూపర్‌వైజర్లు, అంగన్వాడీలకు సూచనలు ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోతే గ్రామాల్లో స్థలం అందుబాటులో ఉన్నట్లయితే భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ప్రమీల, విజయ నిర్మల, మీరాబి,సుష్మ, అంగన్వాడీలు కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతమాగులూరు ప్రాజెక్టులో మాట్లాడుతున్న పీడీ రాధా మాధవి

కిశోర బాలికలపై ప్రత్యేక జాగ్రత్తలు

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికలపై ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సీడీపీవో ఝాన్సీ, డీసీపీవో పురుషోత్తం చెప్పారు. మంగళవారం మునిసిపల్ పరిధిలో మే 2 నుంచి 10వ తేదీ వరకు జరుగు కిశోర వికాసం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టాలన్నారు. విద్య కొనసాగింపు, పోషణ ఆరోగ్యం, పరిశుభ్రత వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కవితశ్రీ, కుముద్వతి, తబిత, కృష్ణ పాల్గొన్నారు.

ఎండిన చెట్లతో పొంచి ఉన్న ప్రమాదం

పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

పర్చూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రహదారికి ఇరువైపులా దశాబ్దాల కాలం నాటి చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏ చెట్లు కొమ్మలు విరిగి పడి ప్రాణాలకు ముప్పు కల్గిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని పాత మద్రాస్ రోడ్డులో చింతచెట్టు ఎండిపోయి ప్రమాద భరితంగా ఉంది. బస్సులు, ఆటోల కోసం ప్రయాణికులు ఈచెట్టు కింద నిల్చుని వేచి చూస్తుంటారు. నిత్యం ఈ రహదారిలో వందల సంఖ్యలో వాహనాలు వచ్చిపోతుంటాయి. ఇలాంటి రహదారిలో చింతచెట్లు ఎండిపోయి ప్రజలు, ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఉన్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పర్చూరు - చీరాల రోడ్డులో చింత ఎండిపోయిన చింత చెట్టుకొమ్మ విరిగి పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఎప్పుడు చింతచెట్టు కొమ్మలు విరిగిపడి ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఎండిపోయి ప్రమాద భరితంగా ఉన్న చింతచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



టెండరు ప్రకటన

బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం సంతరావూరు గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానము యొక్క క్రింది తెలిపిన పనికి గాను 5వ తరగతి రిజిష్టర్డు సివిల్ కాంట్రాక్టర్ల నుండి సీలు వేసిన టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనులకు గాను **ది.01-05-2025 ఉదయం 10:00గంటల నుండి తేది.11-05-2025 సాయంత్రము 5-00 గంటల వరకు** టెండరు ధరఖాస్తులు కొరకు స్వీకరించబడును. టెండరు షెడ్యూలు **తేది.12-05-2025 ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రము 5-00 గంటల వరకు** యివ్వబడును. టెండరు ధరఖాస్తుతోపాటు టెండరు ధరావత్తుకు డిమాండ్ డ్రాఫ్ట్ గాని నగదు చెల్లించిన రసీదు గాని జతపరచవలెను. **సీల్డు కవరు తేది.15-05-2025 ఉదయం 10:00 గం॥ వరకు** వేటపాలెంలోని కార్యనిర్వహణాధికారి కార్యాలయము నందు స్వీకరించబడి అదే రోజు సాయంత్రము **4-00గం॥లకు** వేటపాలెం మా కార్యాలయము నందు హాజరైన టెండర్లుదారుల సమక్షంలో తెరువబడును.

వ నెం	పనిపేరు	అంచనా విలువ	టెండరు ధరావత్తు	టెండరు షెడ్యూలు ఖరీదు	పని పూర్తి చేయు కాలము
1.	దేవస్థానమునకు రంగులు వేయుట	రూ.2,00,000/-	రూ.2,000/-	రూ.500/-	2 నెలలు

ఏకారణము చేతనైనా కారణము తెలుపకుండా టెండర్లు తిరస్కరించు అధికారము కార్యనిర్వహణాధికారి వారికి కలదు

ఇట్లు : **పోతిని శ్రీనివాసరావు,** ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

క్యాంపు కార్యాలయంలో వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ రాజన్

మార్టూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అమరావతి మన రాజధాని అబివృద్ధి పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేస్తున్న ప్రధానమంత్రి మోదీసభను విజయవంతం చేయాలని పర్చూరు నియోజకవర్గ పరిశీలకులు వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ రాజన్ చెప్పారు. మంగళవారం ఆయన ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ప్రధానమంత్రి మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలకులు రాజన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంతో పాటు అమరావతి ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి బహుముఖ ప్రణాళికలను రూపొందించారన్నారు. రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా కదలిరావాలని కోరారు. ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్న ప్రధానమంత్రి మోదీ బహిరంగ సభకు ఇంటికి ఒకరు తరలి రావాలని కోరారు. తిరుమల శెట్టి శ్రీహరి, షేక్ షంషుద్దీన్, తాటి నాగేశ్వరరావు,పొద వీరయ్యచౌదరి, కామేపల్లి హరిబాబు,షేక్ రజాక్, కామినేని జనార్దన్, తారకరామారావు, రావిపాటి సీతయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ రాజన్

ఘనంగా సాయిబాబా వార్షికోత్సవం

అవీఇవీ

వేందరవెంట్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : రావినూతలలోని శ్రీగణపతి దత్తాత్రేయ సహిత శ్రీషిరిడీ సాయిబాబా 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 6 గంటలకు కాగడ హారతి, 7.30 గంటలకు పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజాకార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజాకార్యక్రమాలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



పుష్పాలంకరణలో సాయిబాబా

పిల్లల సంరక్షణ సెలవులను మంజూరు చేయాలి



దీక్షలో పాల్గొన్న ఎన్ఎంయుఏ కార్మికులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలోని మహిళ ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని ఎన్ఎంయూఏ అద్దంకి డిపో సెక్రటరీ అనపర్తి వందనంబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అద్దంకి డిపో ఆవరణలో ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో సంస్థలో వివిధ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు ఎన్ఎంయూఏ జిల్లా సెక్రటరీ టి. శ్రీనివాసరావు, అద్దంకి డిపో ట్రెజరర్ మందా ఆంజనేయులులు పాల్గొని సంఘీభావం తెలిపారు. రీలే దీక్షలో డ్రైవర్లు వి. పుల్లారావు, ఎస్. ప్రకాశ్‌రావు, ఎస్‌కె. సురేష్, కండక్టర్‌లు ఎస్.మాధవి, ఎం. కోటేశ్వరమ్మ, ఏ. సుజాత పాల్గొన్నారు.

మత్స్యకార భృతి అందించి ఆదుకోవాలి

ఫిషరీస్ జేడీని కలిసిన వాడరేవు రెడ్డి సామాజిక వర్గం మత్స్యకారులు



జేడీకి వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి సామాజిక వర్గం మత్స్యకారులు

చీరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పూర్వీకుల నుంచే వేట సాగిస్తూ జీవిస్తున్నామని, మత్స్యకార భృతి అందించి ఆదుకోవాలని వాడరేవు గ్రామం రెడ్డి సామాజికవర్గం మత్స్యకారులు కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల వేట నిషేధ సమయంలో అందించే భృతిని రెండురోజుల క్రితం వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసింది. ఈక్రమంలో ఆ గ్రామానికి చెంది పూర్వీకుల నుంచే వేట సాగిస్తు జీవిస్తున్న రెడ్డి సామాజిక వర్గం మత్స్యకారులు మంగళవారం బాపట్ల ఫిషరీస్ జేడీ శ్రీనివాసనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన అధికారులు ప్రభుత్వం కార్పొరేషన్‌కు కేటాయించిన నిధుల్లో నుంచి జమ జరగాల్సి ఉందని, సాధ్యమైనంత వేగంగా సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కూడా వీరికి భృతి అందేందుకు సుమారు 6 మాసాలు కాలం పట్టింది.

శింగరకొండ రాతి మండపం నిర్మాణానికి విరాళం

అద్దంకి, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి విరాళాలు వస్తున్నాయి. అద్దంకి పట్టణంలో నివిస్తున్న పూటుకూరి నాగయ్య, వెంకటసుబ్బమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు కృష్ణసుభాన్, ప్రసన్న రాజ్యలక్ష్మి దంపతులు మంగళవారం 2.30 లక్షల రూపాయలను ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు.



విరాళాన్ని అందజేస్తున్న కృష్ణసుభాన్ దంపతులు

బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు

బీటెక్ విద్యార్థి మృతి, మరో యువకుడికి గాయాలు

మార్టూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మార్టూరు మండల పరిధిలో కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటన మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న గుంటుపల్లి భరణ్(19) తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మరో యువకుడు నల్లిబోయిన ప్రవీణ్ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో భరణ్ చనిపోయాడు. మృతుడు పల్నాడు జిల్లా మేడికొండూరు మండలం, డోకిపర్రు గ్రామానికి చెందిన వాడు. అతడు తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి ఒంగోలులో ఒక కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఈయర్ ఫీజు కట్టి వస్తున్నాడు. ఒంగోలు నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని గుంటూరు జిల్లా నల్లపాడు గ్రామానికి చెందిన కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. భరణ్ మృతదేహం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంది. అదేవిధంగా ప్రవీణ్‌కు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నారు.పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. మార్టూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



మృతుడు గుంటుపల్లి భరణ్(ఫైల్)

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

బుధవారం 30 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.8	27.4
కావలి	36	28
ఆత్మకూరు	39	27
ఉదయగిరి	39	27
కందుకూరు	36	28

మార్కెట్లోకి మధుర ఫలం

ఊరిస్తున్న తియ్యమామిడి, ఇమాంపసంద్, సువర్ణరేఖ

ఇప్పుడిప్పుడే మార్కెట్లో మెరుస్తున్న బంగినపల్లి

మరో వారంలో ముమ్మరంగా కోతలు

వాతావరణం మార్పులతో దిగుబడిపై ప్రభావం

అధిక వర్షాలు, నల్లతామరతో రైతు కుదేలు

వేసవి తాపంలోను మనసును ఉత్తేజపరిచే మధురఫలం మామిడి మార్కెట్లోకి వచ్చేసింది. రాష్ట్రంలోనేగాక దేశ, విదేశాల్లోను మామిడి మాధుర్యానికి కేరాఫ్ అడ్రస్‌గా గుర్తింపు పొందిన ఉలవపాడు మామిడి పండ్లు జాతీయ రహదారిపై కనువిందు చేస్తున్నాయి. తియ్యమామిడి, ఇమాంపసంద్, సువర్ణరేఖ, నాటుమామిడి వంటి రకాలు ఉలవపాడు వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటైన రిటైల్ మార్కెట్లో నోరూరిస్తున్నాయి. ఇక మామిడిలో రారాజు అయిన బంగినపల్లి మామిడి రకాలు ఇప్పుడిప్పుడే మార్కెట్లోకి వస్తున్నాయి. మరో వారం, పది రోజుల్లో మార్కెట్‌లోకి విరివిగా వచ్చే అవకాశం ఉంది.

- కందుకూరు, ఉలవపాడు (ఆంధ్రజ్యోతి)

మామిడి అంటేనే ప్రజల్లో ఉండే ఆత్రుతను సొమ్ము చేసుకునేందుకు ఓ మోస్తరు పక్వానికి వచ్చిన కాయలనే వ్యాపారులు కోసేసి ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం బంగినపల్లి మామిడి పండ్లు టన్ను రూ.60వేలు వరకు పలుకుతుండగా ముంబాయి, చత్తీస్‌ఘడ్‌లకు ఎగుమతి చేస్తున్నారు. రిటైల్ మార్కెట్లో కిలో రూ.100 నుంచి 120లకు విక్రయిస్తుండగా బంగినపల్లి మామిడి పండ్లను కొనుగోలుచేసేం దుకు జాతీయరహదారిపై ప్రయాణికులు పోటీలు పడుతున్నారు. మే మొదటివారం తర్వాత కోతలు ముమ్మరం కానున్నాయి. అలాగే తియ్యమామిడి, ఇమాంపసంద్, సువర్ణరేఖ తదితర రకాలు కిలో రూ.50 నుంచి 70 వరకు పలుకుతున్నాయి. ఇక నాటురకం మాత్రం టన్ను రూ.10వేలు వంతున పల్ప్, జ్యూస్ ఫ్యాక్టరీలకు ఎగుమతిచేస్తున్నారు.

● **పడిపోయిన దిగుబడులు**

డిసెంబరు ద్వితీయార్థం వరకు ఎడతెరపి లేకుండా వర్షాలు కురవటంతో మామిడి దిగుబడులపై తీవ్రప్రభావం చూపింది. సాధారణంగా నవంబరు ద్వితీయార్థంలోగా ఈ ప్రాంతంలో వర్షాలు పూర్తయి తెరపి వాతావరణం ఉంటుంది. దీంతో భూములు ఆరుదలకు రాగానే డిసెంబరు నుంచి మామిడితోటల్లో పూతలు ప్రారంభమై జనవరి ఆఖరునాటికి పిందెలు ఏర్పడతాయి. ఫిబ్రవరిలో వచ్చే శివరాత్రి నాటికి మామిడికాయలు శివలింగాలు అంత అవుతాయనేది నానుడి. అయితే ఈ ఏడాది డిసెంబరు ద్వితీయార్థం వరకు వర్షాలు కురవటంతో సంక్రాంతి పండుగ వరకు మామిడితోటల్లో పూతలే రాలేదు. జనవరి ద్వితీయార్థం నాటికి విపరీతంగా పూతలు రావటంతో దిగుబడి బాగా వస్తుందని రైతులు సంబరపడ్డారు. అయితే ఫిబ్రవరి ఆఖరునాటికి కూడా పూత పిందెగా మారే దశ పూర్తవకపోవటంతో ఆ సమయంలో తామరపురుగు కోలుకోలేని దెబ్బతీసింది. సాధారణంగా వచ్చే ఎర్రతామర, గోధుమవర్ణం తామరకు తోడు ఈ ఏడాది నల్ల తామర విజృంభించటంతో పూతలు, పిందెలు మాడిరాలిపోయాయి. ఉలవపాడుతోపాటు గుడ్లూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం, కందుకూరు మండలాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఉలవపాడు మండలంలో అత్యధికంగా 8వేల ఎకరాలలో తోటలు ఉండగా గుడ్లూరులో 3500 ఎకరాలు, మూడు మండలాల్లో 1500 ఎకరాలలో మామిడి తోటలు ఉంటాయని అంచనా. సాధారణంగా అన్నీ అనుకూలిస్తే ఎకరానికి నాలుగైదు టన్నుల దిగుబడి వస్తుంది. అయితే ఈ ఏడాది కేవలం 2వేల ఎకరాల్లో మాత్రం ఎకరానికి మూడు టన్నుల వరకు దిగుబడి రావచ్చని మిగిలిన 11 వేల ఎకరాల్లో ఎకరానికి సరాసరిన 1.5 టన్నులకు మించి దిగుబడి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఖర్చులు కూడా చేతికిరాక నష్టపోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **దేశీయంగా ఎగుమతులు**

కొన్నేళ్లుగా ఆశించిన దిగుబడులు రాక నష్టపోతున్న రైతులు అంతర్జాతీయ ఎగుమతులు కూడా లేకపోవటంతో గిట్టుబాటు ధరలు రాక తీవ్రంగా నష్టపోతున్నారు. కోతలు ప్రారంభమయ్యే సమయంలో పదిరోజులు, కాయలు అయిపోయేదశలో 15 రోజులు కిలో రూ.100వరకు అమ్ముకుంటుండగా మిగిలినరోజుల్లో కిలో రూ.30 నుంచి 40లకే తెగనమ్ముకోక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గతంలో ఈ ప్రాంతం నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి తదితర నగరాలకు పెద్దఎత్తున మామిడి ఎగుమతులు జరిగేవి. అయితే ఇటీవలికాలంలో కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మామిడిసాగు పెరగటం, తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ మామిడి సాగు గణనీయంగా పెరగటంతో బెంగళూరు, హైదరాబాద్‌లకు ఉలవపాడు ప్రాంతం నుంచి ఎగుమతులు తగ్గిపోయాయి. దీంతో ప్రస్తుతం ఈ ప్రాంత వ్యాపారులు చత్తీస్‌ఘడ్, భువనేశ్వర్, ముంబయి నగరాలపై దృష్టిపెట్టి ఎగుమతులు చేస్తున్నారు. బెంగళూరు నుంచి అడపాదడపా దుబాయ్, లండన్‌లకు కూడా ఉలవపాడు మామిడిపండ్లు ఎగుమతి అవుతున్నాయి. ఎంత చేసినా దేశీయ మార్కెట్‌లపైనే ఆధారపడాల్సిన పరిస్థితుల్లో రిటైల్ విక్రయాలనే ప్రధానంగా నమ్ముకుని మామిడిపండ్లను తెగనమ్ముకోవాల్సిన దుస్థితిలో రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది కూడా మరో వారంరోజులు గడిస్తే మామిడి ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, ఓవైపు దిగుబడులు లేక మరోవైపు ధరలూ లేక మా పరిస్థితి ఏమిటోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.



తామరపురుగు దెబ్బతీసింది

మామిడిలో పూతలు దండిగా వచ్చినప్పటికి అనూహ్యంగా వచ్చిన వాతావరణ మార్పులతో పూతలు నిలబడలేదు. దీనికితోడు తేనెబంక, త్రిప్స్ ఇంకా మామిడి పూతపై అధిక ప్రభావం చూపడంతో ఎన్ని సార్లు మందులు పిచికారి చేసిన పూతలు, పిందెలు కాపాడుకోలేకపోయాం. ఈ ఏడాది లింగసముద్రం మండలం పరిసర ప్రాంతాల్లో 100 ఎకరాలు కౌలు తీసుకున్నాం. కౌలు చెల్లింపు, సేద్యం పెట్టుబడిలో సగానికిపైగా నష్టాలు నవిచూడక తప్పదనిపిస్తోంది.

- పందిళ్ల నాగరాజు, మామిడి కౌలు రైతు



కౌలురైతుకు కన్నీళ్లే!

ఎర్రనేలల్లో మామిడి ఈ ఏడాది కంటతడి పెట్టించింది. మాకున్న 5 ఎకరాలు కాకుండా మరో 16 ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. ఆశించినంత పూతలు వేసినప్పటికి త్రిప్స్, తేనెమంచు ఆశించడంతో ఐదారుసార్లు మందులు పిచకారీ చేసినా పూత నిలబడకపోవడంతో మందులు కొట్టడం కూడా ఆపేశాం. 20 శాతం కంటే తక్కువ పంట నిలబడింది. రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టగా రూ.లక్ష చేతికొస్తే మహాభాగ్యం అన్నట్లు ఉంది మా పరిస్థితి.

- దమ్ము రవికుమార్



● **హైవేపై వెలసిన దుకాణాలు**

ఉలవపాడు జాతీయ రహదారికి ఇరువైపులా అదేవిధంగా రాజుపాలెం, చాగొల్లు, వీరేపల్లి వరకు పదుల సంఖ్యలో మామిడి అంగళ్ల వెలిశాయి. ప్రస్తుతానికి రోడ్డుపై మార్కెట్ ధరకంటే రెండింతలకు అమ్ముతున్నారు. మరో 15 రోజుల వరకు బంగినపల్లి రకానికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అంగళ్ల వ్యాపారులు వాహనదారులకు అధిక రేట్లకు విక్రయిస్తున్నారు.



ఆత్మకూరులో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ ఇతర అధికారులు

1న సీఎం పర్యటన ఖరారు

ఆత్మకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 1వ తేదీ గురువారం ఆత్మకూరు పర్యటన ఖరారయ్యింది. ఉదయం 11.30 గంటలకు ఆత్మకూరులోని బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు సీఎం చేరుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరి 11.50లకు నెల్లూరుపాళెం చేరుకుని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 12.10 నుంచి 12.30 వరకు నెల్లూరుపాళెంలోని భవన నిర్మాణ కార్మికులతో చంద్రబాబు మాట్లాడతారు. అనంతరం 12.35 గంటలకు నారంపేట సమీపంలోని ఏపీఐఐసీకి చేరుకుని ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభిస్తారు. అనంతరం 1.30 నుంచి 3 గంటల వరకు ప్రజావేదికలో స్థానికులతో ముఖాముఖిలో పాల్గొంటారు. ఆ తర్వాత 3.05 గంటలకు టిడ్కో మైదానానికి చేరుకుని టీడీపీ శ్రేణులతో మాట్లాడతారు. అనంతరం 4.40 గంటలకు తిరిగి హెలిప్యాడ్‌కు ఉండవల్లికి బయలుదేరివెళతారు.

● **ఏర్పాట్ల పరిశీలన**

ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను మంగళవారం ఉదయం కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ ఇతర అధికారులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. వారివెంట ఆర్డీవో బి పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఏపీఐఐసీ జడ్ఎం శివకుమార్, పరిశ్రమల శాఖ జీఎం మారుతిప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తదితరులు ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలకు గ్రీన్‌సిగ్నల్

మే 1 నుంచి 31వరకు నిర్వహణ ● జిల్లాలో 57 కేంద్రాల్లో తర్ఫీదు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మే 1 నుంచి 31వతేదీ వరకు నెల రోజులపాటు ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని తెలియచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 57 కేంద్రాల్లో యువతకు శిక్షణ ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్‌లచే ప్రతి క్రీడలో ప్రాథమిక స్థాయి నుంచి తర్ఫీదు అందించి మెలకువలను నేర్పించనున్నారు. ఇందుకుగాను పీఈటీలు, సీనియర్ క్రీడాకారులకు డీఎస్ఏ గౌరవవేతనం ఇవ్వడంతోపాటు క్రీడాపరికరాలను కూడా అందచేస్తారు. క్రమం తప్పకుండా శిక్షణకు హాజరైన విద్యార్థులకు చివరిరోజున సర్టిఫికెట్లు అందచేస్తారు.

● **తర్ఫీదు ఇచ్చే క్రీడలు**

ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, నెట్‌బాల్, రోలర్‌స్కేటింగ్, సెపక్ తక్రా, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, టెన్నిస్, వాలీబాల్, యోగా, అథ్లెటిక్స్, హాకీ, స్విమ్మింగ్ విభాగాల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక ప్రతిభ చూపిన క్రీడాకారులను గుర్తించి భవిష్యత్‌లో జరిగే పోటీల్లో అవకాశం కల్పిస్తారు.

సద్వినియోగం చేసుకోండి

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను బాల, బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. క్రీడాకారులుగా రాణించేందుకు భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా గుర్తింపు పొందేందుకు ఈ శిబిరాలను వేదిక చేసుకోవాలి. నెల్లూరు వాసులకు అనుకూలంగా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేశాము.

- ఆర్‌కె.యతిరాజ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

నేడు జడ్పీ సమావేశం

బడ్జెట్‌తోపాటు రెండు శాఖలపై చర్చ

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరగనుంది. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. ప్రధానంగా 2025-26 బడ్జెట్‌ను జడ్పీ పాలకులు ఆమోదించనున్నారు. ఈ మేరకు బడ్జెట్ రూపకల్పనకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. అలాగే వేసవి కావటంతో జిల్లాలో మంచినీటి సరఫరాపైనా ప్రధానంగా చర్చ జరగనుంది. ఆ తర్వాత అజెండాలో జిల్లా వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా తదితర ప్రభుత్వ శాఖలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించనున్నారు. మంత్రులతోపాటు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

21 మంది ఉపాధి ఉద్యోగులపై క్రిమినల్ కేసులు

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన 21 మంది ఉద్యోగులు, సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ డ్వామా పీడీ గంగాభవాని ఆదేశాలు జారీ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉదయగిరి మండలంలో చేపట్టిన పనులపై 17వ విడత సామాజిక తనిఖీ చేపట్టారు. ఉద్యోగులు, సిబ్బంది భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు బృందం గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసింది. దీంతో ఏపీవో, ఈసీ, టీఏలు, ఎఫ్ఏలు మొత్తం 21 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు దుర్వినియోగమైన రూ.47,62,832 లక్షలను రికవరీ చేయాలని ఎంపీడీవో కార్యాలయానికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీవో అప్పాజీ మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన ఉపాధి, ఉద్యోగులపై క్రిమినల్ కేసు నమోదుతోపాటు నిధులను రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వీఎస్‌యూలో అన్ని ఏర్పాట్లు పూర్తి

నేటి నుంచి సాఫ్ట్‌బాల్ టోర్నీ ప్రారంభం

'సోమశిల'కు భద్రతాలోపం

కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు

8 లో..

మత్స్యశాఖ ఇన్‌చార్జి జేడీగా శాంతి

● **నెలరోజులు సెలవుపై నాగేశ్వరరావు**

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ జిల్లా ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్(జేడీ)గా డాక్టర్ కే. శాంతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జేడీగా విధులు నిర్వహిస్తున్న ఎం.నాగేశ్వరరావు అనారోగ్య కారణాలతో నెలరోజులు సెలవుపై వెళ్లారు. దీంతో విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో జేడీగా విధులు నిర్వహిస్తున్న శాంతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె మే 27 వరకు బాధ్యతలు నిర్వహించనున్నారు.

కందలపాడు తిప్పపై మాఫియా కన్ను

● గ్రావెల్ తరలించేందుకు ప్రయత్నాలు
● మధ్యవర్తులుగా పోలీసుల రాయబారం?
● గ్రామస్థులు, రైతులతో పలుదఫాలు చర్చలు
● చావనైనా చస్తాంగాని ఒప్పుకోమంటున్న కర్షకులు
● అయినా ముమ్మరంగా ప్రయత్నాలు



కందలపాడు గ్రామంలోని తిప్ప



అడవిలో యంత్రాల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక మార్గం

వెంకటాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందలపాడు గ్రామంలో ఉన్న తిప్పపై గ్రావెల్ మాఫియా కన్ను పడింది. తిప్పను తవ్వి గ్రావెల్ తరలించేందుకు విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల కొందరు ప్రత్యేక యంత్రాలు పెట్టి టిప్పర్లు, ఇతర వాహనాలు రాకపోకలకు వీలుగా అటవీ మార్గంలో ప్రత్యేక రోడ్డు నిర్మించారు. ఇది తెలుసుకున్న గ్రామస్థులు, రైతులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. అంతేగాక కలెక్టర్, మైనింగ్, పొల్యూషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. అనుమతులు లేకుండా తిప్పను ఎత్తేందుకు పోలీసుల ద్వారా రాయబారాలు నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● **అనుమతులే లేవట!**

కందలపాడులో ఉన్న తిప్పను తవ్వేందుకు ఇటీవల యంత్రాలను తీసుకొచ్చారు. ఆ సమయంలో గ్రామస్థులు, రైతులు అడ్డుకుని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సూచనల మేరకు మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించి, మైనింగ్, పొల్యూషన్ అనుమతులు లేవని తేల్చి చెప్పారు. అయితే తిప్పను ఎత్తేందుకు తమపై పోలీసుల ద్వారా ఒత్తిడి చేయిస్తున్నారని అధికారుల వద్ద గ్రామస్థులు, రైతులు వాపోయారు. దీంతో అధికారులే పోలీసులకు ఫోన్ చేసి మరీ అనుమతులు లేకుండా మైనింగ్ చేపడితే వాహనాలు సీజ్ చేయాలని సూచించారు. కానీ ఈ ఆదేశాలు వారి చెవికెక్కలేదు. మళ్లీ గ్రామస్థులు, రైతులతో పోలీసులు రాయబారాలు సాగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రాయబారానికి వచ్చిన పోలీసులు, కొందరు నేతల ఎదుటే గ్రామస్థులు, రైతులు తాము చావడానికైనా సిద్ధమని, తిప్ప జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. దీంతో వారంతా చేసేది లేక వెనుతిరగాల్సి వచ్చింది.

● **మంత్రి లోకేష్‌కు, కలెక్టర్‌కు వినతులు**

మైనింగ్ తవ్వకాలను రద్దు చేయాలని కోరుతూ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు ఇటీవల వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు, కలెక్టర్, మైనింగ్ ఉన్నతాధికారులకు పలు మార్లు గ్రామస్థులు, రైతులు వినతిపత్రాలు అందజేశారు. తిప్ప చుట్టూ ఉన్న కొండపోరంబోకు భూమి లో కూరగాయలు, నిమ్మ చెట్లు, వరి వంటి పంటలు సాగు చేసుకుంటూ సుమారు 100 కుటుంబాలు జీవిస్తున్నాయి. 2022లో అప్పటి వైసీపీ హయాంలో అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థులు, రైతులంతా ఏకమై మైనింగ్ తవ్వకాలను వ్యతిరేకించారు. అధికారుల ఎదుటే పురుగు మందు డబ్బాలు, పెట్రోల్ క్యాన్లు చేతబట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తాజాగా మళ్లీ మాఫియా రంగంలోకి దిగడంతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. త్వరలో సీఎం చంద్రబాబును కలిసి తమ గోడును వెళ్లబోసుకుంటామని, అవసరమైతే న్యాయ పోరాటం చేసైనా తిప్పను కాపాడుకుంటామని కందలపాడు గ్రామస్థులు, రైతులు హెచ్చరిస్తున్నారు.

నేడే పాలిసెట్!

● **ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు**

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నెల్లూరులో 5, ఆత్మకూరులో 2, కావలిలో 3, కందుకూరులో 2 కేంద్రాల్లో బుధవారం పరీక్ష జరగనుంది. ఉదయం 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తుండగా, విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి గంట ముందుగానే అనుమతిస్తారు. నెల్లూరులో 2,599 మంది, ఆత్మకూరులో 527, కావలిలో 596, కందుకూరులో 351 మంది మొత్తం 4,073 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. కఠిన నిబంధనలను అమలు చేస్తూనే పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ఏసుదాసు తెలిపారు. హాల్‌టికెట్‌తోపాటు ఫొటో ఆధారిత ధృవపత్రంతో పరీక్షకు హాజరు కావాలని సూచించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్‌తోపాటు ఇతర అధికారులు కలిసి పరీక్ష కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.



నగరంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్, అధికారులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 435



చామదలలో డ్రోన్ సాయంతో పోలీసు నిఘా

జలదంకి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చామదలలో మంగళవారం ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా ఆధ్వర్యంలో డ్రోన్‌తో ప్రత్యేక నిఘా నిర్వహించారు. కలిగిరి పోలీస్ సర్కిల్ పరిధిలోని ఇద్దరు ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది గ్రామంలో డ్రోన్‌తో సర్వే చేశారు. గ్రామంలో పేకాట, కోడిపందేలు లాంటి అసాంఘిక కార్యక్రమాలు ఏమైనా జరుగుతున్నా అని నిఘా చిత్రాలు తీసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేసినా డ్రోన్ నిఘాలో కనిపెట్టి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

వారంరోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని హైవే రోడ్డులో టవర్ల ఏర్పాటు జరుగుతున్నందున రుద్రకోట, సర్వాయపాలెం ఫీడర్లలో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వారంపాటు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే రుద్రకోట సర్వాయపాలెం ఫీడర్ల నుంచి రైతులకు ఉదయం 4:30నుంచి సరఫరా ఉంటుదని చెప్పారు. వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

లింగసముద్రం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి అబ్రహంలింకన్ సూచించారు. సోమవారం మండలంలోని పెదపవని, ముత్యాలపాడు రైతు సేవా కేంద్రాలలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు నజీర్, ప్రేమ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

వీఎన్‌ఆర్ పేటలో విషాదం

● మరణంలో కూడా విడిపోని స్నేహితులకు కన్నీటి వీడ్కోలు

బిట్రగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో మంగళవారం విషాద చాయలు అలుముకున్నాయి. రాజుపాలెం జాతీయ రహదారిపై లారీ ఢీకొని మృతి చెందిన రామస్వామిపాలెం బత్తుల ప్రవీణ్‌కుమార్ (26), ఇబ్రహీంపేట షేక్ మన్సూర్ (27)ల మృతదేహాలను శవ పంచానామా అనంతరం కుటుంబసభ్యులు స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. స్నేహితులు, బంధువులతోపాటు ప్రజాప్రతినిధులు తరలివచ్చి నివాళులర్పించారు. మరణంలో కూడా విడిపోని స్నేహితుల పార్థివదేహాలను చూసిన స్థానికుల కళ్లు చమ్మగిల్లాయి. అలాగే గుండెపోటుతో మరణించిన సీనియర్ సిటిజన్ డోలా పురుషోత్తం (81) అంత్యక్రియల్లో రాష్ట్ర బీసీ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు, కుటుంబసభ్యులు పాల్గొని నివాళులర్పించారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ



హెల్మెట్ అందజేస్తున్న డాక్టర్ రామస్వామి

కావలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ ధరించి ప్రమాద సమయంలో ప్రాణ రక్షణ పొందాలని కావలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సుందరరావు తెలిపారు. ప్రొఫెషనల్ ఫొటోఅండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కావలిలో హెల్మెట్ దారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రంకురోడ్డులోని భాష్యం స్కూల్ నుంచి ఐలవ్ కావలి సెల్ఫీ పాయింట్ వరకు మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మరణిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రామస్వామి 300 మంది ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లకు సొంత నిధులతో హెల్మెంట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్ ప్రసాద్, కార్యదర్శి చిలకపాటి మధుబాబు, ఉపాధ్యక్షులు హనూక్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అభినందన

కందుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ప్రతిభ కనబరిచి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం అభినందించారు. శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన రామాల వైష్ణవి (593), గుర్రం ముఖేష్ (592)లను సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే భవిష్యత్తులోను ఇదే పట్టుదలతో చదివి ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చైతన్య విద్యాసంస్థల ఆర్ఐ అనిల్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బీ సురేష్, డీన్ బ్రహ్మయ్య, శివయ్య, ఏఓ సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దారి పొడుగునా అంగళ్లు!

మాలకొండ మార్గంలో విచ్చలవిడిగా దుకాణాలు

భక్తుల రాకపోకలకు అసౌకర్యం

వలేటివారిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి ముఖద్వారం వద్ద నుంచి కొండపైకి మెట్లమార్గంలో భక్తులు నడిచి వెళ్లే రహదారిపై ఇష్టనుసారంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో భక్తులు రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. మాలకొండకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతి శనివారం వేలాదిమంది భక్తులు వస్తుంటారు. వారిలో కొంతమంది భక్తులు మెట్లమార్గంలో కొండ కింద ముఖద్వారం వద్ద నుంచి మెట్లకు పసుపు కుంకుమతో పూజిస్తూ వెళ్తుంటారు. అలాంటి సమయంలో రహదారిపై దుకాణాలు నిర్వహిస్తుండంతో వాహనదారులు భక్తులు ఎదురెదురుగా వచ్చే సమయంలో పక్కకు వైదొలిగే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి భక్తులకు ఇబ్బందులు లేకుండా దుకాణాలను రహదారిపై నుంచి వెనుకకు పెట్టించాలని భక్తులు కోరుతున్నారు.



మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించటానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుట్టుశిక్షణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కందుకూరు రూరల్ మండలం, పట్టణ పరిధిలోని మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళా సాధికారత లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఈ శిక్షణ కేంద్రంలో మహిళలకు 90 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వటంతో పాటు వారికి ఉచితంగా కుట్టుమిషన్ కూడా అందజేయటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ కోసం విచ్చేసిన మహిళలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నెల్లూరు బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, నార్నె రోశయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, రఫీ, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు, వడ్డెళ్ల రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'దామిశెట్టి'కి రెడ్‌క్రాస్ నివాళి



దామిశెట్టి శ్రీనివాసులు నాయుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో మంగళవారం కావలి రెడ్ క్రాస్ జీవితపోషక సభ్యులు, వాక్సిన్ సెంటర్ దాత దామిశెట్టి శ్రీనివాసులు నాయుడి సంతా ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ బాధ్యులు ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఉపా ధ్యక్షులు బెజవాడ రవికుమార్ మాట్లాడారు. శ్రీనివాసులు నాయుడు చిన్నతనం నుంచి కష్టపడి పారిశ్రామిక వేత్తగా విద్యాదాతగా ఎదిగారని గుర్తుచేశారు. రెడ్‌క్రాస్ పోషకసభ్యు లు రఘుకుమార్ రెడ్డి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ పామూరు శ్రీధర్, రెడ్‌క్రాస్ చైర్మన్ డీ. రవిప్రకాష్, జేవీవీ అధ్యక్షులు తోట వెంకటేశ్వ ర్లు, గాదిరెడ్డి మురళీ క్రిష్న తదితరులు శ్రీనివా సులు నాయుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యు లు కలికి శ్రీహరిరెడ్డి, కే. హరినారపరెడ్డి, ఓరు గంటి వెంకటేశ్వర్లు, బీఎస్ ప్రసాద్, ప్రణీత. నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పేటలోని విశ్రాంత పోస్ట్‌మాస్టర్ కొల్లిపొర కోదండరామయ్య సతీమణి సుగుణమ్మ మృతిచెందింది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మంగళవారం గ్రామానికి వెళ్లి కుటుబసభ్యులను పరామర్శించారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు నెల్లూరు నరసారెడ్డిని కలుసుకొని క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులతో కలిసి మాట్లాడారు. కార్యకర్మంలో మేడా కృష్ణారెడ్డి, బిట్రగుంట చైతన్య, వెంకటేశ్వర్లురెడ్డి, సామంతుల పరంధామరెడ్డి, ఇస్మాయిల్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీద రవిచంద్ర

రెండోరోజు ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కావలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం డిపో ఎదుట రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. రెండోరోజు దీక్షలను లోక్‌సత్తా నాయకుడు మాలకొండారెడ్డి ప్రారంబి మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని. సర్క్యులర్ 1-2019ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ను వెంటనే నిలిపివేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు కుందుర్తి వెంకటేశ్వర్లు,సహాయ అధ్యక్షులు మల్లికార్జున, సహాయ కార్యదర్శి వెంకయ్య, డిపో కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి ఎం.ఎ.కలామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ సుబ్బయ్య, కమిటీ సభ్యులు ఎం.చెన్నారెడ్డి, డోలా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎడగారుకు కేఎన్ఎం అనుకూలం

● పెన్నా డెల్టాలో 70 శాతం కేఎన్ఎం 1638 సాగు ● ప్రత్యామ్నాయంగా కేఎన్ఎం 733 రకం ఎంపిక ● జిల్లాలో విత్తన సేకరణలో రైతుల నిమగ్నం

అల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పెన్నార్ డెల్టా ఆయకట్టు పరిధిలోని 3.69 లక్షల ఎకరాల్లో ఎడగారు సాగుకు ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అధికారులు సమీక్షలు, సమావేశాలు నిర్వహించి 41 టీఎంసీల సాగునీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో రైతులు అనుకూలమైన వరి విత్తనాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఎడగారులో అధిక ఉష్ణోగ్రతను తట్టుకోవడం, కోతల సమయంలో వాలిపోకుండా ఉండడం, తెగుళ్లను తట్టుకోవడం, తక్కువ కాల పరిమితి, అధిక దిగుబడు లు, మార్కెట్లో గిరాకీ ఉండడం ఈ లక్షణాలు కలిగిన వరి వంగడాన్ని మాత్రమే ఎంపిక చేసుకుంటారు. గతంలో రైతులు ఎన్ఎల్ఆర్ 34449 (నెల్లూరు మసూరి), ఎంటీయూ 1010 రకాలను అత్యధికంగా వినియోగించేవారు. అయితే ఇవి సమర్థవంతమైనవి అయినప్పటికీ దిగుబడి అనుకున్నంత రావడం లేదని రైతులు ప్రత్యామ్నాయం వైపు దృష్టిపెట్టారు.



● **కేఎన్ఎం 1638 రకంపై ఆసక్తి**

పెన్నార్ డెల్టా ఆయకట్టు పరిధిలో రైతులు అత్యధికంగా కేఎన్ఎం 1638 రకం వరి వంగడాన్ని సాగు చేపట్టేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. అధిక ఉష్ణోగతను తట్టుకోవడం, తెగుళ్లను ఎదుర్కోవడం, దిగుబడి, మార్కెట్లో గిరాకీ కలిగిన ఈ రకం వరి వంగడాన్ని ఈ దఫా 70 శాతం మంది రైతులు సాగు చేపట్టేందుకు సిద్ధమైపోయారు. 135 రోజుల తక్కువ కాల పరిమితి కలిగిన వరి వంగడం కావడం, ఎండ తీవ్రతకు వాడిపోకుండా ఎల్లప్పుడూ పచ్చదనంతో నిండి ఉండడం, అన్నం పరంగా నాణ్యతను కలిగి ఉండడంతో ఈ రకం విత్తనాల కోసం పరుగులు తీస్తున్నారు.

● **కేఎన్ఎం 733, ఎంటీయూ 1010**

కేఎన్ఎం 1638 రకానికి ప్రత్యామ్నాయంగా దశాబ్దాల నుండి వాడుకలో ఉన్న ఎంటీయూ 1010 రకంతోపాటు కేఎన్ఎం 733 రకాన్ని రైతులు 25 శాతం విస్తీర్ణంలో పండించేందుకు సిద్ధంగా ఉన్నారు.. కేఎన్ఎం 733 రకం వరి వంగడం అత్యంత సన్నజాతి రకానికి చెందినది కావడంతో ఇవి నాణ్యతాపరమైన ఉత్పత్తిని ఇవ్వడంతోపాటు అధిక ధర కూడా పలుకుతాయి. అదేవిధంగా ఎంటీయూ 1010 గత నాలుగు దశాబ్దాలుగా మనుగడలో ఉన్న నమ్మకమైన వంగడం కావడంతో రైతులు దీనిని పండించేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. మార్కెట్లో కూడా దీనికి నేటికీ గిరాకీ ఉండడం విశేషం. ఇవి రెండు కూడా ఉష్ణోగ్రతను, తెగుళ్లను తట్టుకొని దిగుబడి విషయంలో ఆశాజనకమైన ఫలితాలను ఇవ్వడంతో వీటిపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

● **యాజమాన్య పద్ధతులు కీలకం**

కేఎన్ఎం రకం వరి వంగడం సాగులో నారుమడి యాజమాన్యం కీలకం. వేరు వ్యవస్థ అత్యధికంగా ఉండడంతో నారు పీకే సమయంలో గట్టిదనం ఉంటుంది. నేలను గుల్లబారే విధంగా చర్యలు చేపట్టి నారును పీకాల్సి ఉంటుంది. డ్రమ్‌సీడర్ విధానంలో సాగు చేపట్టేందుకు అనువుగా ఉంటుంది. ఒక్కొక్క మొక్కగా నాటిన ప్పటికీ దుబ్బు బాగా విస్తరించి దిగుబడికి దోహదం చేస్తుంది.

● **విత్తనాల సేకరణలో నిమగ్నం**

ఎడగారు సాగు చేపట్టేందుకు రైతులు చేయాల్సిన మొట్టమొదటి పని విత్తన సేకరణ. ఇది అత్యంత కీలకం కావడంతో రైతులు ముందుగానే తాము ఎంపిక చేసుకున్న విత్తనాలను సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. రేపో మాపో సాగు నీరు విడుదల కానున్న తరుణంలో ఇప్పటికే నారుమడులను సిద్ధం చేసుకున్న కొంత మంది రైతులు విత్తనాలను కూడా సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో కొంతమంది రైతులు డ్రమ్‌సీడర్ యంత్రం ద్వారా విత్తనాలను చల్లుకొని తద్వారా వరిసాగు చేపట్టేందుకు సిద్ధపడుతున్నారు. కాగా అత్యధికమంది రైతులు నారుమడి యాజమాన్యంపై ఆధారపడుతున్నారు.

గిరాకీ ఉన్న వంగడం కోసం వేచి ఉన్నాం



ఎడగారు సాగులో మార్కెట్లో గిరాకీ కలిగిన వరి వంగడం కోసం వేచి చూస్తున్నాం. ఇప్పటికే కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733 రకాలపై విచారిస్తున్నాం. మేలైన రకాలుగా ఇవి రెండూ కనపడుతున్న నేపథ్యంలో వీటి సాగు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. తక్కువ కాల పరిమితితో పంట పూర్తయ్యే ఈ రెండు రకాలు అనుకూలంగానే ఉన్నాయి.

- పోలిశెట్టి శ్రీనివాసులు, రైతు, ఉలవపాళ్ళ, దగదర్తి మండలం

ఎరువుల యాజమాన్యం కీలకం



ఎడగారు సాగులో ఎరువుల యాజమాన్యం కీలకం. అత్యధికంగా రైతులు కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733 రకాలను సాగు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నత్రజని ఎంత వరకో అంతే వినియోగించుకోవాలి. విరివిగా వినియోగిస్తే దిగుబడి కాలంలో పరిణామాలు తీవ్రంగా ఉండి నష్టపోయే ప్రమాదం ఉంది. పైరు ఏపుగా పెరిగితే వాలిపోవడం జరుగుతుండడంతో దగ్గర దగ్గరగా నాటుకొని ఎరువుల యాజమాన్యంలో ఈ రెండు రకాలకు నత్రజని తక్కువగా వాడుకుంటే పడిపోకుండా దిగుబడి తీసుకోవచ్చు.

- దేవళ్ళ శ్రీనివాసులు రెడ్డి, రైతు, విడవలూరు, విడవలూరు మండలం.

తక్కువ కాల పరిమితి వంగడాలను వినియోగించుకోవాలి



తక్కువ కాల పరిమితి కలిగిన వంగడాలను రైతులు వినియోగించుకోవాలి. ప్రస్తుతం మార్కెట్లో కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733 వరి వంగడాలను అత్యధికంగా రైతులు సేకరిస్తున్నారు. ఇవి కూడా కాలపరిమితి తక్కువ కలిగినవే. ఎరువుల యాజమాన్యం, నారుమడి యాజమాన్యంతోపాటు మెలకువలు పాటించి రైతులు సాగు చేపట్టాలి. చివరి ఆయకట్టు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి.

- వెంకటేశ్వర్లు వ్యవసాయాధికారి, అల్లూరు మండలం

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా



సమావేశం వాయిదా వేస్తునట్లు ప్రకటిస్తున్న ఎంపీడీవో నరేంద్ర దేవ్

వలేటివారిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం జరగవలసిన మండల సర్వసభ్య సమావేశం కోరంలేక ఎంపీపీ అనుమతితో వాయిదా వేసినట్లు ఎంపీడీవో నరేంద్ర దేవ్ తెలిపారు. ఎంపీపీ మాత్రమే సమావేశానికి హజరు కావడంతో కోరంలేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. మళ్లీ సమావేశం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని చెప్పారు.

ప్రతి నెలా గ్రామ సమాఖ్య సమావేశాలు నిర్వహించాలి : ఏపీఎం

లింగసముద్రం, ఏప్రి ల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో వీఓఏలు ప్రతీ నెలా గ్రామ సమాఖ్య సమావేశాలు నిర్వహించాలని మండల మహిళా సమాఖ్య ఏపీఎం కె సింహాద్రిరావు సూచిం చారు. సోమవారం స్థానిక మండల వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంగులూరి సునీత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపుల్లోని మహిళలను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా వీఓఏలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో సీసీలు, విఓఎలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ అబ్దుల్ హమీద్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీడీవో, అధికారులు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ అబ్దుల్ హమీద్ మండల ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని జడ్పీటీసీ సభ్యురాలు ఇంటూరి భారతి అన్నారు. వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్న తహసీల్దార్ అబ్దుల్‌అమీద్‌ను మంగళవారం ఎంపీపీ పానుగోటి మౌనిక, జడ్పీటీసీ ఇంటూరి భారతి, ఎంపీడీఓ నరేంద్రదేవ్‌తో పాటు పలువురు మండలస్థాయి అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు డేగా వెంకటేశ్వర్లు, ఇరపని సతీష్, సాధు శ్రీలత, చెన్నిబోయిన ఓబులుకొండయ్య, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, విద్యుత్ ఏఈ మధుబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శిరీషా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలి

● వ్యాపారులతో ఎస్ఐ నారాయణ

లింగసముద్రం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా షాపుల యజమానులు సహకరించాలని ఎస్సై ఎం నారాయణ కోరారు. మంగళవారం రాత్రి ఆయన స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పలువురు దుకాణాల యజమానులతో మాట్లాడుతూ షాపుల ముందు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నిలపకుండా చూడాలన్నారు. అలాగే షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతేగాకుండా బస్టాండ్ సెంటర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కూడా సహకరించాలని, దీని వలన నేరాలను నియంత్రించవచ్చన్నారు. అంతేగాకుండా సైబర్ నేరాల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్సై వెంట కానిస్టేబుల్ షేక్ నస్రుల్లా ఉన్నారు.



దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణ

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

ఉదయగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయిపేటకు చెందిన రాగి శివకృష్ణ తన భార్య రమ్య కనిపించడంలేదని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

ఎమ్మెల్సీ శ్రీకాంత్ జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు

కందుకూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ ఛైర్మన్, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ జన్మదిన వేడుకలను మంగళవారం కందుకూరులో ఘనంగా నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ మండల అధ్యక్షుడు నార్నె రోశ య్యల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద కేకు కట్‌చేసి ఉచితంగా పేదలకు భోజన ఏర్పాట్లు చేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిలకపాటి మధు, గడ్డం మాలకొండయ్య, వడ్డెళ్ల రవిచంద్ర, పువ్వాడి కోటయ్య, రావూరి రామకోటయ్య, కొత్తూరి సుధాకర్, ముప్పవరపు వేణు, పొడపాటి మహేష్, పోకూరి రాంబాబు, గుర్రం మధు, నవిడిబోయిన కృష్ణ, చుండూరి శ్రీకాంత్, మురారిశెట్టి సుధీర్, కోట కిషోర్, చెక్కా కేశవ, ఇస్కాల మధు తదితరులు పాల్గొన్నారు.

చుట్టుగుంటలో దాహం కేకలు

● నాలుగు రోజులుగా నీళ్ల రాక గ్రామస్థుల అవస్థలు



కందుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంటకు గత నాలుగురోజులుగా తాగునీటి సరఫరా జరగకపోవటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటితో పాటు గృహావసరాలకు కూడా నీరులేక నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామానికి వచ్చే మార్గంలో వాగువద్ద పైపులైను లీకేజి కారణంగా గతకొంత కాలంగా మంచినీటి పథకం ద్వారా నీటిసరఫరా సక్రమంగా జరగటం లేదని మున్సిపల్ అధికారులు స్పందించి గ్రామానికి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వనితా... ఓ వ్యాపారవేత్తా..!

అతివలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని తమ ప్రతిభతో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా పొదుపు ఉద్యమం ప్రారంభమైన తర్వాత డ్వాక్రా సంఘాల ద్వారా పేద, మధ్య తరగతి మహిళలు ఆర్థిక పురోగతిని సాధిస్తున్నారు. ఇప్పటికే ఎంతో మంది పొదుపు నగదు, రుణాలతో చిరువ్యాపారులుగా మారి కుటుంబానికి చేదోడుగా ఉంటున్నారు. తాజాగా పొదుపు మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. వారికి అధిక ప్రాధాన్యమిస్తూ ప్రత్యేకంగా రుణాలిచ్చి వ్యాపార రంగంలో ప్రోత్స హించేలా ప్రణాళికలు అమలు చేస్తోంది. దీంతో రకరకాల వ్యాపారాలు చేస్తూ మహిళలు ఆర్థిక పరిపుష్టి దిశగా సాగుతున్నారు.


కాఫీ పొడి తయారు చేస్తున్న మహిళ

- మహిళలు వ్యాపారులుగా ఎదిగేందుకు ప్రభుత్వ రుణం
- ప్రతి పొదుపు సంఘం నుంచి ఒకరికి అవకాశం
- జిల్లాలో 8127 మంది ఎంపిక, శిక్షణ
- రూ.125.10కోట్ల ఆర్థిక చేయూత

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మహిళల జీవనోపాదుల వృద్ధి, తలసరి ఆదాయం పెంచే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలోని ప్రతి పొదుపు సంఘం నుంచి ఒక మహిళను వ్యాపారవేత్తగా చేయడానికి చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 8510 మందిని వ్యాపారంవేత్తలుగా చేయాలని లక్ష్యం నిర్దేశించింది. ఇందుకుగాను డీఆర్‌డీఏ అధికారులు 8127 మందిని ఎంపిక చేశారు. వారికి పలు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన శిక్షణ ఇచ్చారు. రూ.125.10కోట్ల రుణాలను అందజేశారు.

● కుటుంబ వార్షికాదాయం రూ.లక్ష ఉన్న పేదలు తొలుత రూ.10 లక్షలతో వ్యాపారవేత్తలుగా ఎంపికయ్యారు. ఆ తరువాత చిన్న, మధ్య తరహా వ్యాపారవేత్తలుగా, చివరికి కుటుంబ వార్షికాదాయం రూ.కోటికిపైగా ఉండేలా పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేసింది.

● జిల్లాలోని 39,382 పొదుపు సంఘాల్లో ఉన్న 4,32,894 మంది సభ్యుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల వివరాలను అధికారులు సేకరించారు. వారి తలసరి ఆదాయం ప్రకారం వ్యాపారవేత్తలుగా ప్రోత్సహించే పథకానికి ఎంపిక చేశారు.

● తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాల్లోని సభ్యుల నైపుణ్యాలు పెంపొందించి వారు ఉద్యోగం లేదా వ్యాపారంలో స్థిరపడేలా చేశారు.

● పలు రకాల వ్యాపారాలు...

జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలు పలు రకాల వ్యాపారాల ద్వారా తమ జీవనోపాదులను మెరుగుపరుచుకుంటున్నారు. రూ.2లక్షల నుంచి రూ.20లక్షల వరకు విలువగల వ్యాపారాలు చేపట్టారు. వీరు తీసుకున్న రుణాన్ని ఐదేళ్లలో 9 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. సకాలంలో చెల్లించిన వారికి మరింత రుణం అందజేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని పొదుపు మహిళలు పచ్చళ్లు, అగరుబత్తులు, కొవ్వొత్తులు, కాఫీ పొడి తయారీ, వంటనూనె తదితర వ్యాపారాలు చేస్తున్నారు.


అమ్మకానికి ఊరగాయలు సిద్ధం చేస్తున్న పొదుపు మహిళలు

● బ్యాంకు లింకేజీ రుణాలు...

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 25,732 గ్రూపులకు రూ.1277.13 కోట్ల బ్యాంకుల లింకేజీ రుణాలు ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే లక్ష్యాన్నిమించి రూ.1369కోట్లు అందజేయడం విశేషం.

● పీఎంఎఫ్ఎంఈ

పీఎంఎఫ్ఎంఈ పథకం కింద మహిళా పారిశ్రామికవేత్తలకు యూనిట్ కాస్ట్ మీద రూ.10లక్షల వరకు 35 శాతం సబ్సిడీతో రుణాన్ని అందజేస్తున్నారు. జిల్లాలో 267 మందిని ఈ పథకానికి ఎంపిక చేశారు. దీనికింద మినీ రైస్ మిల్లులు, వాటర్ ప్యూరిఫయర్ల వ్యాపారం, ఊరగాయల వ్యాపారాలను మహిళలు చేస్తున్నారు.

● పీఎంఈజీపీ పథకం..

ఈ పథకం కింద కులాల వారీగా రుణాలు మంజూరు చేశారు. ఎస్సీ ఎస్టీలకు 35 నుంచి 45 శాతం, బీసీలకు 30 శాతం, మిగిలిన వారికి 20 శాతం సబ్సిడీతో రుణాలు అందజేశారు. ఈ రుణాలతో ఇటుకల బట్టీలు, బియ్యం తదితర వ్యాపారాలు చేస్తున్నారు. ఇలా ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు.


అగరుబత్తీల తయారీ..



మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు

పొదుపు సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి ఒక్కో సంఘం నుంచి ఒకరిని ఎంపిక చేశాం. పరిశ్రమల స్థాపనపై శిక్షణ ఇప్పించాం. వారు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తున్నారు. ఈ సంవత్సరం మరికొంత మందిని వ్యాపారవేత్తలుగా ఎంపిక చేస్తాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి లక్ష్యాల వివరాలు అందాల్సి ఉంది.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

వీఎస్‌యూలో అన్ని ఏర్పాట్లు పూర్తి

● నేటి నుంచి సాఫ్ట్‌బాల్ టోర్నీ

● హాజరుకానున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ప్రశాంతిరెడ్డి


వర్సిటీ మైదానంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

వెంకటాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రాంగణంలో అఖిల భారత అంతర యూనివర్సిటీల సాఫ్ట్ బాల్ టోర్నీ పోటీలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం నుంచి వచ్చే నెల 3వరకు మహిళల టోర్నీ జరుగనుంది. అందుకు వచ్చిన క్రీడాకారులు మంగళవారం క్రీడా మైదానంలో ప్రాక్టీస్ చేశారు. పోటీలో మొత్తం 95 జట్లు పాల్గొననున్నాయి. నాక్ అవుట్ దశలో 91మ్యాచ్‌లు జరుగుతాయి. కేవలం లీగ్ దశకు చేరేది నాలుగు జట్లేనని, ప్రతిరోజు ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం వరకు 35 మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం ప్రారంభ వేడుకకు ముఖ్యఅతిథులుగా సర్వేపల్లి, కోవూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలతో పాటు కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ హాజరుకానున్నారు. వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రతిష్టాత్మకంగా జరుగనున్న పోటీలకు సంబంధించి షెడ్యూల్‌ను మంగళవారం వర్సిటీ అధికారులు విడుదల చేశారు.

3 నుంచి సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మే 3, 4వ తేదీల్లో అండర్-14 బాల, బాలికల సౌత్‌జోన్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యా లయంలో మంగళవారం టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల్లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల నుంచి హాజరయ్యే బాలబాలికలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోటీలు నిర్వహించాలని కోరారు. పోటీల విజయవంతానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ భానుశ్రీ, అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ యుగంధర్, ఉపాధ్యాయులు రవిచంద్ర, లీలాధర్‌రెడ్డి, సభ్యులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, నాయకులు

నేడు వక్ఫ్ చట్టానికి నిరసన

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు జిల్లాలోని ముస్లింలంతా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం రాత్రి 9 నుంచి 9.15 గంటల వరకు ముస్లింలు తమ గృహాలు, వ్యాపార సంస్థల్లో లైట్లు ఆర్పి నిరసన వ్యక్తం చేయాలని రాజ్యాంగ పరిరక్షణ జేఏసీ పిలుపునిచ్చింది. మంగళవారం జర్నలిస్టు భవన్‌లో జేఏసీ నాయకులు ఎండీ ఇలియాజ్, ఎస్‌డీ నవీన్‌అహ్మద్, షకీల్‌అహ్మద్, అన్వర్‌బేగ్ విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజా ప్రయోజనాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు.

ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి


పెన్నాలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని దీన్‌దయాళ్‌నగర్‌లో సోమవారం అర్ధరాత్రి పెన్నాలో భారీగా ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఆయన తన అనుచరులతో అక్కడకు చేరుకొని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ కొందరు అక్రమార్కులు ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తూ మంత్రి నారాయణకు చెడ్డపేరు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు ఉచిత ఇసుక లక్ష్యాన్ని ఇలాంటివారు నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇసుక మాఫియా వెనుక ఎవరు ఉన్నారన్నది తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణయ్య, నాని, ప్రవీణ్, శ్రీనివాసులు నాయుడు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో యువకుడిని హతమార్చారు!

● పట్టపగలే దారుణం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని బైక్‌లపై వచ్చిన ఆరుగురు కాపుకాచి వెంబడించి నడిరోడ్డుపై కత్తులతో దాడి చేసి హత్య చేసిన ఘటన నాగాయగుంట శివారులో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఇస్కపాళెం పంచాయతీ పోలినాయుడు చెరువు గ్రామానికి చెం దిన ఎస్‌కే రసూల్ కొడుకు ఎస్‌కే పెద్ద రఫీ (44)కి అదే గ్రామంలోని మరోవర్గంతో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం పెద్దరఫీని హతమార్చేందుకు ప్రత్యర్థులు పథకం వేశారు. బావిమిట్ట ప్రాంతంలో తన ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి దున్నుతుండగా డ్రైవర్‌కు భోజనం తీసుకెళ్లేందుకు రఫీ తన అనుచరుడు అంజయ్యతో కలిసి బైక్‌పై వెళుతున్నాడు. మార్గమధ్య లో ప్రత్యర్థులు కనిపించడంతో మరోమార్గంలో రఫీ మరో మార్గంలోకి వెళ్లాడు. ఈ విషయం గమనించిన ఆరుగురు యువకు లు రెండు బైక్‌లపై వెంబడించి నాగాయగుంట, కొత్త ఒంగల్లు రోడ్డు వద్ద అడ్డగించి రఫీని కొయ్యితో తలపై కొట్టారు. అంజయ్య ను చంపేస్తామనడంతో ఆయన పరారయ్యాడు. రఫీని కత్తితో విచక్షణారహితంగా పొడిచి, తలపై పెద్దరాయి వేసి చనిపోయా డని నిర్ధారించుకున్నాక ఆ ఆరుగురు పరారయ్యారు. విషయం తెలుసుకున్న నాగాయగుంట యువకులు ఘటనా స్థలానికి చే రుకుని కొనఊపిరితో ఉన్న రఫీని ఆటోలో ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ వైద్యులు పరిశీలించి.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ ఐ సంతోషరెడ్డి సిబ్బందితో ఘటనా స్థలంలో విచారించారు. రఫీ తల్లిదండ్రులు, బంధువులు బుచ్చి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు నాగాయగుంట వద్ద హత్య జరిగిన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. భారీగా పోలీసు బలగాలు బుచ్చితోపాటు పోలినాయుడు చెరువు గ్రామానికి చేరుకున్నాయి.

'సోమశిల'కు భద్రతా లోపం

● కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఆయువుపట్టు వంటి సోమశిల జలాశయానికి భద్రత లోపిస్తోంది. ప్రాజెక్టు నిర్మాణం మనుగడలోకి వచ్చి నలభై ఏళ్లు కావస్తున్నా ఇంతవరకు ప్రత్యేక బలగాల ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు. ఇక రాష్ట్రంలో ప్రాధాన్యతపరంగా సోమశిల జలాశయానికి ప్రతేక గుర్తింపు ఉన్నా రక్షణ వ్యవస్థను కట్టుదిట్టం చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ కారణంగా డ్యాంకు భవిష్యత్తులో అసాంఘిక శక్తులతో ప్రమాదం



వాటిల్లే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గతంలో కేంద్ర నిపుణుల కమిటీ ఈ ప్రాజెక్టును సందర్శించి ప్రత్యేక రక్షణ వ్యవస్థ అవసరమని సూచించి, ప్రతిపాదనలు చేయాలని కోరింది. ఆ ప్రతిపాదనలు పంపి 13 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. నెల్లూరు జిల్లాకే కాకుండా కడప, తిరుపతి జిల్లాలతో పాటు తమిళనాడులోని చెన్నైవాసుల దాహార్తి తీరుస్తున్న సోమశిలకు రక్షణ వ్యవస్థ అనివార్యం కాగా ఉన్నతాధికారుల నిర్లక్ష్య ధోరణి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇకనైనా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌తో ప్రాజెక్టుకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లారైతాంగం కోరుతోంది.

కాగా, సోమశిల జలాశయంలో మంగళవారం 51.235 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కందుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని కంద్రావారిపాలెంలో మంగళవారం జరిగింది. కళ్లగుంట మంజుల (45) అనే మహిళ ఇంటివద్ద నీళ్లమోటారు వేసే క్రమంలో విద్యుత్ వైర్లు కాలికి తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహానికి రూరల్ ఎస్‌ఐ రమణయ్య పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

'పశు సంచార' సేవలకు గ్రీన్‌సిగ్నల్

● నెలాఖరులోగా పశువులకు వైద్య సేవలు ● రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



మనుబోలు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పశువులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన పశు సంచార వైద్యశాలలు ఎంతగానో ఉపయోగపడేవి. గత వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణ, మందుల పంపిణీ విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సంచార పశువైద్యశాలల సేవలు సగానికి సగం నిలిచిపోయాయి. వీటి ఆవశ్యకత గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం ఈనెలాఖరులోగా వీటిని పునఃప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది.

● 1962 టోల్‌ఫ్రీ నంబర్‌తో..

108తరహాలోనే పాడిరైతులు 1962కు ఫోన్‌చేస్తే వారి గ్రామాలకు సంచార వైద్యశాలలు వెళతాయి. ఒకవేళ అత్యవసర సేవల కోసం వాటిని హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా ఆవును వాహనంలోకి ఎక్కించి దగ్గర్లోని పశు ప్రాంతీయ వైద్యశాలకు తరలిస్తారు. జిల్లాలోని 18సంచార వైద్యశాలల వాహనాలకు డిసెంబర్ నాటికి అగ్రిమెంట్ కుదుర్చుకున్న సంస్థ గడువు ముగియడంతో సేవలు నిలిపి వేసింది. అలాగే అత్యవసర మందుల సరఫరా, పనిచేసే సిబ్బందికి ఆరునెలల వేతనం మంజూరు చేయలేదన్న ఆరోపణలున్నాయి. రెండో విడతలో మంజూరు చేసిన సంచార వాహనాలతో అడపాదడపా వైద్య సేవలు అందేవి.

● ప్రభుత్వం చర్యలు...

రాష్ట్రవ్యాప్తంగా 340సంచార వైద్యశాలల వాహనాల నిర్వహణకు టెండర్లు పిలిచింది. టెండర్లను భవ్య అనే సంస్థ దక్కించుకుంది. ఒక్కో వాహనం నిర్వహణకు నెలకు రూ.1.65లక్షలు ప్రభుత్వం చెల్లించనుంది. ఈ వాహనంలో వెటర్నరీ వైద్యుడు, డిప్లమో చేసిన కాంపౌండర్, డ్రైవర్ కం అటెండర్ ఉంటారు. కాల్‌సెంటర్ నుంచి ఫోన్‌రాగానే వారి దిశానిర్దేశం ప్రకారం ఈ వాహనం ఆయా ప్రాంతాల కు తరలించి వైద్యసేవలు అందిస్తారు. ఇందులో పనిచేసే వైద్యుడికి రూ.30నుంచి 40వేలు, కాంపౌం డర్‌కు రూ.20వేలు, అటెండర్‌కు రూ. 10,500వేతనం చెల్లిస్తారు.

● మూలనపడ్డ 9వాహనాలు

జిల్లాలోని సంచార వాహనాలు పశువైద్యశాలల ఆవరణంలో మూలన పడ్డాయి. నెలలరోజులు నిర్వహణ లేకపోవడంతో వాహనాల బ్యాటరీలు పాడైపోయాయి. టైర్లలో పాడై రోడ్లపై తిరగలేని పరిస్థితి. ఈ వాహనాలు రోడ్లపైకి రావాలంటే మరమ్మతులు తప్పనిసరి.

18 వాహనాలతో వైద్యసేవలందిస్తాం



జిల్లాలోని అన్ని నియోజకవర్గ గ్రామాల పశువులకు వైద్యసేవలందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జిల్లాలో 9వాహనాలు నడుస్తున్నాయి. మిగిలిన 9 వాహనాలకు టెండర్ దక్కించుకున్న సంస్థ మరమ్మతులు చేసి సిద్ధం చేస్తోంది. వచ్చేనెల నుంచి జిల్లావ్యాప్తంగా వాహనాలతో పశువుల వైద్యసేవకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- రమేష్ నాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

అల్లూరులో హాస్యనటులు బాబూమోహన్, సప్తగిరి


● రామకృష్ణ జూనియర్ కాలేజీలో సినిమా షూటింగ్ చిత్రీకరణ

అల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అల్లూరులో వారంరోజులుగా 'ఈమె సుబ్బమ్మ ఇదియే ఆమె కథ' అను టైటిల్‌తో ఎంఎంఆర్ ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై సినిమా షూటింగ్ కొనసాగుతోంది. ఈ చిత్రంలో నటించేందుకు ప్రముఖ హాస్యనటులు బాబూమోహన్, సప్తగిరి మంగళవారం అల్లూరుకు వచ్చారు. రామకృష్ణ జూనియర్ కళాశాలలో సోమవారం పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు కిరణ్ మాట్లాడుతూ అల్లూరు ప్రజలు తమ చిత్ర నిర్మాణానికి పూర్తి సహకారాన్ని అందించారని, ఇక్కడ షూటింగ్ చేపట్టడం సంతృప్తిగా ఉందని తెలిపారు. హాస్యనటులను చూసేందుకు స్థానిక ప్రజలు తరలివచ్చారు.



చంద్రప్రభ వాహనంపై భగవద్రామానుజులు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాథస్వామి ఆలయంలో భగవద్రామాను జాచార్యుల 1008వ తిరునక్షత్రం ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారికి పేట ఉత్సవం జరిగింది. ఉదయం తిరుమంజనం, సాయంత్రం మంగళ శాసనోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరు వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ కే.శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చేరదలచుకున్న అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఎక్కడ చేరదలచుకున్నారో ఆ కళాశాలను ఎంపిక చేసుకుని మే 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారికి కేటాయించిన రిజిస్టర్ కాపీని భద్రపరచుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్‌లను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో మే 26లోగా ధ్రువీకరించుకోవాలన్నారు. కౌన్సెలింగ్ జరిగే తేదీలను అభ్యర్థుల ఫోన్లకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియచేస్తామన్నారు. సందేహాలుంటే ప్రభుత్వ బాలుర ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు.

● బాలికల ఐటీఐలో...

వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషన్ టెక్నీషియన్, డ్రెస్ మేకింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బాలికలతోపాటు బాలురకు కూడా ప్రవేశాలకు అనుమతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.